శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48
నవచేతన పబ్లిషింగ్ హౌస్

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM ★★★★

బిఆర్ఎస్, బిజెపి మధ్య ‘బాహుబలి’ రేవంత్!
సమగ్ర మూల్యాంకనంతో పరీక్షకు ఎసరు
ఢిల్లీ పెద్దలకు కప్పం కట్టకుంటే... రేవంత్ పదవి ‘గోవిందా’
లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 111 | శుక్రవారం | 21-03-2025 | ఖమ్మం
Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**
పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## ఉద్యోగాల భర్తీలో బిఆర్ఎస్
# తీవ్ర నిర్లక్ష్యం

**గత ప్రభుత్వ వైఫల్యంతో పదేళ్ల జీవితం సర్వనాశనం**

- కారుణ్య నియామకాలు ఉద్యోగుల కుటుంబాల హక్కు
- పది నెలల్లో 50వేల ఉద్యోగాలిచ్చినప్పుడు పదేళ్ల కాలంలో ఎందుకివ్వలేదు
- బిఆర్ఎస్ ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం
- త్వరలోనే గ్రూప్స్ ఉద్యోగులను నియమిస్తామని ప్రకటన
- కొలువుల పండుగ కార్యక్రమంలో 922 మందికి నియామక పత్రాలు అందజేత
- ‘బిల్డ్ నౌ’ పోర్టల్‌ను ఆవిష్కరించిన సిఎం



గత పాలనకు, ప్రస్తుత పాలనలో కేవలం సిఎం, మంత్రులు మాత్రమే మారారు. అదే పోలీసు వ్యవస్థ, అధికార యంత్రాంగం కొనసాగుతోంది. గత పాలకులు పోలీసులతో అర్ధరాత్రి వేళ కోదండరామ్ ఇంటి తలుపులు పగులగొట్టించారు. అదే పోలీసులకు మేము ఆదేశాలు జారీ చేస్తే , కెటిఆర్ ఇంటి తలుపులను, వీపులను పగులగొట్టలేరా? గత పాలకుల తరహా తాము వారిని(బిఆర్ఎస్) అణచివేయలేమా? ఇలాంటి విధానానికి మేము వ్యతిరేకం
– సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్
పదేళ్ల కాలంలో తెలంగాణ అమరవీరుల ఆకాంక్షలు అమలు కాలేదని, ఉద్యోగాల భర్తీ విషయంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం,వారి వైఫల్యం కారణంగానే పదేళ్ల విలువైన కాలం కాలగర్భంలో కలిసిందని, అనేక మంది యువత జీవితాలు సర్వనాశనమయ్యాయని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కారుణ్య నియామకాలు ఉద్యోగుల కుటుంబాల హక్కు అని, అలాంటి హక్కును 2015 సంవత్సరం నుంచి గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని దుయ్యబట్టారు. తాము పది నెలల కాలంలో 57వేల ఉద్యోగాలను నియమించినప్పుడు, పదేళ్ల కాలంలో గత ప్రభుత్వం ఎందుకు నియమించలేకపోయిందని తరువాయి 2లో



05
నియోజకవర్గాల పునర్విభజనపై
### పార్లమెంటులో గందరగోళం
- ప్రతిపక్ష ఎంపిల నిరసన
- టీ–షర్టులపై పునర్విభజన వ్యతిరేక నినాదాలు

## ఇజ్రాయెల్ ఊచకోతను సమర్థిస్తారా?



పాలస్తీనాపై కేంద్రం వైఖరి సిగ్గుచేటు విధానం మార్చుకోవాలని మోదీకి సిపిఐ డిమాండ్

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం పాలస్తీనా ప్రజలకు మద్దతు ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) డిమాండ్ చేసింది. ఇజ్రాయెల్‌పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని తీవ్రంగా ఖండించింది. పాలస్తీనా ప్రజలకు మద్దతు ఇవ్వాలని కోరింది. ఇజ్రాయెల్‌పట్ల భారత ప్రభుత్వం బుజ్జగింపు ధోరణి అనుసరిస్తున్నదనీ ఈ విషయంలో పాలస్తినా ప్రజలు చేస్తున్న న్యాయబద్ధమైన పోరాటానికి మద్దతు ఇస్తూ ఒక దృఢమైన వైఖరి అనుసరించాలని గురువారం విడుదల చేసిన ప్రకటనలో సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం డిమాండ్ చేసింది. పాలస్తినాలో తరువాయి 2లో

# 30 మంది నక్సల్స్ కాల్చివేత

- ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి తుపాకుల మోత
- రెండుచోట్ల ఎదురు కాల్పులు
- డిఆర్‌జి జవాన్ మృతి
- బీజాపూర్ – దంతేవాడ జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతంలో కూంబింగ్
- జనవరి నుంచి ఇప్పటివరకు 113 మంది నక్సల్స్ హతం



ప్రజాపక్షం/భద్రాచలం
ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మరోసారి రక్తసిక్తమైంది. ఆ రాష్ట్రంలో గల బస్తార్ ప్రాంతంలో గురువారం వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ఎదురు కాల్పుల్లో 30 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఘటనను ఆ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు నిర్ధారించారు. బిజాపూర్ జిల్లాలో 26 మంది మావోయిస్టులు హతం కాగా, కాంకేర్‌లో సంయుక్తగా జరిపిన కాల్పుల్లో మరో నలుగురు మావోయిస్టులు మృత్యువాతపడ్డారు. ఇదిలా ఉండగా బిజాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో డిఆర్‌జి జవాన్ ఒకరు మృతి చెందారు. బీజాపూర్–దంతెవాడ జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతంలో పెద్ద ఎత్తున కూంబింగ్ ప్రారంభించారు. జిల్లాలోని గంగలూర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు తారసపడటంతో లొంగిపోవాలంటూ ముందుగా భద్రతా బలగాలు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ మావోయిస్టులు కాల్పులకు దిగారని, భద్రతా బలగాలు ఆత్మరక్షణలో భాగంగా ఎదురుకాల్పులు జరిపారని ఈ కాల్పుల్లో 26 మంది మావోయిస్టులు హతమయ్యారని బస్తర్ రేంజ్ ఐజి సుందర్ రాజ్ తెలిపారు. ఘటనా స్థలం నుండి మావోయిస్టుల మృత దేహాలతో పాటు తుపాకులు, పేలుడు పదార్ధాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కాల్పుల్లో డిఆర్‌జి జవాన్ కూడా మృతి చెందినట్లు ప్రకటించారు. మరో ప్రక్క కాంకేర్ నారాయణపూర్ జిల్లా అటవీ సరిహద్దుల్లో మరో ఎన్ కౌంటర్ చోటు చేసుకుంది. డిఆర్‌జి, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్) సంయుక్త బృందాలు కూంబింగ్ నిర్వహిస్తున్న క్రమంలో మావోయిస్టులు తారసపడటంతో ఇరు వర్గాల మధ్య హోరాహోరీగా సుమారు నాలుగు గంటల పాటు కాల్పులు చోటు చేసుకున్నాయి. జవాన్ల తుటాలధాటికి తాళలేని మావోయిస్టులు అడవుల్లోనికి జారుకోగా ఘటనాస్థలంలో పరిశీలించడంతో నాలుగు మావోయిస్టు మృతదేహాలు లభ్యమైనట్లు కాంకేర్ పోలీస్ సూపరింటెండెంట్ కళ్యాణ్ ఎలెసేలా వెల్లడించారు. ఈ ఘటనలో మావోయిస్టుల మృతదేహాలతో పాటు ఆటోమెటిక్ తుపాకులు తరువాయి 2లో




## బెట్టింగ్ యాప్స్ కేసులో
# కదులుతున్న డొంక
- సినీ నటీనటులపై కేసులు
- బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న రీతూచౌదరి, విష్ణుప్రియను విచారించిన పోలీసులు
- యూట్యూబ్ ఇన్‌ఫ్లూయెన్సర్స్ మెడకు బిగుస్తున్న ఉచ్చు

ప్రజాపక్షం/హైదరాబాద్
బెట్టింగ్ యాప్స్ వ్యవహారం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. గత కొద్ది రోజులుగా ఆర్‌టిసి ఎండి విసి సజ్జనార్ బెట్టింగ్ యాప్స్ పై వరుస పోస్టులు చేస్తూ.. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇప్పటికే యూ ట్యూబర్లు తరువాయి 2లో

## ఉద్యోగ ఉపాధి కల్పనకే
# మిస్ వరల్డ్ పోటీలు



- పర్యాటకశాఖ మంత్రి జూపల్లి
- పోటీలను మహిళా సాధికారత కోణంలో చూడాలి
- ప్రపంచ సుందరి క్రిస్టినా ఆసక్తికర వ్యాఖ్యలు

ప్రజాపక్షం/హైదరాబాద్
తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి పరిచయం చేయడం, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే మిస్ వరల్డ్ పోటీల ప్రధాన ఉద్దేశం అని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్ వేదికగా 72 వ మిస్ వరల్డ్ పోటీలు జరగనున్న విషయం తెలిసిందే. దీని కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ మిస్ వరల్డ్ పోటీలకు ముందు అధికారులు బేగంపేట్ టూరిజం ప్లాజాలో ప్రీ ఈవెంట్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 2024 ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా కూడా హాజరయ్యారు. అలాగే టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యాటక శాఖ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, టూరిజం సెక్రటరీ స్మితా సబర్వాల్, మిస్ వరల్డ్ లిమిటెడ్ సిఇఒ జూలియా మోర్లీ ఈ ప్రెస్ మీట్ లో పాల్గొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. అందాల పోటీని మహిళా సాధికారత కోణంలో చూడాలని మిస్ వరల్డ్ పోటీలపై ప్రతిపక్షాలు చేసే విమర్శలు పట్టించుకోకుండా పాజిటివ్ కోణంలో చూడాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 140 దేశాల నుంచి ఈ మిస్ వరల్డ్ పోటీలకు హాజరవుతున్నారని అంతర్జాతీయ మీడియా ఈ ఈవెంట్ కు వస్తుందన్నారు. తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించడానికి ఈ ఈవెంట్ ఉపయోగపడుతుందన్నారు. గడిచిన పదేళ్లుగా రాష్ట్రంలో టూరిజం తరువాయి 2లో

## రైతుల నిరసనల గళంపై..
# ఉక్కుపాదం

- శంభు-ఖనౌరీ వద్ద తాత్కాలిక నిరసన శిబిరాలు తొలగింపు
- జెసిబిలతో వేదికలు కూల్చివేత
- రైతులను తరిమికొట్టిన పోలీస్ బలగాలు
- పంజాబ్ పోలీసుల అదుపులో రైతునేతలు డల్లేవాల్, శర్వన్‌సింగ్ పాంధర్




**న్యూఢిల్లీ :** కనీస మద్దతు ధర కోసం ఏడాదికి పైగా కొనసాగిస్తున్న రైతుల నిరసనల శిబిరాలపై హర్యానా భద్రతా బలగాలు ఉక్కుపాదం మోపాయి. శంభు సరిహద్దు నుండి నిరసన తెలియచేస్తున్న రైతులు దేశ రాజధాని ఢిల్లీ వైపునకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో రైతులను నిరోధించేందుకు ఏర్పాటు చేసిన సిమెంట్ బారికేడ్లను హర్యానా భద్రతా బలగాలు గురువారం ఉదయం తొలగించడం ప్రారంభించాయి. గత ఏడాది తరువాయి 2లో



## రాష్ట్ర వ్యాప్తంగా
# 4 రోజులు వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం సూచన
- పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ ఎలర్ట్
- రానున్న మూడురోజుల్లో తగ్గనున్న ఉష్ణోగ్రతలు

ప్రజాపక్షం/హైదరాబాద్
రానున్న నాలుగురోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ క్రమంలో పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తాయని, రాబోయే మూడురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుతాయని తెలిపారు. అనంతరం మళ్లీ ఎండలు పెరిగేందుకు తరువాయి 12లో

## ఉగాది నుంచి
# సన్న బియ్యం



- తెల్లరేషన్ కార్డుదారులకు ఒక్కొక్కరికి ఆరుకిలోల చొప్పున సరఫరా
- మఠంపల్లిలో కార్యక్రమాన్ని ప్రారంభించనున్న సిఎం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

ప్రజాపక్షం/హుజూర్ నగర్ (మఠంపల్లి)
ఉగాది పర్వదినం నుండి తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి 6 కేజీల నాణ్యమైన సన్న బియ్యం అందిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లిలో జరిగే పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్నట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. దీనికి సంబందించిన ఏర్పాట్లను ఆయన గురువారం తరువాయి 2లో

## సమస్యల పరిష్కారమే
# కమ్యూనిస్టుల ఎజెండా

ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం సన్మాన సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట రెడ్డి



ప్రజాపక్షం/ నల్లగొండ ప్రతినిధి
సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడమే కమ్యూనిస్టుల ఎజెండా అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకటరెడ్డి అన్నారు. ఇటీవల కాలంలో ఎమ్మెల్యే కోటలో ఎంఎల్‌సి గా ఎన్నికైన సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం కు స్థానిక సిపిఐ కార్యాలయం మగ్దూమ్ భవన్‌లో ఘనంగా సన్మానం చేశారు. సన్మాన కార్యక్రమానికి పల్లా వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో ఎన్నికల ఒప్పందం కుదిరించుకొని ఎన్నికలో సిపిఐ ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పోటీ చేయడం జరిగిందని ఆ ఒప్పందం ప్రకారమే రెండు ఎంఎల్‌సిలు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ ఈసారి మునుగోడు నియోజకవర్గానికి చెందిన నెల్లికంటి సత్యం కు ఎంఎల్‌సి పదవి ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఎంఎల్‌సి పదవితో ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సకల జనుల సమస్యల పరిష్కారం కోసం తరువాయి 12లో

## మార్కెట్ మాయాజాలానికి
# మిర్చి రైతు చిత్తు
- పాట కంటే తక్కువ ధరకే కొనుగోలు
- కూలీ ఖర్చు కూడా రాక దిక్కుతోచని స్థితి



ప్రజాపక్షం / హనుమకొండ ప్రతినిధి
మార్కెట్ మాయాజాలానికి మిర్చి రైతులు మరోసారి చిత్తవుతున్నారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు భారీ స్థాయిలో మిర్చి వస్తుండడంతో వ్యాపారులు అమాంతం ధరలు తగ్గించేస్తున్నారు. జెండా పాట కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. తమకు కనీసం కూలీ ఖర్చులు కూడా రావడం లేదని మిర్చి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పలువురు రైతులు తాము తీసుకు వచ్చిన మిర్చిని ధర లేక కోల్డ్ స్టోరేజీలకు తరువాయి 12లో




క్యూబాలోని హవానా విశ్వవిద్యాలయంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న నాల్గవ అంతర్జాతీయ సంభాషణ సదస్సుకు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు కె. శ్రీనివాస్‌రెడ్డిని భారతదేశ ప్రతినిధిగా నిర్వాహకులు ఆహ్వానించారు. ‘తప్పుడు సమాచారం, మీడియా మార్పులను ఎదుర్కోవడం’ అంశంపై శ్రీనివాస్‌రెడ్డి పేపర్ ప్రెజెంటేషన్ చేసి సభికుల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా క్యూబా అధ్యక్షుడు మిగ్యుల్ డియాజ్ కానెల్‌తో శ్రీనివాస్‌రెడ్డి సెల్ఫీ.

ప్రపంచం

# ట్రంప్ సంరక్షణలో ఉక్రేన్ విద్యుత్ ప్లాంట్లు!



## జెలెన్స్కీతో ఫోన్ భేటీలో విషయం తారుమారు

**కీవ్ :** ఉక్రేన్‌లో విద్యుత్ ప్లాంట్లకు ఇక అమెరికా రక్షణవలయంగా ఉంటుంది! అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్–ఉక్రేన్ అధ్యక్షుడు వి.జెలెన్స్కీ మధ్య బుధవారం రాత్రి తొమ్మిది గంటలకు సుదీర్ఘ ఫోన్ సంభాషణ జరిగింది. ట్రంప్ నాయకత్వంలో ఈ ఏడాదిలోనే శాంతి సాధన జరుగుతుందని తాను విశ్వసిస్తున్నానని ఫోన్ సంభాషణ అనంతరం జెలెన్స్కీ అన్నారు. ఉక్రేన్‌లో ఉన్న విద్యుత్ ప్లాంట్ల సంరక్షణ యాజమాన్య బాధ్యతలు స్వీకరించేవిషయంపై ఈ సంభాషణ ప్రధానంగా జరిగిందని వైట్‌హౌస్ ప్రకటించింది. ఉక్రేన్‌లో ఉన్న అణు విద్యుత్ ప్లాంట్ల రక్షణ బాధ్యతల స్వీకరణ అవకాశాలపై కూడా చర్చ జరిగిందని తెలిపింది. ఐతే ఇది కేవలం రష్యా అధీనంలో ఉన్న జపోరిఝియా అణువిద్యుత్ కేంద్రానికి మాత్రమే వర్తిస్తుందని జెలెన్స్కీ తర్వాత చెప్పారు. ఈ చర్చల సందర్భంగా అదనంగా మరికొన్ని పేట్రియేట్ డిఫెన్స్ క్షిపణులను సమకూర్చాలని జెలెన్స్కీ కోరారు. యూరప్‌లో ఏవి అందుబాటులో ఉన్నాయో చూసి వాటిని సమకూర్చేందుకు ట్రంప్ అంగీకరించారనీ తర్వాత విదేశాంగమంత్రి మార్కో రుబియో, స్టీవ్ వాల్జ్ చెప్పారు. రష్యా అధ్యక్షుడితో ఈనెల 18వ తేదీన 90 నిమిషాలసేపు ఫోన్‌లో సంభాషించిన ట్రంప్ మరునాడు జెలెన్స్కీతో మాట్లాడారు. 30 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదన తర్వాత కూడా రష్యా తమ మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తోందని ఫోన్ సంభాషణలో ట్రంప్‌కు జెలెన్స్కీ ప్రధాన విషయంగా చెప్పారని వైట్‌హౌస్ ప్రకటన చెబుతున్నది. ఉక్రేన్ భద్రతకు తాము భరోసా ఇస్తామనీ, ఉక్రేన్ విద్యుత్ ప్లాంట్లను తమ అధీనంలోకి తీసుకుంటామనీ జెలెన్స్కీకి ట్రంప్ సలహా ఇచ్చింది.

ఈ ప్లాంట్లను నడపడంతో ఉక్రేన్‌కు అమెరికా చాలా సహాయకారిగా ఉంటుందని ట్రంప్ ఆయనకు చెప్పారన్నది వైట్‌హౌస్ ప్రకటన సారాంశం. ఒకరకంగా చెప్పాలంటే యూరోపియన్ యూనియన్ ఇన్నాళ్ళుగా ఉక్రేన్ తరపున కోరుకున్న భరోసా అమెరికా నుండి పరోక్షంగా లభించినట్లే అవుతుంది. రష్యా నుండి వాటికి ఎలాంటి హాని జరిగినా అందుకు అమెరికా బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ఫిబ్రవరి 28వ తేదీన జెలెన్స్కీ వాషింగ్టన్ పర్యటన సందర్భంగా ట్రంప్‌తో జరిగిన సమావేశంలో ప్రపంచదేశాలకు దిగ్భ్రాంతి కలిగించిన ''అరుపులాట'' తర్వాత వారిద్దరూ మళ్ళీ మాట్లాడుకోవడం ఇదే. ఐతే విచిత్రం ఏమిటంటే ఆనాడు వారిద్దరిమధ్య జరిగిన సంభాషణ తీవ్రతకు, ఈనాటి చర్చలకు ఎలాంటి పొంతనా లేకపోగా నాటికీ నేటికీ వారి ఆలోచనలు తారుమారుగా కనిపించాయి. రష్యా–ఉక్రేన్ మధ్య జరిగే శాంతి ఒప్పందంలో ఉక్రేన్ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఉండాలనీ, ఉక్రేన్ శాశ్వత భద్రత ప్రాతిపదిపై చర్చలు జరగాలని యూరోపియన్ యూనియన్ గడచిన నెలరోజులుగా గగ్గోలు పెడుతున్నది. ట్రంప్‌తో ఫోన్ సంభాషణ ఎంతో నిర్మాణాత్మకంగా జరిగిందని జెలెన్స్కీ చెప్పారు. సౌదీ అరేబియా నగరం జెడ్డాలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియా నాయకత్వాన మార్చి 11న అమెరికా–ఉక్రేన్‌ప్రతినిధుల మధ్య జరిగిన సమావేశంలో 30 రోజుల కాల్పుల విరమణ ఒప్పందానికి ఉక్రేన్ అంగీకారం తెలిపింది. రష్యాను ఒప్పించేబాధ్యత అమెరికాదేనని స్పష్టం చేసింది. ఆ మరునాడే ట్రంప్ దూత విట్‌కాఫ్ రష్యావెళ్ళి పుతిన్‌తో చర్చించారు. ఈ సమావేశ ఫలితంగా ఈనెల 18న పుతిన్–ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ జరిగింది.

### గాజాలో కరువు : తిండి–నీరుకోసం

# పాలస్తీనియన్ల పాట్లు

## మూడోరోజు ఇజ్రాయెల్ దాడుల్లో 71 మంది మృతి



**గాజా :** ఇజ్రాయెల్ సైనిక దళాలు గాజాలో తిరిగి యుద్ధం ప్రారంభించడంతో ప్రజలు మళ్ళీ ఇళ్లు వదిలి భయంతో పారిపోతున్నారు. భద్రత కొరవడి వణకిపోతున్నారు. వరుసగా మూడోరోజు గురువారం తెల్లవారకముందే గాజాపై ఇజ్రాయెల్ సైనిక దాడులు ప్రారంభించింది. ఈ దాడుల్లో ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో 71 మంది మరణించారు. ఈ దాడులతో గడచిన మూడు రోజులుగా గాజాలో మృతుల సంఖ్య 436కు పైగా పెరిగిందని గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రకటించింది. మృతుల్లో 183 మంది పిల్లలు ఉన్నారు. వెస్ట్‌బ్యాంక్‌లో కూడా దాడులు ఉధృతం చేస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నేతన్యాహూ హమాస్‌కు హెచ్చరిక చేశారు. ఆహారం కోసం పరుగులు తీస్తున్నారు. ప్రతి పదిమంది పాలస్తీనియన్లలో కేవలం ఒక్కరికి మాత్రమే మంచినీరు లభించే దారుణ పరిస్థితులు నెలకున్నాయి. గడచిన దాదాపు 17 రోజులుగా గాజాలోపలికి ఆహార సరఫరాలు నిలిచిపోవడంతో ప్రజలు మళ్ళీ కరువుబారిన పడ్డారు. దీంతో పాలస్తీనియన్లు ఆహారం, మంచినీరు వెతుకులాడుతున్నారు. వాటిని చేజిక్కించుకునేందుకు వలసలు మళ్ళీ భారీగా పెరుగుతున్నాయి. టెల్‌అవీవ్‌లోని బెన్‌గుయాన్ విమానాశ్రయం దిశగా ఇజ్రాయెల్‌పై రెండు బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించినట్లు హౌతీల అధికార ప్రతినిధి ఒకరు గురువారం టెలివిజన్ వార్తల్లో చెప్పారు. దీంతో దేశంలో సైరన్లు మోతమోగాయి. ఐతే ప్రజలు గాయపడినట్లు ఏ ప్రాంతం నుండీ వార్తలు అందలేదు. ఐతే తూర్పు ఖాన్ యూనిస్ దిశగా క్షిపణి ప్రయోగించామనీ, డజన్ల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారనీ హౌతీలు చెప్పారు. ఇరాన్ ప్రభుత్వ మద్దతుతో పనిచేస్తున్న హౌతీలు ఇజ్రాయెల్‌ను తమ శత్రువుగా ప్రకటించారు. గాజాలోకి మానవతాసహాయాన్ని పునరుద్ధరించేవరకూ ఇజ్రాయెల్‌పైన, ఎర్రసముద్రంలోనూ దాడులు చేస్తామని వారు ప్రకటించారు. అమెరికా తమపై చేసిన దాడులకు కూడా ప్రతీకారం తీర్చుకుంటామని వారు చెప్పారు. కాగా ఈనెల 15వ తేదీ నుండీ ఇప్పటివరకూ యెమెన్‌లో 30కి పైగా హౌతీల లక్ష్యాలను దెబ్బతీశామని అమెరికా వైమానికదళం ప్రకటించింది. గాజాలో 49,547 మంది మరణించారనీ, మరో 1,12,719 మంది గాయపడ్డారనీ గాజా ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రకటించగా, శిథిలాల్లో ఇంకా వేలమంది మృతుల శవాలు చిక్కుకుని ఉంటాయని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. దీని ప్రకారం ఈ మృతుల సంఖ్య 62,000 పైగా ఉంటుందని పేర్కొంది.

# ఎన్నికలవేళ ప్రతిపక్ష నాయకుడికి వేధింపులు

## టర్కీ వీధుల్లో వేలాదిమంది నిరసనల ప్రదర్శనలు



**అంకారా :** తుర్కియే (టర్కీ) అధ్యక్ష పదవికి ప్రధాన ప్రతిపక్ష అభ్యర్థిగా త్వరలో ఎన్నిక కాబోయే నాయకుడు ఎక్రెమ్ ఇమామ్ మోగ్లు (55)ను అవినీతి ఆరోపణలపై ప్రభుత్వం అరెస్టు చేయడంతో దేశంలో గురువారంనాడు తీవ్ర నిరసనలు చెలరేగాయి. దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లలో విద్యార్థులు ఆందోళనలు ప్రారంభించారు. ప్రజలు వీధుల్లోకి వచ్చారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. తనపై నిరాధారమైన, అక్రమ ఆరోపణలు ప్రభుత్వం చేసిందని మోగ్లూ అన్నారు. దేశంలో విశ్వవిద్యాలయాలు స్వతంత్రంగా ఉండాలని, విద్యాలయాలను రాజకీయాలకు దూరంగా ఉంచాలని ఆయన పిలుపు ఇచ్చారు. గడచిన ఏడాదికాలంలో ఇంతభారీస్థాయిలో ప్రజల్లో ఎర్డోగాన్ ప్రభుత్వంపై వ్యతిరేకత కనిపించలేదు. దర్యాప్తు పేరుతో ఆయనతోపాటు జర్నలిస్టులు, ఇతర పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలను 100 మందిని కూడా పోలీసులు అరెస్టు చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. దీంతో ఇస్లాంబుల్ గవర్నర్ కార్యాలయం నాలుగురోజులపాటు నగరంలో ఆంక్షలు అమలు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుతం ఇస్తాంబుల్ మేయర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మోగ్లుప్రధాన ప్రతిపక్షం సెక్యులర్ రిపబ్లికన్ పీపుల్స్‌పార్టీ తరపున త్వరలో అధ్యక్ష అభ్యర్థిగా ఎన్నిక కాబోతున్నారు. పార్టీ నుండి ఈ వార్త చూచాయిగా బయటకు రాగానే ప్రభుత్వం ఆయనను అవినీతి ఆరోపణలపై అరెస్టు చేయడం వివాదాస్పదంగా మారింది. అధ్యక్షుడు రెసిప్ తయ్యాప్ ఎర్డోగాన్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని నిరసన బయలుదేరింది. ప్రతిపక్ష అభ్యర్థి మోగ్లు అవినీతి పరుడనీ, నేరముఠాలకు సహాయం చేస్తున్నాడనీ, ఉగ్రవాదులకు సహాయం అందించే నేరసంస్థ నాయకుడుగా ఆయనను సందేహిస్తున్నట్లు ప్రాసిక్యూటర్ ఆరోపించి ఆయనను బుధవారంనాడు అదుపులోకి తీసుకున్నారు. 600 మంది సభ్యులుగల పార్లమెంటుకు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయి. ఏ పార్టీ ఐనా పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించాలంటే సదరుపార్టీకి కనీసం ఏడు శాతం మేరకు కనీస ఓటింగ్ ప్రజల్లో ఉండాలి. కానీ కొన్ని పార్టీలు పేరుకే ఉంటాయి గానీ, ఎన్నికల్లో కూడా పోటీ చేయవు. ప్రతిపక్షం తరపున కాబోయే అధ్యక్ష అబ్యర్థి మోగ్లూ స్వయంగా ఒక వ్యాపారవేత్త. 2019లో ఇస్తాంబుల్ మేయర్ పదవికి ఆయన 13వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. సొమ్ము లెక్కల్లో చూపించకుండా అక్రమంగా తరలిస్తున్నారనీ, నేరపూరిత చర్యలకు పాల్పడుతున్నారనీ నిషేధిత కుర్దిష్ వర్కర్క్ పార్టీకి ఆర్థిక సహాయం చేస్తున్నారని ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు ఆయనపై ఆరోపణలు చేశాయి.

### ఉక్రేన్‌కు భరోసాదళాలు!

# 'ఇష్టపడేవారి కూటమి' భేటీ



**లండన్ :** ఉక్రేన్‌కు నైతికంగా, సైనికంగా బలం చేకూర్చేందుకు యూరప్‌దేశాలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. ఉక్రేన్‌లో మోహరించే సైన్యాలను శాంతిదళంగా కాకుండా భరోసా దళంగా పేర్కొనాలని భావిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్–రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య మంగళవారంనాడు ఉక్రేన్‌పై సుదీర్ఘ ఫోన్ సంభాషణ తర్వాత యూరోపియన్ యూనియన్ ప్రయత్నాల్లో మరింత వేగం పెరిగింది. ఈ మేరకు లండన్‌లో గురువారంనాడు సాయంత్రం జరిగిన ''ఇష్టపడేవారి కూటమి'' (కొయిలేషన్ ఆఫ్ ద విల్లింగ్) సమావేశానికి బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ ఆతిథ్యం ఇచ్చారు. ఈ సమావేశానికి మీడియాను అనుమతించలేదు. దాదాపు 20 యూరప్ దేశాల అధికార ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారని అంచనావేశారు. నార్త్‌వుడ్‌లోని బ్రిటన్‌కు చెందిన శాశ్వత ఉమ్మడి కేంద్ర కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. కార్యాచరణలో ఈ శాంతి దళాల పనితీరు గురించి ఈ సమావేశంలో చర్చించారు. ఈ కూటమికి బ్రిటన్, ఫ్రాన్స్ నాయకత్వం వహిస్తున్నాయి. ఉక్రేన్ శాశ్వత శాంతి సాధించడానికి, తిరిగి బలం పుంజుకోవడానికి వీలుగా ఒక విశ్వసనీయమైన శక్తిగా ''ఇష్టపడేవారి కూటమి'' చెక్కుచెదరకుండా సుదీర్ఘ సేవలు అందించాలన్నదే సమావేశం ప్రధాన ఎజెండా అని బ్రిటన్ సాయుధ బలగాల మంత్రి ల్యూక్ పోలార్డ్ చెప్పారు. ఐతే ఈ విషయంలో ఇంకా కొన్ని ఆటంకాలు మిగిలే ఉన్నాయన్నారు. వ్లాదిమీర్ పుతిన్ ఒకవేళ ఉక్రేన్‌లో గెలిస్తే ఇక ఆగేప్రశ్నే ఉండదనీ, ఇతర ప్రాంతాలను ఎలా లొంగదీసుకోవాలా? అని ఆయన సుదీర్ఘ ప్రణాళికను ఆలోచిస్తాడనీ, ఇది యూరోపియన్ యూనియన్ కోరుకోవడంలేదని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా ఉక్రేన్‌లో నాటో దళాల ఉనికి ఉండకూడదనీ, స్టార్‌మర్ ప్రతిపాదించినట్లుగా ఒప్పందం అనంతరం ఉక్రేన్‌కు శాంతి దళాలు వెళ్ళకూడదనీ, నాటోలో ఉక్రేన్‌కు సభ్యత్వం ఇవ్వకూడదని పుతిన్ పదే పదే చెబుతున్నారు.

## సన్న బియ్యం (మొదటి పేజీ తరువాయి)

పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 84శాతం జనాభా తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్నారని, ప్రతి ఒక్కరికీ ఆరు కేజీల నాణ్యమైన సన్నబియ్యం ప్రభుత్వం అందజేస్తుందన్నారు. దొడ్డు రకం బియ్యం ప్రజలు తినకుండా రూ.5లకు కోళ్ళ ఫాంలు ఇతర వినియోగానికి అమ్ముకోవడంతో దుర్వినియోగం అవుతున్నాయని చెప్పారు. నిరుపేదల ఆకలిని తీర్చేందుకు సన్నబియ్యం పంపిణీ చేసి విప్లవాత్మక మార్పును తీసుకురాబోతున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వంగా ఎన్నికైన మొదటి రోజు నుండి ప్రజలకు ఉపయోగపడేలా రాష్ట్రంలో తాము అద్భుతమైన పాలన అందిస్తున్నామని చెప్పారు. సిఎం రాక సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు కోదాడ, హుజూర్‌నగర్ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్టీజోన్2 ఐజి సత్యనారాయణ, జిల్లా ఎస్‌పి నర్సింహ, అదనపు కలెక్టర్ పి. రాం బాబు, ఆర్‌డిఒ శ్రీనివాసులు, ఆలయ ఇఒ నవీన్, ధర్మకర్తలు చెన్నూరి మట్టిపల్లిరావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు. అంతకుముందు మఠంపల్లి మండలంలోని మట్టపల్లి గ్రామంలో కొలువైన శ్రీలక్ష్మీ నర్సింహ్మా స్వామి వారిని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి దర్శించుకున్నారు. వీరికి ఆలయ చైర్మన్, ఇఒ, పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

## తీవ్ర నిర్లక్ష్యం
(మొదటి పేజీ తరువాయి)

నిలదీశారు. తామే నోటిఫికేషన్లు ఇచ్చామని చెప్పుంటున్నవారు, అప్పుడే దీనికి సంబంధించిన నియామకాలు చేపడితే, ప్రస్తుతం తనకు నియామక పత్రాలు ఇచ్చే పరిస్థితి వచ్చేది కాదు కదా? అని ఎద్దేవా చేశారు. గ్రూప్1,2లో సుమారు రెండువేల వరకు ఉద్యోగాలను నియమించబోతున్నామన్నారు.

హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం 'కొలువుల పండుగ' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించింది. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలకపట్టణాభివృద్ధి శాఖలోని వివిధ పోస్టులకు 922 మందికి నియామక పత్రాలను అందజేశారు. అలాగే 'బిల్డ్‌నౌ ' పోర్టల్‌ను సిఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సిఎం రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవ్వగా, గ్రామీణ, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఎంఎల్‌ఎలు, జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి తదితరులు పాల్గొన్నారు. తమ కుటుంబ సభ్యులు నిజామాబాద్ ఎంపిగా ఓడిపోతే, ఎంఎల్‌సిగా, కరీంనగర్ ఎంపిగా ఓడిపోతే ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవులను ఆరునెలలుగా కూడా వారు ఖాళీ లేకుండా కారుణ్య నియామకాలను భర్తీ చేశారని, కానీ ప్రజలకు సంబంధించిన కారుణ్య నియామకాలను మాత్రం కరుణ చూపలేదని ఆరోపించారు. 'మీ కుటుంబ సభ్యులపైన చూపిన 'కారుణ్యం' పేదలపైన ఎందుకు చూపలేదని సిఎం ప్రశ్నించారు. గత ప్రభుత్వం ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న కొన్ని పోస్టులకు పోటీ పరీక్షలు నిర్వహించగా, ప్రశ్నాపత్రాలను అమ్ముకున్నారని, ఉద్యోగాలనూ అమ్ముకున్నారని, మరికొన్ని ఉద్యోగాలకు నోటిఫికేషన్లను జారీ చేసి, ఆ వెంటనే కొందరితో కోర్టులలో ఉద్యోగాలను నియమించకుండా స్టేలు తీసుకొచ్చారని సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఖాళీ పోస్టులు భర్తీ చేస్తారని నిరుద్యోగులు, వివిధ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు ఎంతో ఆశతోఎదుచూశారని, కానీ వారి ఆశలు, ఉద్యమ ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. హైదరాబాద్‌లో 'మిస్ యూనివర్స్' నిర్వహిస్తే ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారని సిఎం మండిపడ్డారు. ఈ కార్యక్రమం ద్వారా హైదరాబాద్ ప్రపంచ గ్లోబల్‌లో ల్యాండ్‌మార్క్‌గా నిలువబోతుందని, వందల కోట్ల రూపాయల ఆదాయం తెలంగాణకు రాబోతుందని వివరించారు. ఫార్ములా ఈ రేస్‌లో ప్రభుత్వ డబ్బులు కొల్లగొట్టారని,అందుకే కేసును ఎదుర్కొంటున్నారని వివరించారు. వారు ఉద్యమం ముసుగులో ఉన్నదంతా ఊడ్చుకుపోదామని అనుకున్నారన్నారు. పదేళ్ల పరిపాలన, పదినెలల పరిపాలనను ప్రజలు విశ్లేషించి, మార్కులు ఇవ్వాలని, తమకు పట్టు వచ్చిందా?లేదా నిర్ణయించాలని సూచించారు. ఎంతో పట్టుదలతో తెలంగాణ పునర్నిర్మాణానికి తాము ప్రయత్నిస్తున్నామన్నారు. కమీషన్ల కోసం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం అత్యధికంగా రూ.10.50వడ్డీతో రూ.1.50లక్షల కోట్ల రుణాలను తీసుకొచ్చారని, దీనిని రూ.5 నుంచి రూ.6 శాతం వడ్డీ తీసుకొచ్చేందుకు ఢిల్లీలో ప్రయత్నిస్తున్నామని, వడ్డీ తగ్గితే రూ.500 కోట్ల వరకు ఆదా అవుతుందని సిఎం వివరించారు. పదేళ్ల కాలంలో ఇసుక నుంచి రూ.700కోట్లను ఇసుక మాఫియా దోచుకున్నదని ఆరోపించారు. కోటీ 25లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక దొంగతనం జరిగిందని తెలిపారు. ఇసుక సరఫరాను చట్టపరంగా ఆన్‌లైన్‌లోకి తీసుకొచ్చామని సిఎం తెలిపారు. తాము ఉద్యోగాలు ఇవ్వలేదని, సాగునీటి ప్రాజెక్టలను నిర్మించలేదని, అందుకే ఇతరులు కూడా నిర్మించవద్దనే తమ ప్రయత్నాలకు కాళ్లలో కట్టెలు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని సిఎం రేవంత్‌రెడ్డి బిఆర్‌ఎస్‌నుద్దేశించి అన్నారు.

**ఎవరైనా ఆన్‌లైన్‌లోనే అనుమతులు పొందాలె :**
పదేళ్ల కాలంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ఒక్కో తప్పును సవరించుకుంటూ తాము ఒక్కో అడుగు ముందుకెస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో భవన నిర్మాణ అనుమతుల విషయంలో సామాన్యులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే, ఉన్నోళ్లు మాత్రం మ్యానువల్‌గా దరఖాస్తు చేసుకున్నారని, తద్వారా ఆ భూమికి యజమాని ఎవరో తెలియదని, కమీషన్లకు కక్కుర్తి పడి నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారని సిఎం ఆరోపించారు. ఈ విషయమై తాము అధికారులను ఆరా తీస్తే, వారు చెప్పినట్టే ఇచ్చామని సమాధానమిచ్చారని, అందుకే ఎవరోచెప్పిన వాటికి ఉద్యోగులు బలి కావొద్దని, ఎంత పెద్దవారైనా 'బిల్డ్ నౌ'' వెబ్‌సైట్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఇలాంటి నూతన సంస్కరణలతో లగ్జరీగా ఉన్నవారికి కొంత బాధలు ఉంటాయని, కానీ అందరూ క్యూలో రావాల్సిందేనని తెలిపారు.

**అక్కడ అభివృద్ధి సాధిస్తే.. దక్షిణాది రాష్ట్రాలకు ఎందుకు వస్తారు..?**
ప్రధాని మోదీ దేశంలో ఎంతో అభివృద్ధి సాధించామని చెబుతున్నారని, గుజరాత్, యుపిలో ఎంతో అభివృద్ధి జరిగిందని పలువురుచెబుతారని, అక్కడ అభివృద్ధి జరిగితే ఆయా రాష్ట్రాలకు చెందిన వారు ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం దక్షిణాది రాష్ట్రాలకు ఎందుకు వస్తారని సిఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అభివృద్ధికి, కష్టానికి మారుపేరు దక్షిణాదిలోని తెలంగాణ, ఎపి, కర్నాటక, తమిళనాడు అని, కానీ తమకు ఉత్తరాది తరహా మార్కెటింగ్ చేసుకునే తెలివితేటలు లేవని చెప్పారు.

**ప్రభుత్వంపై వ్యతిరేకత అంటూ సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం**
పది నెలల కాలంలోనే అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న తమ ప్రభుత్వంపైన కొందరు సోషల్ మీడియాలో పెట్టుబడులు పెట్టి, రాష్ట్ర ప్రభుత్వంపైన వ్యతిరేకత ఉన్నదంటూ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని సిఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాలు ఇచ్చినందుకు 59వేల మంది అభ్యర్థులు, రుణమాఫీ చేసినందుకు 25లక్షలకు పైగా రైతులు, ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసినందుకు మహిళలు, వారికి వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్ట్ పెట్టించినందుకు, 50లక్షల కుటుంబాలకు ఉచిత కరెంటు, 43లక్షల రూ.500లకే గ్యాస్ సరఫరా చేసినందుకు తనపైన వ్యతిరేక ఉంటుందా? అని ప్రశ్నించారు. ప్రస్తుతం 922 ఉద్యోగ నియామకాలు ఇచ్చినందుకు తనపై 'మీకు' అభిమానం ఉంటుందా?, లేదా కోపం ఉంటుందా అని ప్రశ్నించారు. ప్రతి రోజూ 18 గంటలు కష్టపడుతూ, సచివాలయానికి వెళ్తూ, అందరికీ అందుబాటులో ఉన్న తమకు పాలనపై పట్టు లేదా?, అదే సచివాలయానికి రాకుండా పాలన చేసినవారికి పట్టు ఉంటుందా? అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పాలనపైన పట్టు రావడం అంటే మంత్రిపదవుల నుంచి తొలగించడం కాదని ఎద్దేవా చేశారు. గత పాలకుల తరహా తాము కూడా సచివాలయంలోనికి రానివ్వకపోతే బిల్లుల కోసం ధర్నా చేసేవారా అని ప్రశ్నించారు.

## కదులుతున్న డొంక
(మొదటి పేజీ తరువాయి)

భయ్యా సందీప్, హర్షసాయిపై కేసులు నమోదు అయిన విషయం తెలిసిందే. అలాగే బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న విష్ణుప్రియ, యాంకర్ శ్యామల, రితూ చౌదరి లాంటి యాక్టర్స్‌తో పాటు మరి కొంతమందిపై పంజాగుట్ట పోలీసులు ఇటీవల కేసులు నమోదు చేశారు. తాజాగా మియాపూర్ పోలీసులు మరో అడుగు ముందుకు వేశారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న సినీ హీరోలు దగ్గుబాటి రానా, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, ప్రకాష్ రాజ్, ప్రణీత, నిధి అగర్వాల్‌లపై మియాపూర్ పోలీసులు బుధవారం రోజు కేసులు నమోదు చేశారు. వారిపై ఎఫ్‌ఐఆర్ నెంబర్ 393/2025 కింద కేసులు నమోదు కాగా, సెక్షన్లు 318 (4) 112, రెడ్ విత్ 49 బిఎన్‌ఎస్ 3,3(ఏ) 4, టిఎస్ జిఎ,66డి ఐటిఎ 20002008 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

**రీతుచౌదరి, విష్ణుప్రియలను విచారించిన పోలీసులు..**డబ్బులకు ఆశపడి బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన యూట్యూబ్ ఇన్ఫ్లూయోన్సర్స్ మెడకు కేసుల ఉచ్చులు బిగుసుకుంటున్నాయి. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన పలువురు తెలుగు ప్రముఖ నటులు, ఇన్ఫ్లుయెన్సర్స్‌పై పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో కేసులు నమోదుకాగా.. వారంతా విచారణను ఎదుర్కొంటున్నారు. కాగా గురువారం నటి విష్ణుప్రియను పంజాగుట్ట పోలీసులు 3 గంటలపాటు విచారించగా.. అనంతరం మరో యూట్యూబ్ స్టార్ రీతూ చౌదరిని పోలీసులు విచారించారు. విచారణ అనంతరం రీతూ చౌదరి ఓ వీడియోను విడుదల చేశారు. తెలిసో తెలియకో తాను బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసి తప్పు చేశానని ఒప్పుకున్నారు. అయితే అవన్నీ గతంలో చేశానని.. బెట్టింగ్ యాప్స్‌ను ఎవరూ నమ్మకండి అంటూ చెప్పింది. వాటిని నమ్మి ఎవరూ డబ్బులు మోసపోవద్దని రీతూ వీడియోలో పేర్కొంది. కాగా ప్రముఖ నటులు, యూట్యూబ్ ఇన్ఫ్లుయెన్సర్స్ బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఫణీంద్రశర్మ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు 11 మంది సెలెబ్రిటీలపై కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసులో తవ్వినకొద్దీ మరింతమంది టాలీవుడ్ టాప్ హీరోలు, హీరోయిన్ల పేర్లు బయటికి వస్తున్నాయి. కాగా వీరందరికీ పోలీసులు నోటీసులు పంపేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

## నక్సల్స్ కాల్చివేత (మొదటి పేజీ తరువాయి)

కూడా స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్లు చోటుచేసుకున్న ప్రాంతాల్లో తప్పించుకున్న మావోయిస్టుల కోసం పెద్ద ఎత్తున కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. తాజా ఎన్‌కౌంటర్‌తో ఈ సంవత్సరం జనవరి నుండి ఇప్పటి వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఎదురు కాల్పుల్లో మొత్తం 113 మంది మావోయిస్టులు హతమయ్యారు. వీరిలో 97 మంది బీజాపూర్, కాంకేర్‌తో సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్‌లోనే హతమార్చారు. ఈ ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హోంమంత్రి అమీత్‌షా స్పందిస్తూ దేశాన్ని మావోయిస్టు రహితంగా మార్చడంలో భద్రతా బలగాలు మరో పెద్ద విజయాన్ని సాధించాయంటూ ప్రశంసలు కురిపించారు. సంఘ విద్రోహ శక్తులను, దేశానికి నష్టం చేసేవారిని, అభివృద్ధిని అడ్డుకునే వారిని వదిలేది లేదని, కఠినమైన విధానాలు అవలంభిస్తామని అమిత్ షా ఎక్స్‌ఖాతాలో పోస్టు చేశారు.

## ఉక్కుపాదం
(మొదటి పేజీ తరువాయి)

కాలానికి పైగా మూసి ఉన్నటువంటి శంభు అంబాలా రోడ్‌పై నిర్మించిన కాంక్రీట్ బ్లాక్స్‌ను జెసిబి యంత్రాల సహాయంతో తొలగించారు. ఢిల్లీ చలో కార్యక్రమంలో భాగంగా పంజాబ్ నుంచి రైతులు ఢిల్లీ వైపునకు వెళ్లకుండా నిరోధించేందుకు పంజాబ్‌తో రాష్ట్ర సరిహద్దును సిమెంట్ దిమ్మెలు, ఇనుప మేకులు, ముళ్ల తీగలతో పటిష్టంగా నిర్మించారు. ఛండీగఢ్‌లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమావేశంలో పాల్గొన్న రైతునేతల కేంద్ర ప్రతినిధి బృందం తిరుగుముఖం పడుతుండగా మొహాలీలో జగ్‌జీత్ సింగ్ డల్లేవాల్, శర్వన్ సింగ్ పాంధర్ సహా పలువురు రైతు నాయకులను పంజాబ్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. శంభుఖనౌరీ నిరసన స్థలాల నుంచి పోలీసులు రైతులను తరిమికొట్టారు. ఒక సంవత్సర కాలంగా రహదారుల దిగ్బంధం చేసిన విషయం తెలిసిందే. అక్కడ రైతులు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక నిర్మాణాలను పోలీసులు తొలగించివేశారు. ఈ రెండు నిరసన స్థలాలలో రైతులు నిర్మించుకున్న వేదికలను జెసిబి యంత్రాలను ఉపయోగించి కూల్చివేశారు. ఛండీగఢ్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వం, రైతుల మధ్య 7వ రౌండ్ చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్‌కు కేంద్ర ప్రతినిధి బృందం తమ సమస్యలను విన్నవించాయి. ఈ సమావేశంలో రైతులకు చెందిన పలు డిమాండ్లపైన చర్చలు జరిగాయి. ప్రత్యేకించి తాము పండించిన పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కు చట్టబద్ధమైన హామీ ఇవ్వాలనే రైతుల డిమాండ్‌ను చర్చించారు. మొహాలీలో సమావేశం అనంతరం వెళ్లిపోతున్న రైతులకు భారీ బారికేడ్లు కనబడ్డాయి. పాంధర్, జగ్‌జీత్‌సింగ్ డల్లేవాల్‌తో పాటు అదుపులోకి తీసుకోబడిన రైతు నాయకులలో మంజిత్‌సింగ్ రాయ్, కాకా సింగ్ కొత్రా ఉన్నారని మాజీ నాయకుడు గురమ్నీత్ సింగ్ చెప్పారు. పంజాబ్ ఆర్థిక శాఖ మంత్రి హర్పాల్‌సింగ్ చీమా మాట్లాడుతూ రైతుల తొలగింపును సమర్థించారు. ఈ రెండు జాతీయ రహదారులను దీర్ఘకాలికంగా మూసివేయడంతో వ్యాపారం, పరిశ్రమలు బాగా దెబ్బతిన్నాయని, ఆ రెండు రంగాలు పంజాబ్ రాష్ట్రానికి జీవనాధారాలు అని పేర్కొన్నారు. రెండు జాతీయ రహదారులపై రైతులను తొలగించే కసరత్తుకు ముందు పోలీసులు భారీ సంఖ్యలో అక్కడ మోహరించారు.

**రెండు రైతు వ్యతిరేక పార్టీలు చేతులు కలిపాయ్ : మల్లికార్జునఖర్గే**
శంభుఖనౌరీ నిరసన స్థలాల నుంచి దేశానికి అన్నం పెట్టే రైతులను తొలగించేందుకు రైతు వ్యతిరేక పార్టీలైన బిజెపి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లు ఇప్పుడు కొత్తగా చేతులు కలపడం కనిపించిందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జునఖర్గే ఆరోపణల దాడి చేశారు. అధికార దురహంకార మత్తులో రైతులకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టేందుకు ఆ రెండు పార్టీలు రైతులకు ఎటువంటి అపరాధం చేయడానికైనా వెనుకాడడంలేదని మండిపడ్డారు. మల్లికార్జునఖర్గే సామాజిక మాధ్యమం 'ఎక్స్' హిందీ పోస్ట్‌లో ఈ ఆరోపణాస్త్రాలు సంధించారు. సీనియర్ రైతు నాయకులైన జగ్‌జీత్‌సింగ్ డల్లేవాల్, సర్వన్‌సింగ్ పాంధర్‌లను పంజాబ్ పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నప్పటికీ ఖండించకపోవడాన్ని బట్టే ఆ పార్టీలు రైతు వ్యతిరేకులు అని అర్థం చేసుకోవచ్చని మల్లికార్జున ఖర్గే విరుచుకుపడ్డారు.

**రైతులపై పోలీసుల దాడిని ఆక్షేపిస్తూ పంజాబ్ కాంగ్రెస్ ఎంపిల నిరసన**
ఏడాదికిపైగా పంజాబ్ రాష్ట్ర సరిహద్దుల్లోని శంభు ఖనౌరీ పాయింట్ల వద్ద కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కోసం నిరసన కొనసాగిస్తున్న రైతులపై పోలీసుల దాడిని వ్యతిరేకిస్తూ గురువారం పంజాబ్ ఎంపిలు పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ఎంపిలు సుఖ్‌జిందర్ రణ్‌ధావా, అమరీందర్‌సింగ్ రాజా వారింగ్, గుర్‌జిత్ అజులా, ధరమ్‌వీర్ గాంధీ పార్లమెంట్ మకరద్వారం వద్ద నిరసన చేపట్టారు. పంజాబ్ రాష్ట్రంలోని ఆప్ ప్రభుత్వం, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ బిజెపితో చేతులు కలిపారని ఆరోపణలదాడి చేశారు.

## మిస్ వరల్డ్ పోటీలు
(మొదటి పేజీ తరువాయి)

పాలసీ లేదని దాంతో టూరిజంలో రాష్ట్రానికి ఆదాయం లేదని విమర్శించారు. ప్రభుత్వం టూరిజాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగానే మిస్ వరల్డ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

**తెలంగాణ దేవాలయాలు మనకు చాలా నేర్పుతాయి.. విశ్వసుందరి క్రిస్టినా ఆసక్తికర వ్యాఖ్యలు**
ఈ సమావేశంలో విశ్వసుందరి క్రిస్టినా మాట్లాడుతూ.. ఇండియా గురించి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నమస్తే ఇండియాతో ప్రసంగం మొదలుపెట్టిన ఆమె.. తెలంగాణలోని దేవాలయాల గురించి మాట్లాడారు. తమ కోసం ఇన్ని ఏర్పాట్లు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఇండియా గొప్ప ప్రదేశం అని, 2024 మిస్ వరల్డ్‌గా తన ప్రస్థానం ఇండియాతో మొదలైందని చెప్పుకొచ్చారు. అలాగే ఇండియా మనకు చాలా నేర్పుతుందని, ప్రతీ విషయంలో స్ఫూర్తినిస్తుందని తెలిపారు. అంతేక తెలంగాణలో చాలా దేవాలయాలను సందర్శించానని, ఇక్కడి దేవాలయాలు గొప్ప విలువలను నేర్పుతాయని అన్నారు. ఇక ఇండియాలో ఒక స్పిరిట్ ఉందని, వివిధ మతాల వారు.. వివిధ భాషల వారు కలిసి జీవిస్తున్నారని కొనియాడారు. ఇక్కడ ట్రెడిషన్ కూడా చాలా బాగా నచ్చిందని, ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉందని ఆమె వ్యాఖ్యానించారు.

**తెలంగాణ టూరిజానికి ఊతమిచ్చే 72వ మిస్ వరల్డ్ ఈవెంట్**
మే 7 నుంచి 31 వరకు 72వ మిస్ వరల్డ్ పోటీలకు అతిథ్యమిచ్చే అసాధారణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు తెలంగాణ సిద్ధమైందని పర్యాటక శాఖ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. పర్యాటక అభివృద్ధికి, బ్రాండ్ పెరుగుదలకు ఈ అంతర్జాతీయ వేదిక ఎంతగానో దోహదపడుతుందన్నారు. 3000 ప్రపంచ మీడియా భాగస్వాములు కవర్ చేసే ఈ ప్రతిష్టాత్మక ప్లాట్‌ఫామ్, ప్రాచీన సాంప్రదాయాలు, ఆధునిక ఆకాంక్షలకు అనుగుణంగా ఉన్న తెలంగాణ ప్రత్యేక కథనాన్ని ప్రదర్శించడానికి తమకు వీలు కల్పించిందన్నారు. వైద్యులు, ఇంజనీర్లు, క్రీడా అథ్లెట్లు, సామాజిక కార్యకర్తలు, న్యాయవాదులు, సృజనాత్మక కళాకారులు మరియు పారిశ్రామికవేత్తలు వంటి విభిన్న నేపథ్యాల నుండి రానున్న 140 దేశాలకు చెందిన వారి ఉత్తమ, ప్రతిభావంతులైన అందాల పోటీ విజేతలకు ప్రాతినిధ్యం వహించే ఒక ప్రత్యేకమైన ప్రపంచ వేదిక ఇది అని పేర్కొన్నారు.

## సమర్థిస్తారా?
(మొదటి పేజీ తరువాయి)

సంభవిస్తున్న పరిణామాలపై భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ విడుదల చేసిన 33 పదాలతో కూడిన ప్రకటన చూసి సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. బందీలందరినీ విడుదల చేయాలని, స్థిరమైన మానవతా సహాయాన్ని గాజాలోకి పంపాలని కోరిన కేంద్ర ప్రభుత్వం అదే సమయంలో మార్చి 18వ తేదీన గాజాపై ఇజ్రాయెల్ చేసిన గగనతల దాడులను ఖండించడంలో విఫలమైందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. చివరకు మహిళలు, పిల్లలతోసహా 500 మంది పాలస్తినా ప్రజలు మరణించినా కూడా కేంద్ర ప్రభుత్వం ఏమీ పట్టనట్టు ఉండిపోయిందని విమర్శించింది. అత్యంత అవమానకరమైన, సిగ్గుచేటైన, అమానవీయమైన వైఖరిని కేంద్ర ప్రభుత్వం అనుసరించిందనీ, యూదుమత ఫాసిస్టు ఇజ్రాయెల్ ప్రభుత్వం సాగిస్తున్న సామూహిక ఊచకోతకు ఆమోదం తెలియజేసే ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి వైఖరిని మోదీ ప్రభుత్వం ఈ విషయంలో చాలా స్పష్టంగా చాటి చెప్పుకుందని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం విమర్శించింది.

# దేవాదుల ద్వారా సాగునీరు అందించాలి

మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి
ఘనంగా రైతు సంఘం జనగామ జిల్లా తృతీయ మహాసభలు



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** మెట్ట ప్రాంతమైన జనగామకు జిల్లాకు దేవాదుల రిజర్వాయర్ల కింద కాలువలు తవ్వి పంట పొలాలకు నీరందించాలని జనగామ మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి కోరారు. గురువారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా తృతీయ మహాసభ సొప్పరి సోమయ్య అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు సిహెచ్ రాజారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనేక పోరాటాల ఫలితంగా దేవాదుల కింద జనగామ జిల్లాలో 13 రిజర్వాయర్లు నిర్మాణం చేయగా వాటి కింద కాల్వల తవ్వకం జరగలేదన్నారు. దీనితో నిర్మాణం చేసిన రిజర్వాయర్లు రైతులకు ఉపయోగపడని పరిస్థితి ఉందన్నారు. దక్కన్ పీఠభూమిలో మెట్ట ప్రాంతమైన జనగామ జిల్లాలో నేటికి కరువు, అతివృష్టి, అనావృష్టి ఫలితంగా రైతులు పండించిన పంటలు చేతికి రావడం లేదన్నారు. భూగర్భ జలాలు 4500 ఫీట్ల లోతుకు పడిపోయాయని, దీనితో పంటలు 25 శాతానికి పైగా ఎండిపోయాయన్నారు. జనగామ జిల్లాలోని ప్రజా ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి దేవాదుల కాలువలకు సరిపడా నిధులు తెప్పించి పనులు ప్రారంభిస్తే జనగామ రైతాంగానికి విముక్తి లేదన్నారు. ధరణి స్థానంలో వచ్చిన కొత్త భూచట్టం విధి విధానాలను వెంటనే జిల్లా అధికారులకు అందించాలని, లక్షలాదిగా నష్టపోయిన సాదా బైనామా ద్వారా ఖరీదు చేసిన లబ్ధిదారులకు భూమి హక్కు కల్పించాలని, రిజిస్ట్రేషన్ చేసుకుని మ్యూటేషన్ కాకుండా ఉన్న భూముల రిజిస్టర్ చేసుకున్న వారికి అప్పగించి, భూమిపై పూర్తి హక్కులు కల్పించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని రాజారెడ్డి విజ్ఞప్తి చేశారు.

**బిజెపి తీసుకొస్తున్న రైతు వ్యతిరేక చట్టాలను ఎదిరించి పోరాడాలి : కొల్లూరు రాజయ్య**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్న రైతు వ్యతిరేక చట్టాలను ఎదిరించి పోరాడాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి రాజయ్య పిలుపునిచ్చారు. రైతుల వద్ద ఉన్న భూములన గుంజుకొని కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని, గిట్టుబాటు ధర లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. రైతులను ఆదుకోవాల్సిన పాలకులు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ రైతులను రోడ్డున పడేస్తున్నారని, కొత్త చట్టాలను తీసుకొచ్చి రైతులను మరింతగా దివాల తీయించే పనులు చేస్తున్నారన్నారు. అదానీ, అంబానీలకు భూముల్ని అప్పగించడమే లక్ష్యంగా ఇప్పటికే మూడు చట్టాలను తీసుకొచ్చిన ప్రభుత్వం మరో రైతు వ్యతిరేక చట్టాన్ని తీసుకురావడానికి మోడీ ప్రయత్నం చేస్తున్నాడన్నారు. బిజెపి రైతులు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతు సంఘం నిర్మాణం, విస్తరణ, రైతు సమీకరణ లక్ష్యంగా కార్యకర్తలంతా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభకు జిల్లాలోని 12 మండలాల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు.

**అధ్యక్ష కార్యదర్శులుగా ఆది సాయన్న, చొప్పరి సోమయ్య**

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జనగామ జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆది సాయన్న, ప్రధాన కార్యదర్శిగా చొప్పరి సోమయ్య, ఉపాధ్యక్షులుగా బోనగిరి కుమారస్వామి, పిన్నింటి రాజిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా పెండ్యాల సమ్మయ్య, కొత్త సుధాకర్‌రెడ్డిలతో పాటు ఎండి యాకూబ్, ఉమ్మెత్తల వెంకట్‌రెడ్డి, జోగు పరశురాములు, ఉండబోయిన రవి, రుద్రోజు ఉప్పలయ్య, సొదం అశోక్, మర ముప్పిడి ఎల్లయ్య, హనుమాజీ, బండారి యాదగిరి, వెంకటయ్యలు ఎన్నికయ్యారు.

# పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం

వ్యవసాయ రంగాలపై కార్పొరేట్ల కన్ను
రైతుసంఘం ఖమ్మం జిల్లా మహాసభలను ప్రారంభించిన బాగం



**ప్రజాపక్షం/ఖమ్మం :** పోరాటాల ద్వారానే రైతాంగ, వ్యవసాయరంగ సమస్యలు పరిష్కారమవుతాయని పోరాటాలు లేకుండా పరిష్కారం కావని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు తెలిపారు. వ్యవసాయ రంగ సమస్యలు పరిష్కరించకుండా వ్యవసాయరంగం సంక్షోభం వీడదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా 21వ మహాసభ గురువారం స్థానిక కమ్మవారి కళ్యాణమండపంలో జరిగాయి. మహాసభలు ప్రారంభం సూచికగా రైతుసంఘం పతాకాన్ని సీనియర్ నాయకులు బండారుపల్లి ముత్తయ్య ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపాన్ని బాగం హేమంతరావు ఆరిష్కరించారు, ఫోటో ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి ప్రారంభించారు. దొండపాటి రమేష్, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, జక్కుల రామారావు, బాణోత్ రవి అధ్యక్షవర్గంగా వ్యవహరించిన మహాసభలో హేమంతరావు మాట్లాడుతూ మునుపెన్నడు లేని రీతిలో భారతదేశ వ్యవసాయ రంగం సరికొత్త సవాళ్లను ఎదుర్కొంటుందని అన్నారు. 75 సంవత్సరాల స్వతంత్ర్య భారత దేశంలో రైతు ఆత్మహత్యలు ఆగడం లేదని అన్నారు. తొలినాళ్లలో వ్యవసాయరంగానికి ఇచ్చినప్పటికి రానురాను ప్రాధాన్యత తగ్గించారని మోదీ పాలనలో సాగుపట్ల నిర్లక్ష్యంతోపాటు మొత్తం వ్యవసాయరంగాన్ని కార్పోరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతుందని అన్నారు. 18 శాతం జిడిపి గల వ్యవసాయరంగంపై కార్పోరేట్ల కన్నుపడిందని హేమంతరావు ఆరోపించారు. వ్యవసాయ రంగానికి కేటాయింపులు లేకపోవడం పరిశోధనలు జరగకపోవడమే దిగుబడులు తగ్గేందుకు కారణమని హేమంతరావు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 ఏళ్లు గడిచినా వ్యవసాయ రంగం సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. సాగు నీటి ప్రాజెక్టులు పూర్తి కాలేదన్నారు. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం కాళేశ్వరం గానే మిగిలిందన్నారు. సిపిఐ పోరాట ఫలితంగా దుమ్ముగూడెం ప్రారంభం అయితే ఇప్పుడు ఆ పేర్లు మార్చి తీవ్ర జాప్యం చేస్తున్నారని హేమంతరావు ఆరోపించారు. సీతారామ ప్రాజెక్టు వ్యవం పెరుగుతుందే తప్ప ప్రాజెక్టు పూర్తి కావడం లేదన్నారు. ప్రజల సొమ్ము గుత్తేదారుల పాలు అవుతుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీ రైతు భరోసా అమలులో పూర్తిగా వైఫల్యం అయిందని హేమంతరావు ఆరోపించారు. ధాన్యానికి బోనస్ చెల్లింపుల్లో జాప్యం జరుగుతుందని అన్నారు. రైతుల ఆగ్రహానికి ప్రభుత్వం మనుగడ సాధించలేదన్నారు. చైతన్యం కలిగిన తెలంగాణ రైతాంగం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ రాష్ట్ర కంట్రోల కమీషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా, సిపిఐ రైతుసంఘం నాయకులు యర్రా బాబు, మెడికంటి వెంకటరెడ్డి, ఏపూరి లతాదేవి, సింగు నర్సింహారావు, జాగర్లముడి రంజిత్, యామాల గోపాలరావు, తాటి వెంకటేశ్వర్లు, తోట రామాంజనేయులు, ఏపూరి రవీంద్ర బాబు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, బాణోత్ రామ్ కోటి, అమరనేని వీరభద్రరావు, మందడపు రాణి, పోటు కళావతి, బెజవాడ రవి, పగడాల మల్లేశ్, ఏలూరి భాస్కర్‌రావు, బాగం ప్రసాద్, కూచుపూడి రవిప్రసాద్, ఇటికాల రామకృష్ణ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఉద్యోగాల జాతర

లక్షకు చేరువైన ఉద్యోగాల భర్తీ
15 నెలల్లోనే తెలంగాణ రికార్డు
58,868 నియామకాలు
(మార్చి 20 నాటికి)
2711 గ్రూప్ 1,2,3 పోస్టులు..
త్వరలో నియామకాలు
30,228 కొత్త పోస్టులు మంజూరు
14,236 అంగన్‌వాడీ పోస్టులకు
త్వరలోనే నోటిఫికేషన్
10,954 త్వరలోనే గ్రామ పాలనా
అధికారుల నియామకం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగాల జాతర కొనసాగుతోంది. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన 15 నెలల్లోనే ఉద్యోగాల భర్తీ దాదాపు లక్షకు చేరువై రికార్డు నెలకొల్పింది. "తెలంగాణలో నిరుద్యోగం తగ్గింది. నిరుద్యోగుల భవితకు ప్రజా ప్రభుత్వం బాసటగా నిలిచింది. 15 నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వం 57,946 ఉద్యోగ నియామకాలు చేపట్టింది. కొత్తగా 30,228 పోస్టులను మంజూరు చేసింది. ఇటీవలే గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 ఫలితాలను విడుదల చేసింది. 563 గ్రూప్ 1 పోస్టులు, 783 గ్రూప్ 2, 1365 గ్రూప్ 3 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు త్వరలో నియామక పత్రాలు అందించనుంది. కొత్తగా 14,236 అంగన్ వాడీ పోస్టుల భర్తీకి ఇటీవలే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు త్వరలోనే 10,954 గ్రామ పరిపాలనా అధికారులను (జిపిఓ) నియమించనుంది. ప్రభుత్వం వర్గాల సమాచారం ప్రకారం ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి అనేక ఏళ్లుగా కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం బాసటగా నిలిచింది. రవీంద్రభారతిలో గురువారం 922 మందికి సిఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందించారు. వీరిలో 582 కారుణ్య నియామకాలున్నాయి. ఈ కారుణ్య నియామకాలను చేపట్టేందుకు ఉన్న అడ్డంకులను తొలిగించేందుకు ముఖ్యమంత్రి కీలక నిర్ణయం తీసుకున్నారు. సిఎం ఆదేశాల మేరకు జెడ్పి, మండల పరిషత్‌లలో ఉన్న 524 ఆఫీసు సబార్డినేట్, నైట్ వాచ్ మెన్ పోస్టులను జూనియర్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేశారు. కొత్తగా 58 జూనియర్ అసిస్టెంట్ సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించారు.

## పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన వల్ల
# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

అభ్యుదయ వాదులు, నక్సల్స్ పట్ల
కేంద్రం వైఖరి సరైనది కాదు
సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు
కామ్రేడ్ చాడ వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పెద్దపల్లి జిల్లా కౌన్సిల్ సమావేశం గోదావరిఖని భాస్కరరావు భవన్‌లో గురువారం నాడు నిర్వహించుకోవడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ చాడ వెంకట్ రెడ్డి హాజరై మాట్లాడుతూ భారతదేశంలో నక్సలిజాన్ని కమ్యూనిస్టులను రూపుమాపడానికి మోదీ, అమిత్‌షాలు చేస్తున్న నిరంకుశత్వ విధానం సరైంది కాదని చాడ విమర్శించారు. ప్రస్తుత విజ్ఞానాన్ని మంచివైపు ఉపయోగించుకోకుండా దేశంలో ఆర్ఎస్ఎస్ బిజెపి చేస్తున్న అరాచకాలను ప్రశ్నిస్తున్న అభ్యుదయ వాదులను కమ్యూనిస్టులను నక్సరిజాన్ని ఇబ్బందులకు గురిచేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు చట్టభద్రత కల్పించడానికి హర్షిస్తున్నామని అలాగే బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి హర్షిస్తూనే బడ్జెట్‌లో సరియైన కేటాయింపులు జరగకపోతే ఈ తీర్మానాల వల్ల ప్రజలకు ఒరిగేదేమీ ఉండదు కనుక పేద ప్రజలను కిందిస్థాయి ఉద్యోగులను మున్సిపల్ అంగన్వాడి మధ్యాహ్న భోజనం లాంటి పేద ఉద్యోగులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తాండ్ర సదానందంలు మాట్లాడుతూ పార్టీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 20న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించే సిపిఐ వంద సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవ సభకు జిల్లాలోని అన్ని ప్రాంతాల కార్యకర్తలు నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి కె.కనకరాజ్ అధ్యక్షత వహించగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కామ్రేడ్ గోషిక మోహన్, జిల్లా పూర్వ కార్యదర్శి కామ్రేడ్ గౌతం గోవర్ధన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ తాళ్ళపెల్లి మల్లయ్య, మడికొండ ఓదేమ్మ, కోడం స్వామి, కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ మాటేటి శంకర్, అసాల రమ, కందుకూరి రాజరత్నం, మార్మాపురి సూర్య, మానస్ కుమార్, రేణికుంట్ల ప్రీతం, తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ పెద్దలకు కప్పం కట్టకుంటే..
# రేవంత్ పదవి 'గోవిందా'

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి :** ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలకు కప్పం కట్టకుంటే తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి పదవి గోవిందా అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సంపదను దోచి ఇప్పటికే రూ.30వేల కోట్లు దోచి ఢిల్లీ పార్టీ పెద్దలకు పంపారని ఆరోపించారు. ఇది వారికి ఇవ్వకుంటే అతని పదవి తాను ఢిల్లీకి వెళ్లి హైదరాబాద్ వచ్చేలోపే ఊడిపోతుందనే భయంతో ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలి ఆయన హైదరాబాద్ నుండి ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారని ఎద్దేవా చేశారు.15 మాసాలుగా తాము ప్రతిపక్ష పార్టీ బాధ్యతలను విస్మరించకుండా ప్రజా సంక్షేమంపై ప్రభుత్వాన్ని అనునిత్యం ఎండగడుతున్నామని చెప్పారు. ఎస్ఎల్‌బిసి సొరంగంలో జరుగుతున్న పనుల్లో 8మంది కార్మికులు గల్లంతు అయితే వారిని కాపాడాల్సిన ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అక్కడ చేపల కూర వండించుకొని దావత్ చేయడం సామాన్య ప్రజలపై వారికి ఎంత ప్రేమ ఉందో ఇట్టే స్పష్టమవుతుందన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి భవిష్యత్తులో మంచి పదవులు వస్తాయన్నారు. వరంగల్‌లో నిర్వహించే పార్టీ 25వ వార్షికోత్సవ వేడుకలకు కార్యకర్తలు భారీగా తరలి రావాలన్నారు. సూర్యాపేటకు విచ్చేసిన కెటిఆర్‌కు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

**ప్రశ్నించే గొంతుకను నొక్కేస్తున్నారు**
**మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి**

ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకను కాంగ్రెస్ ప్రభుత్వం నొక్కేస్తుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కాంగ్రెస్‌పై ప్రజలు తిరగపడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి, పార్టీ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, గాదరి కిషోర్, నల్లమోతుల భాస్కర్ రావు, రమావత్ రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

# ఎసిబికి చిక్కిన అవినీతి జలగ

సబ్ రిజిస్ట్రార్‌ను పట్టుకున్న అధికారులు




**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** అవినీతి అధికారులపై కొరడా ఝుళిపిస్తున్నా వారు మాత్రం మారడం లేదు. జనగామ జిల్లాలో మరో అవినీతి జలగ ఎసిబి చిక్కింది. ఏదునూరి రమేష్ అనే వ్యక్తి నుండి 20వేల రూపాయల లంచం పుచ్చుకుంటూ స్టేషన్ ఘనపూర్ సీనియర్ అసిస్టెంట్, ఇంఛార్జీ సబ్ రిజిస్ట్రార్ పర్వతం రామకృష్ణ పట్టుబడ్డారు. ఎసిబి డిసిపి సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం స్టేషన్‌ఘనపూర్‌కు చెందిన ఎదునూరి రమేష్ తన రిజిస్ట్రేషన్ విషయంలో రిజిస్ట్రార్‌ను సంప్రదించగా 20వేల రూపాయలు లంచంగా ఇవ్వాలని కోరాడన్నారు. తమను సంప్రదించగా గురువారం 20వేల రూపాయలు ఇస్తున్న నేపథ్యంలో వలపన్ని పట్టుకోవడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎసిబి డిఎస్‌పి సాంబయ్య తెలిపారు.

# డ్యాన్సులు హద్దులు దాటుతున్నాయ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సినిమాల్లో మహిళలు చేస్తున్న డ్యాన్సులు హద్దులు దాటుతున్నాయని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని తెలంగాణ మహిళా కమిషన్ గురువారం తీవ్రంగా హెచ్చరించింది. స్టార్ హీరోలు వారి ఇమేజ్, థియేటర్‌కు వచ్చే ఫ్యామిలీ ఆడియన్స్‌ను దృష్టిలో పెట్టుకుని డ్యాన్స్‌ను కంపోజ్ చేయాల్సిన కొరియోగ్రాఫర్స్ రెచ్చిపోతున్నారు. హద్దులు లేకుండా నచ్చిన రీతిలో హీరోయిన్లను ఆటబొమ్మలా ఆడిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సినిమాల్లో అసభ్యకర డ్యాన్సులపై తెలంగాణ మహిళా కమిషన్ సీరియస్ అయింది. సినిమా దర్శకులు, నిర్మాతలు కొరియోగ్రాఫర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హెచ్చరిస్తూ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. అయితే, అందులో మహిళలను తక్కువ చేసి చూపించే, అసభ్యకర డ్యాన్స్ స్టెప్పులను వెంటనే నిలిపివేయాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని కమిషన్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. యువత, పిల్లలపై సినిమాలు చూపే ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని, సినిమా పరిశ్రమ స్వీయ నియంత్రణ పాటించాల్సి ఉందని లేఖలో పేర్కొన్నారు.

# హైటెక్‌సిటీలో అతిపెద్ద 'కేఫ్ నీలోఫర్'



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారతదేశంలో అతిపెద్ద కేఫ్ 'కేఫ్ నీలోఫర్'ను హైటెక్‌సిటీలోని రాయదుర్గంలో ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఈ కేఫ్ నీలోఫర్ హైదరాబాద్ ప్రజలకు అత్యుత్తమ చాయ్, రుచికరమైన ఆహారాన్ని అందించడమే కాకుండా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, దేశవ్యాప్తంగా టీ పౌడర్, కుకీలు విక్రయిస్తుందని చెప్పారు. కేఫ్ నీలోఫర్ మేనేజింగ్ డైరెక్టర్ అనుముల శశాంక్ మాట్లాడుతూ ఈ ఐకానిక్ కేఫ్ నలబై వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉందన్నారు. ఒకేసారి 700 మంది అతిథులకు ఆతిథ్యం ఇచ్చే సామర్థ్యం కలదన్నారు. భారతీయులకు ప్రియమైన టీ, బన్ మస్కా, బిస్కెట్లు వివిధ వంటకాలకు ఈ కేఫ్ ప్రసిద్ధి చెందిందన్నారు. ఏబీఆర్ కేఫ్ అండ్ బేకర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కేఫ్ వ్యవస్థాపకుడు, చైర్మన్ అనుముల బాబూ రావు తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ నిధులు ఆర్‌టిసిలో
# కేవలం 'మహాలక్ష్మి' స్కీమ్‌కేనా?

టిజిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్
అధ్యక్షుడు ఎస్.బాబు


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం రూ.3,04,965 కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టి నిధుల వరద పారించిందని చెప్పుకుంటోందని, ఈ బడ్జెట్ వరదలో ఆర్‌టిసికి రూ.4,305 కోట్ల బడ్జెట్‌లో ప్రవేశపెట్టడాన్ని తెలంగాణ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ స్వాగతిస్తోందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాబు తెలిపారు. నెలకు మహాలక్ష్మి పథకానికి రూ. 359 కోట్ల అవుతుందని, అంటే సంవత్సరానికి రూ.4,308 కోట్ల బడ్జెట్ ద్వారా ఆర్‌టిసికి ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కానీ బడ్జెట్ కేటాయింపు కేవలం రూ.4,305 కోట్ల మాత్రమేనని, అయ్యే ఖర్చు కంటే రూ.3 కోట్లు తక్కువగానే మహాలక్ష్మి పథకానికి ప్రకటించిందని ఎస్.బాబు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. నెలకు అయ్యే రూ.359 కోట్లలో ప్రభుత్వం ప్రతినెల కేవలం రూ.100 నుండి రూ. 120 కోట్లను మాత్రమే ఆర్‌టిసికి చెల్లిస్తోందని, అంటే రూ.259 కోట్లను ప్రభుత్వం ఎగనామం పెడుతోందని విమర్శించారు. ఈ నష్టాన్ని ఎలా పూడ్చుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీలతో ఆర్‌టిసికి సాలీనా రూ.3,108 కోట్లు నష్టం వాటిల్లుతుందన్నారు. ఆర్‌టిసి అంటే కేవలం ఒక మహాలక్ష్మి పథకం మాత్రమే కాదని, ఈ బడ్జెట్‌లో కొత్త బస్సుల కొనుగోలుకు ప్రభుత్వం ప్రొవిజన్ పెట్టలేకపోయిందన్నారు. మహాలక్ష్మి పథకం మాత్రమే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుండి బస్ పాస్ రాయితీలు కూడా చెల్లించకపోవడం సంస్థ మరింత నష్టాల్లోకి కూరుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌టిసి తీసుకున్న అప్పులపై వడ్డీలు కూడా చెల్లించటంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని నుండి బయట పడేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ఈ బడ్జెట్‌లో వాటర్ బోర్డుకు ప్రభుత్వం బాసటగా నిలిచిందని, ఆ బోర్డులో రూ.2,085 కోట్ల రుణాలకు చెల్లిస్తోందని ఆయన ఉదహరించారు. ఆర్‌టిసిపై ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపిస్తోందని విమర్శించారు.

**ఏ పార్టీ ప్రభుత్వం వచ్చినా.. ఆర్‌టిసికి అన్యాయమే..!**

గత బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆర్‌టిసికి సాలీనా రూ.1000 నుండి రూ.1500 ప్రతిపాదించేదని, కానీ ఆచరణలో మాత్రం కేవలం రూ.200 కోట్లు మాత్రమే విడుదల చేసిందని ఎస్.బాబు గుర్తు చేశారు. ఏ ప్రభుత్వం వచ్చినా, బడ్జెట్‌లో ఆర్‌టిసికి అన్యాయమే జరుగుతోందని విమర్శించారు. ప్రభుత్వ పథకాలు అమలు చేసి ఆర్‌టిసి నష్టపోతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా మహాలక్ష్మి పథకానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రొవిజన్‌ను బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రతినెల రూ.359 కోట్లను ఆర్‌టిసికి విడుదల చేయాలని ఎస్.బాబు డిమాండ్ చేశారు. ఎలక్ట్రిక్ బస్సులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ ప్రైవేట్ మాన్యుఫాక్చరర్లకు వెళుతుందని, ఆ సబ్సిడీ ఆర్‌టిసికి వర్తించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫారసు చేయాలని సూచించారు. ఆర్‌టిసిలో బస్సు బాడీ నిర్మాణానికి యూనిట్లు ఉన్నాయని, నైపుణ్యమైన కార్మికులు ఉన్నారని, అశోక్ లీ లాండ్, టాటా, ఐషర్ కంపెనీలతో ఆర్‌టిసి సమన్వయంతో ఎలక్ట్రిక్ బస్సులు కూడా బస్ బాడీలో తయారు చేసుకుంటే అవి మన సొంత బస్సులుగానే ఉంటాయని, దాని వల్ల సంస్థ పరిపుష్టమవుతుందన్నారు.

# సర్క్యులర్‌ను రద్దు చేయాలి

ఒయు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇటీవల విడుదల చేసిన సర్క్యులర్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఒయు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం బంద్ చేపట్టారు. ఇందులో భాగంగా ఒయు ఆర్ట్స్ కళాశాలలో తరగతులను బహిష్కరించి, ప్రదర్శనగా బయలుదేరిన వామపక్ష విద్యార్థి సంఘం నాయకులను, విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పరస్పరం వాగ్వాదం చోటు చేసుకున్నది. ప్రదర్శనగా వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థులను, నాయకులను పోలీసులు అడ్డుకుని, అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్ మూర్తి, ఎఐఎస్‌ఎఫ్ ఒయు అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్, నెల్లి సత్య, నాయకులు ఉప్పల ఉదయ్, అరకంటి భగత్, అశ్వాన్ రాఘవేంద్ర, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్, పిడిఎస్‌యు విజృంభన రాష్ట్ర కార్యదర్శి అల్లూరి విజయ్, ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కోట ఆనందరావు, ఎస్‌ఎఫ్ఐ ఒయు అధ్యక్షుడు ఉదయ్, పిడిఎస్‌యు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నవీన్, పిడిఎస్‌యు గ్రేటర్ అధ్యక్షులు రాకేష్, ప్రధాన కార్యదర్శి శ్రీను, ఒయు కమిటీ నాయకులు ఆసిఫ్ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరసనలు, ధర్నాలను నిషేధిస్తూ జారీ చేసిన సర్క్యులర్‌ను ఉపసంహరించాలనే డిమాండ్‌తో శాంతియుతంగా పోరాడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం, ఒయు విసి, రిజిస్ట్రార్ మౌనం వహించడం మంచిది కాదని, వెంటనే వీడాలని వారు డిమాండ్ చేశారు. విద్యా ర్థి ఉద్యమాలపై ఆంక్షలు విధించే సర్క్యులర్‌ను ఇప్పటికైనా రద్దు చేసి, యూనివర్సిటీలో స్వేచ్ఛ వాతావరణాన్ని నెలకొల్పాలని విశ్వవిద్యాలయం లో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, విద్యారంగానికి నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యా రంగానికి కేవలం 7.5 శాతం నిధులను కేటాయించడం అన్యాయమని, రూ. 500ల కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలను ఎలా బాగు చేస్తారో చెప్పాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

## చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.1000 కోట్లు

తెలంగాణ చేనేత కార్మిక సంఘం డిమాండ్
చేనేతకు ఇచ్చిన హామీలను విస్మరించిన ప్రభుత్వం
రాష్ట్ర బడ్జెట్‌లో తీరని అన్యాయం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025–26 వార్షిక బడ్జెట్‌లో చేనేత రంగాన్ని విస్మరించి తీరని అన్యాయం చేసిందని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మి నరసయ్య విమర్శించారు. చేనేత కార్మికులకు పని కల్పించేందుకు, వారి సంక్షేమానికి, అభివృద్ధికి ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి టెక్స్‌టైల్ రంగంతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా చేనేతకు కనీసం రూ.1000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. చేనేతను ఆదుకుంటామని ప్రచార ఆర్భాటమే తప్ప అందుకు అనుగుణంగా చర్యలు ఏమాత్రం లేవని వారు ఒక ప్రకటనలో తెలిపారు. చేనేతకు, జౌళి (టెక్స్‌టైల్ ) శాఖకు కలిపి రూ.370 కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పినా అందులో పవర్‌లూమ్‌కు రూ.237.46 కోట్లు, చేనేత, పవర్‌లూమ్ కలిపి రూ.102.54 కోట్లు, నేతన్న బీమాకు రూ.15 కోట్లు, రాష్ట్ర, జిల్లా కార్యాలయాల నిర్వహణకు రూ. 35.83 కోట్లు ప్రతిపాదించారని, వాస్తవంగా చూస్తే ప్రత్యేకంగా చేనేత అభివృద్ధికి కార్మికుల సంక్షేమానికి కేటాయించిందని ఏమీ లేదన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాలలోని 65 లక్షల మందికి నాణ్యమైన రెండు చీరలు నేయించి ఇస్తామన్న హామీ నెరవేర్చేందుకు నిధులు కేటాయించకపోవడంతో ఒక వైపు మహిళలను మరోవైపు నేతన్నలను దగా చేయడమేనని వారు విమర్శించారు. చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయి చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై లేదా అని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు చేపట్టనట్లయితే రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికుల పోరాటాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.


గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
డిప్యూటీ డైరెక్టర్ (Vet), చార్మినార్ జోన్.

NIT No. 01/DD(VET)/CRZ/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటసు

**పని పేరు:** జిహెచ్ఎంసి, చార్మినార్ జోన్ నుండి సియుసి వరకు చిన్న మరియు పెద్ద జంతువులతో సహా చనిపోయిన జంతువులను ఎత్తివేయడం మరియు సురక్షితంగా పారవేయడం, **అంచనా విలువ :** రూ.31,05,780/-, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం:** 21.03.2025న ఉ.10.00గం.ల నుండి 24.03.2025న ఉ.10.30గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** డిప్యూటీ డైరెక్టర్, వెటర్నరీ సెక్షన్, జోనల్ కమిషనర్ కార్యాలయం, పూల్‌బాగ్, చార్మినార్ జోన్, జిహెచ్ఎంసి. ఫోన్ నం. 9989930397. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- డిప్యూటీ డైరెక్టర్ (Vet), చార్మినార్ జోన్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 11843-PP/CL/ADVT/1/2024-25, Date: 20-03-2025

తెలంగాణ ప్రభుత్వం
సాగు నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజనీరు వారి కార్యాలయం, నీటిపారుదల శాఖ సర్కిల్, నర్సంపేట.

ఇ-ప్రొక్యూర్మెంట్ నోటీస్ సంఖ్య : 10/2024-25, తేదీ: 15.03.2025.

నీటి పారుదల - FDR-2023, రంగాపూర్ ఆనికట్ శాశ్వత మరమ్మతు పనులు, రంగాపూర్ (గ్రా.), గోవిందరావుపేట్ (మం.), ములుగు(జి.) లో గల పనుల అంచనా విలువ **రూ.28,53,968.00/-** పనులు కొరకు **తేదీ : 21.03.2025 ఉ.11.00 గం. నుండి తేదీ:28.03.2025 మ.3:00 గం.** వరకు బిడ్లను ఆహ్వానించడమైనది. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్మెంట్ మార్కెట్ ప్లేస్ http://tender.telangana.gov.in వెబ్ సైట్‌లో చూడగలరు. ఫోన్ నం.8555896941

సం/- పర్యవేక్షక ఇంజనీరు, ఐ అండ్ సిఎడిడి., నీటిపారుదల శాఖ సర్కిల్, నర్సంపేట

DIPR R.O. No. : 11826-PP/CL/ADVT/1/2024-25, Date: 20-03-2025

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

NIT No. 33/GHMC/MPT/EE/2024-25 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటసు

**పని పేరు:** శానిటరీ రీసోర్స్ పర్సన్, **అంచనా విలువ / ఇసివి:** రూ.5,53,416/-, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం:** 20.03.2025న ఉ.10.30గం.ల నుండి 27.03.2025న ఉ.10.40గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** శ్రీ వి.శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్ఎంసి, మూసాపేట్ సర్కిల్-23, సెల్: 9849906745. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్ఎంసి, మూసాపేట్ సర్కిల్-23.

DIPR R.O. No. : 11809-PP/CL/ADVT/1/2024-25, Date: 20-03-2025

ప్రజాపక్షం
శుక్రవారం, మార్చి 21

## నాగపూర్ అల్లర్ల వెనుక...

సోషల్ మీడియాతో లాభాలు ఎన్ని ఉన్నాయో, నష్టాలు కూడా అదే స్థాయిలో ఉన్నాయని మరోసారి రుజువైంది. మహారాష్ట్ర పరిస్థితే నిదర్శనం. గతంలో ఔరంగాబాద్‌గా ప్రసిద్ధి చెందిన ఛత్రపతి శంభాజీనగర్ జిల్లా, ఖుల్తాబాద్‌లోని 17వ శతాబ్దం నాటి మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిపై అనవసర రాద్ధాంతం, మత ఘర్షణలకు ఆజ్యం పోసింది. ఇది సోషల్ మీడియా నిర్వాకమే! అయితే మత ఉద్రిక్తతలన్నీ హింసకు దారితీయవు. కొన్ని స్వార్థ పరశక్తులు ముందస్తు సన్నాహాలతో సిద్ధంగా ఉండి భావోద్వేగాలను రెచ్చగొడితేనే మత కలహాలు ప్రజ్వరిల్లుతాయి. ఔరంగజేబు సమాధిని మరో ప్రాంతానికి తరలించాలని విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి), బజరంగ్ దళ్ సభ్యులు నిర్వహించిన ప్రదర్శనతో అగ్గిరాజుకుంది. ఆకుపచ్చ వస్త్రంలో గడ్డినినింపి తగలబెట్టడం పుకార్లకు కారణమైంది. ఒక మతానికి చెందిన పవిత్ర శ్లోకాలతో కూడిన వస్త్రాన్ని దగ్ధం చేశారని సోషల్ మీడియాలో పుకార్లు షికార్లు చేశాయి. మైనారిటీ వర్గానికి చెందిన కొంత మంది తీవ్రంగా స్పందించి, అల్లర్లకు దిగారు. ఈ ఘర్షణలో వందలాది వాహనాలు దగ్ధమయ్యాయి. సోషల్ మీడియాలో వచ్చిన తప్పుడు సమాచారం...దాని ఆధారంగా పుట్టుకొచ్చిన కట్టుకథలే మత ఘర్షణలకు హేతువు. లేని సమస్యను సృష్టించి, వ్యాప్తి చేసి, భిన్న సామాజిక వర్గాల మధ్య ఉద్రిక్తతలను రేకెత్తించిన తాజా ఘటనలో సోషల్ మీడియాది కీలక పాత్ర. అయితే అది స్వతంత్రమైనది కాదు, రాజకీయ శక్తుల చేతిలో పావుగా పనిచేస్తున్నది. కొంతమంది నాయకుల ప్రసంగాలు అగ్నికి ఆజ్యంపోశాయి. ఔరంగజేబు సమాధిని తొలగించాలంటూ వారు చేసిన డిమాండ్ వికృత రూపమే మత ఘర్షణలు. మరాఠా పాలకుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్‌ను ఉరితీయడాన్ని ప్రస్తావిస్తూ, అలాంటి పాలకుడి సమాధి అక్కడ ఉండడానికి వీల్లేదన్నది విహెచ్‌పి వాదన. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు ఒక వినతి పత్రాన్ని కూడా అందించింది. బాబ్రీ మసీదు కూల్చివేత తరహాలో, ఔరంగజేబు సమాధిని ధ్వంసం చేయాలని బిజెపి ఎమ్మెల్యే, కేబినెట్ మంత్రి నితేష్ రాణే శివసేరి కోటలో మాట్లాడుతూ పరోక్షంగా పిలుపునివ్వడం దారుణం. ఔరంగజేబు సమాధిని ప్రభుత్వం తొలగించకపోతే, శంభాజీ నగర్ జిల్లాకు కవాతు చేసి, సమాధి కూల్చివేస్తామని విహెచ్‌పి హెచ్చరికలు జారీ చేయడం అలజడులకు ప్రధాన కారణం. బిజెపి ఎంపి ఉదయన్ రాజ భోస్లే ఈ డిమాండ్‌కు మద్దతు ప్రకటించి, వివాదాన్ని తీవ్రతరం చేశారు. సమాజ్‌వాది పార్టీ ఎమ్మెల్యే అబూ అసిమ్ అజ్మీ ఔరంగజేబును సమర్థుడైన నాయకుడిగా అభివర్ణించడం, ఈ సమస్యను కేవలం రాజకీయ అంశంగా చూడాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నది. ఔరంగజేబు సమాధి నిన్నమొన్నటిది కాదు. ఖుల్తాపూర్‌లో సమాధి ఉన్న ప్రాంతాన్ని రక్షిత ప్రాంతంగా పురాతత్వశాఖ ప్రకటించి అర్థ శతాబ్దం దాటింది. ఇన్నేళ్ల తర్వాత సమాధిని కూల్చివేయాలన్న డిమాండ్ చేస్తున్నది ఎవరు? మత ఘర్షణలను ప్రేరేపించే అంశాలను భూతద్దంలో చూపుతూ, వివాదాన్ని రావణకాష్టంగా మారుస్తున్న సోషల్ మీడియా వర్గాలు ఎవరి చెప్పుచేతల్లో ఉన్నాయి? ఔరంగజేబు సమాధికి, సామాన్యుడి బతుకులకు సంబంధం ఏమిటి? దున్నపోతు ఈనిందంటే, దూడను కట్టేయమన్న చందంగా, అబద్ధాలు సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారం పొందడం.. అవాంఛనీయ రూపాలు సంతరించుకోవడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లో చేరవేస్తూ, ఉన్నత సేవలు అందిస్తున్నది సోషల్ మీడియా. కేవలం 'లైకులు', 'వ్యూ'లు పెంచుకోవడానికి ఎలాంటి దారుణ మార్గాలనైనా అనుసరించడాకి తెగబడుతున్నదీ ఈ సోషల్ మీడియానే. అధునాతన సాంకేతికతతో అందుబాటులోకి వచ్చిన సామాజిక మాధ్యమాలు మంచికంటే చెడునే ఎక్కువగా పంచుతున్నాయని, మహారాష్ట్ర ఉదంతంతోసహా ఎన్నో సంఘటనలు నిరూపిస్తున్నాయి. మితిమీరుతున్న సోషల్ మీడియా ఆగడాలకు కళ్లెం వేయకపోతే, మత ఘర్షణలతో దేశం అగ్నిగుండమవుతుంది. కొంతమంది నేతల స్వార్థ రాజకీయాలకు, రెచ్చగొట్టే ప్రకటనలకు అడ్డుకట్ట పడకుంటే, ప్రజాస్వామ్యం.. లౌకికవాదం ఉనికి కోల్పోతుంది. ఛావా సినిమా ఈ ఉద్రిక్తతకు నేపథ్యంగా ఉందని ముఖ్యమంత్రి ఫడ్నవీస్ అనటం ప్రభుత్వ బాధ్యతను తప్పించుకునే, వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నమే అవుతుంది. ఇదంతా సోషల్ మీడియా ఆయుధంగా రాజకీయ ప్రయోజనాలు పొందడానికి జరుగుతున్న అనైతిక పోరాటం. లౌకిక భావన స్థానంలో మత విశ్వాసాలను రెచ్చగొట్టి, మతవాదాన్ని ప్రజల మెదళ్లలోకి జొప్పించే దుర్మార్గం. భిన్నత్వంలో ఏకత్వాన్ని సవాలు చేస్తున్న ఉన్మాదం. మత సామరస్యాన్ని వెక్కిరించే తెంపరితనం. నేడు మత వాదనలు వినిపిస్తున్న నాయకులకు చిత్తశుద్ధిలేదు. ప్రభుత్వాల కనుసన్నల్లో పని చేస్తున్న పాలనా వ్యవస్థలకు, అధికార యంత్రాంగానికి ఆత్మగౌరవం లేదు. మత రాజ్య స్థాపనే లక్ష్యంగా ఎంచుకున్న ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులను అడ్డుకుంటేనే పరిస్థితులు మారుతాయి. రాజ్యాంగ విలువలకు రక్షణ ఉంటుంది. లౌకికవాదం పరిఢవిల్లుతుంది. ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుంది.

# బిఆర్‌ఎస్, బిజెపి మధ్య 'బాహుబలి' రేవంత్!



ఎస్‌కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

"ఒకసారి గొప్ప విజయం సాధించాక, ఇక విశ్రాంతి గురించి మాట్లాడకూడదు. వెసులుబాటు కావాలని అనుకోకూడదు. ఆధునిక యుగంలో సంపూర్ణ విజయమే లక్ష్యం అనేది మూల సూత్రం" అని 1469–1527కు చెందిన రాజకీయ తత్వవేత్త నికోలో మాకియవెలి అన్నాడు.

అలాగే "ఇంకా యుద్ధం ముగియలేదు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సందర్భాలలో అన్నారు. "రాహుల్ గాంధీని ప్రధానిని చేసే వరకూ విశ్రమించేది లేదు" అని కూడా ఆయన అంటున్నారు. రాజకీయాల్లో నిరంతర అప్రమత్తత అవసరం. ప్రత్యర్థుల ఎత్తుగడలను ముందుగానే పసిగట్టి విరుగుడు కనిపెట్టగలగాలి. అప్పుడే విజయం సాకారమవుతుంది.

"పాలమూరు ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ ఓట్లు అడగాలి. ఇంకా యుద్ధం ముగియలేదు, ప్రస్తుతం విరామం మాత్రమే వచ్చింది.14 పార్లమెంటు సీట్లు గెలిస్తేనే యుద్ధంలో కాంగ్రెస్ గెలిచినట్లవుతుంది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఉమ్మడి మహబూబ్ నగర్ సభల్లో అన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ తెలంగాణ నూతన ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సమక్షంలోనూ పార్టీ సమావేశంలోనూ అదే మాట అన్నారు. రాహుల్ గాంధీ పట్ల సిఎం విధేయత గురించి ఎవరూ సర్టిఫికెట్ ఇవ్వవలసిన అవసరం లేదు. "నాకూ, రాహుల్ గాంధీకి మధ్య ఉన్న బంధం మా ఇద్దరికే తెలుసు" అని రేవంత్ పదేపదే చెబుతున్నారు. అయినా అవతల బిఆర్‌ఎస్ మీడియా, ఆ పార్టీ 'సుపారీ మీడియా' 56వ సారి ఢిల్లీకి పోయినా రాహుల్ అపాయింట్‌మెంటు ఇవ్వడం లేదని.. రకరకాల ప్రచారం సాగిస్తోంది. ఇలాంటి ప్రచారానికి రేవంత్ కంగారు పడిపోయే రకం కాదు. అలాంటి మనిషే అయితే అసలు కెసిఆర్ తో యుద్ధమే చేసే వ్యక్తి కాదు. తన బలం, బలహీనతల గురించి రేవంత్ కు సంపూర్ణ అవగాహన ఉన్నది.







తెలంగాణలో ఇక బిజెపితోనే తమ పోరాటమని రేవంత్ ప్రకటించడం, అందుకు తగ్గట్టుగానే తమకూ కాంగ్రెస్ పార్టీకి మధ్యనే పోరాటమని కేంద్ర మంత్రి అమిత్ షా కామెంటు చేయడం కాకతాళీయమే అయినా 'తెలంగాణ రాజకీయ భవిష్యత్ చిత్రపటాన్ని' ఇరువురూ ఆవిష్కరిస్తున్నారు. ఈ ప్రకటనలు బిఆర్‌ఎస్ ను నైతికంగా దెబ్బతీసే అవకాశాలు ఎక్కువ. కాంగ్రెస్, బిజెపి మధ్య పోరాటం కేంద్రీకృతమైతే తమ స్థానమేమిటి? అని కెసిఆర్ పార్టీ నాయకులు తర్జన భర్జన చేస్తున్నారు. తమ పార్టీ పనయిపోయిందనుకొని, కాంగ్రెస్ లేదా బిజెపిలోకి బిఆర్‌ఎస్ నేతలు వలసలు వెళ్ళే అవకాశాలను తోసిపుచ్చలేం. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ ను చిత్తు చేసి అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావాలని కలలుగంటున్న బిజెపి కి రేవంత్ రెడ్డి అనూహ్య అడ్డంకిగా మారిపోయారు.

అందుకే తమ బలాన్ని పెంచుకోవడానికి బిఆర్‌ఎస్ లోని హరీశ్ రావు వంటి పొటెన్షియల్ నాయకులకు గాలం వేస్తున్నట్టు కొంత కాలంగా కథనాలు వస్తున్నవి. కెటిఆర్, కవిత కన్నా హరీశ్ రావు తెలివైన నేత అని ఆయన మద్దతుదారులు చెబుతుంటారు. హరీశ్ పరిస్థితులు తనకు అనుకూలంగా మారేవరకు వేచిచూసే రకం. తొందరపడి నిర్ణయాలు తీసుకొని రాజకీయంగా దెబ్బతినే మనిషి కాదు. కెసిఆర్ టక్కు టమార, గజ కర్ణ, గోకర్ణ విద్యలన్నింటినీ కాచివడబోశారన్నపేరు కూడా ఉంది. చాలా సందర్భాలలో తండ్రీ, కొడుకులు హరీశ్ ను పార్టీ నుంచి సాగనంపాలని గతంలో ప్రయత్నించి విఫలమయ్యారన్న ప్రచారం పార్టీ శ్రేణుల్లో ఉన్నది. హరీశ్ రావు గురించి ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, శ్రేణులలో ఇలాంటి టాక్ చాలాకాలంగా ఉన్నది.

బిఆర్‌ఎస్‌ను నిర్వీర్యం చేసే టాస్క్‌ను ఆ పార్టీ మాజీ మంత్రి, ప్రస్తుత బిజెపి ఎంపి ఈటల రాజేందర్ కు అప్పజెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. "కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కెసిఆర్ బాటలోనే నడుస్తోంది. కెసిఆర్ కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుంది' అని ఈటల ఇటీవల వ్యాఖ్యానించారు. అలాగే సిఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. "కిషన్ రెడ్డి తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నాడు. మెట్రో, ఆర్ఆర్ఆర్ సహా ఏ ప్రాజెక్టును కూడా ఆమోదించకుండా అడ్డుతగులుతున్నాడు. కిషన్ రెడ్డి సైంధవుని పాత్ర పోషిస్తున్నాడు. తెలంగాణ రాష్ట్రానికి కిషన్ రెడ్డి ఏ ప్రాజెక్టును తీసుకొచ్చారో సూటిగా చెప్పాలి. తాము రూ.10 లక్షల కోట్ల పనులు చేపట్టాము" అని రేవంత్ రెడ్డి దాడి చేశారు. "రేవంత్ రెడ్డి బెదిరింపులకు భయపడేది లేదు. మెట్రోకు కేంద్రం తప్పకుండా సాయం చేస్తుంది. త్వరలోనే కేంద్ర కేబినెట్ ముందుకు ఆర్ ఆర్ ఆర్ ప్రాజెక్ట్ వస్తుంది" అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి జవాబు చెప్పవలసి వచ్చింది. కిషన్ రెడ్డిని, కేంద్రప్రభుత్వాన్ని రేవంత్ వ్యూహాత్మకంగా ఇరుకున బెడుతున్నారు.

రేవంత్ రెడ్డి దగ్గరున్న చాణక్యం, చాకచక్యం కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి, ఇతర బిజెపి నాయకులకు లేదు. దాంతో వాళ్ళు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. బిజెపి, బిఆర్‌ఎస్ ల ను రేవంత్ సరిగ్గా 'కీలెరిగి వాత' పెడుతున్నారని పరిశీలకులంటున్నారు. తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో ప్రధానమంత్రి మోదీ సానుకూలంగా ఉన్నప్పటికీ కిషన్ రెడ్డి సైంధవుడుగా మారాడంటూ చేస్తున్న ఆరోపణలు ప్రజల్లోకి బలంగా వెళుతున్నాయి. "కిషన్ రెడ్డి కేసీఆర్ బినామీ. ఆయన కెసిఆర్ చెప్పినట్లే నడుచుకుంటారు" అని మంత్రి పొన్నం ప్రభాకర్ మార్చి 3న విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ పై ప్రతిరోజూ విమర్శలు గుప్పించడం బిఆర్‌ఎస్ నాయకులు కెటిఆర్, హరీశ్ రావు, కవితల డ్యూటీ. తాజాగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా అదే పనిచేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తామే ప్రధాన ప్రత్యర్థులమని తెలిపేందుకు బిజెపి ప్రయత్నిస్తోంది. దీంతో నిన్న, మొన్నటి దాకా బిఆర్‌ఎస్ ను ఉతికి ఆరేస్తూ వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 'రాడార్'ను బిజెపి వైపునకు మళ్ళించక తప్పలేదు. బిఆర్‌ఎస్ అధికారం కోల్పోయిన బాధ కెసిఆర్ కన్నా కిషన్ రెడ్డికి ఎక్కువగా ఉందని రేవంత్ సెటైర్ వేశారు.

తెలంగాణ నుంచి కేంద్రానికి వివిధ పన్నుల రూపంలో ఒక రూపాయి పంపిస్తుంటే, రాష్ట్రాలకు తిరిగి పంపించే వాటాలో భాగంగా తెలంగాణకు 42 పైసలు అందుతున్నట్టు రేవంత్ రెడ్డి తెలిపారు. కానీ బీహార్‌కు 7 రూపాయలు, ఉత్తరప్రదేశ్ కు 6 రూపాయలు కేంద్రం వాటా వెడుతోందని సిఎం విమర్శిస్తున్నారు. ఈ లెక్కలు నిజమో కాదో చెప్పవలసిన బాధ్యత కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లపై ఉన్నది. లేదా బిజెపి అగ్రనాయకత్వంపై ఉన్నది. మెట్రో రెండవ దశ, మూసీ పునరుజ్జీవం, రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం... వంటి పథకాలకు కేంద్రం సహకరించడం లేదని ముఖ్యమంత్రి చాలాకాలంగా విమర్శిస్తున్నారు. ఆయన విమర్శలకు బిజెపి తెలంగాణ నాయకుల నుంచి సరైన జవాబు లేదు. వాళ్ళు డొంక తిరుగుడుగా మాట్లాడుతున్నారు తప్ప, అసలు విషయాన్ని మరుగున పెడుతున్నారు.

బిఆర్‌ఎస్, కాంగ్రెస్ ల మధ్య దూషణల పోటీ సాగుతోంది. ఈ పోటీలో బిజెపి వచ్చి చేరింది. తామేమీ తక్కువ కాలేదని రుజువు చేసుకోవడానికి ఆ పార్టీ నాయకులు తంటాలు పడుతున్నారు. తెలంగాణ రాజకీయ రణరంగంలో బిసి, ఎస్‌సి రిజర్వేషన్లు, కోటాలు, వాటాలకు సంబంధించిన వ్యవహారం కొత్తగా పుంజుకుంది. ఎస్సీ రిజర్వేషన్లు ఇప్పటికే ఉన్నాయి కనుక బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే బిసిలంతా తమకే ఓటు వేస్తారన్నది ముఖ్యమంత్రి రేవంత్ నమ్మకం. ఎన్నికల్లో అధికారంలోకి వస్తే తమ పార్టీ తరఫున 'బిసి ముఖ్యమంత్రి' అవుతారని 2023 డిసెంబర్ లో కేంద్రహోమ్ మంత్రి అమిత్ షా హామీ ఇచ్చినందున వచ్చే ఎన్నికల్లోనూ అదే నినాదం సంధించవచ్చు. కానీ బిజెపిలో దశాబ్దాలుగా తిష్ఠ వేసుకొని కూర్చున్న 'అగ్రకుల' నాయకులు అంత సులభంగా బిసి నేతకు మద్దతు ఇచ్చే అవకాశాలు లేవు. తెలంగాణలో అధికారంలోకి రావాలంటే ఎవరితోనైనా జతకట్టవలసిందే.కాంగ్రెస్ కు సంబంధించినంతవరకు బిజెపి 'శత్రు' పార్టీ. ఎటొచ్చీ బిఆర్‌ఎస్ పైనే అందరి అనుమానాలు కేంద్రీకృతమవుతున్నవి. బిజెపి, బిఆర్‌ఎస్ ల మధ్య చీకటి ఒప్పందాలు జరిగినట్టు రేవంత్ రెడ్డి ఒక ప్రచారాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెడుతున్నారు. దాన్ని జనం కూడా నమ్ముతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కెసిఆర్ పార్టీ పోటీ చేయకపోవడం వలన రేవంత్ ప్రచారానికి మరింత బలం చేకూరుతోంది. అలాగే "మా పార్టీలో పాత సామాన్లు బయటకు పోతే తప్ప పార్టీకి భవిష్యత్తు లేదు" అని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. ఆయన మాటల్లోని ఆంతర్యం తెలుసుకోవడం పెద్ద కష్టం కాదు. కిషన్ రెడ్డి, లక్ష్మణ్ వంటి సీనియర్లంతా రాజాసింగ్‌ను టార్గెట్‌గా భావించాలి.

ఇదిలా ఉండగా "మేము బిఆర్‌ఎస్ కు మిత్రులమా? ప్రత్యర్థులమా? మాకు అర్థం కావడం లేదు. ఢిల్లీ నాయకత్వం ధోరణి అనుమానాస్పదంగా ఉంది. అందుకే మేము సొంతంగా బలపడలేకపోతు న్నాం" అని 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బిజెపి తెలంగాణ సీనియర్ నాయకుడొకరు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ భవన్‌లో నాతో అన్నారు. నిజానికి 2014 నుంచి కేంద్రంలో బిజెపి అధికారంలో కొనసాగుతున్నప్పుడు ఆ పార్టీ తెలంగాణలో బలపడడానికి అనేక అవకాశాలు, వనరులు ఉన్నా వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఇందుకు ప్రధాన కారణం,హైదరాబాద్ సిటీ, మిగతా తెలంగాణ ప్రాంతంగా బిజెపిలో 'విభజన రేఖ' కనిపిస్తున్నది. హైదరాబాద్ కేంద్రంగా 'చక్రం తిప్పుతున్న నేతలే' ఢిల్లీలోని పార్టీ అగ్రనాయకత్వం నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నట్టు ఆ పార్టీ వర్గాల్లో ఒక ప్రచారం చాలాకాలంగా ఉన్నది.

గతంలో కెసిఆర్, ప్రధాని మోదీ మధ్య సత్సంబంధాలున్నట్టే, తాజాగా కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మోదీకి మధ్య మంచి సంబంధాలు ఏర్పడినట్టు బిజెపి

నాయకులు నిష్ఠూర మాడుతున్నారు. కెసిఆర్ తో ఇప్పటికీ 'లోపాయికారీ'స్నేహ సంబంధాలున్న వారికి, ఆయన అధికారం కోల్పోయినందుకు బాధపడుతున్న వారికి, తాజా పరిణామాలు మింగుడుపడడం లేదు. సిఎం రేవంత్ ఎప్పుడు అడిగినా ప్రధాన మంత్రి అపాయింట్‌మెంటు ఇవ్వడం వాళ్లకు నచ్చడం లేదు. దీంతో రేవంత్ రెడ్డిపై బిజెపి దూషణల డోసు పెంచినట్టు కనబడుతోంది. 2025 డిసెంబర్ కల్లా తెలంగాణ సిఎం మార్పు తథ్యమని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి జోస్యం చెబుతున్నారు. "ఏ పార్టీ ముఖ్యమంత్రి అయినా దేశ ప్రధాని మోదీని కలుసుకోవడంలో తప్పు లేదు. రహస్యమూ ఉండదు. ముఖ్యమంత్రులకు ప్రధాని పెద్దన్న లాంటి వ్యక్తి" అని అసెంబ్లీ వేదిక మీదుగానే బిఆర్‌ఎస్‌కు రేవంత్ కౌంటర్ ఇచ్చారు." ఢిల్లీలో బిజెపి నాయకులతో రేవంత్ రహస్య మంతనాలు చేస్తున్నారని, ఏదో ఒకరోజు ఆయన బిజెపిలో చేరిపోవడం తథ్యం" అని కొన్నిరోజులుగా కెటిఆర్ ఒక ప్రచారాన్ని నడిపిస్తున్నారు.

రేవంత్ అనుసరిస్తున్న వ్యూహాలను బట్టి కెసిఆర్, కిషన్ రెడ్డి కంటే రెండాకులు ఎక్కువే చదివినట్టు కనిపిస్తోంది. ఎస్‌సిల వర్గీకరణ, బిసి రిజర్వేషన్ల బిల్లులను అసెంబ్లీ ఆమోదించింది. ఇక వీటి చట్టబద్ధత కోసం అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకువెళ్ళడానికి ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు ప్రధాని అపాయింటుమెంట్ కోరారు. ప్రధాని అపాయింట్ మెంటు ఖరారయ్యాక ఏయే పార్టీల ప్రతినిధులు వెడతారో చూడవలసి ఉంది.

# సమగ్ర మూల్యాంకనంతో పరీక్షకు ఎసరు




ఎన్.తిర్మల్
9441864514

పరీక్షలకే పరీక్ష మన పరీక్షా విధానం!? మార్చి, ఏప్రిల్ నెలలు వచ్చాయంటే పరీక్షాకాలం వచ్చేసినట్లే! యస్‌యస్‌సి, ఇంటర్, డిగ్రీ, పిజి, మళ్ళీ వివిధ రకాల ప్రవేశపరీక్షల కాలం వెంట, వెంటవెంటనే పరుగెత్తుకొస్తుంది. పరీక్షలంటే ఒకరకమైన భయం, ఫోబియాకు విద్యార్థులు గురౌతుంటారు. పిల్లలతోపాటు తల్లిదండ్రులు ఎంతో కొంత టెన్షన్ ఫీలవుతుంటారు. అనాదిగా వస్తున్న పరీక్షా విధానంపై పలు రకాల విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా ఏడాదికాలంగా విద్యార్థి నేర్చుకున్న జ్ఞానాన్ని గంట, మూడు గంటల్లో పరీక్షించడం సబబా? ఇది నిజంగా విద్యార్థి ఏడాదికాలంగా నేర్చుకున్న అభ్యసనానుభవాలను అంచనా వేయగలుగుతుందా? విద్యార్థి పరిపూర్ణ మూర్తిమత్వంకు ఈ పరీక్షలు ఎంతవరకు కొలమానం?

బ్రిటీష్ వలసవాదం నుండి వచ్చిన ఈ పరీక్షా విధానం మెకాలేకి నకలని, అశాస్త్రీయ మైనదని, సమూలంగా ఈ విధానం మారాలని, విద్యార్థులను వత్తిడికి గురిచేయని పరీక్ష విధానం కావాలని కోరుకున్నాము. అందులో భాగంగానే మన పరీక్షా విధానంలోని లోపభూయిష్టతను సరిదిద్ది పరీక్షా సంస్కరణలను తెచ్చుకున్నాం! విద్యాహక్కు చట్టం 2009 కొంతలో కొంతైనా మన అనుమానాలు నివృత్తి పరచగలిగింది. సరికొత్త పరీక్షా సంస్కరణకు అవకాశం కల్పించింది. విద్యాహక్కుచట్టం 2009, సెక్షన్29(1)హెచ్ ప్రకారం విద్యార్థి ఏడాదికాలంగా పొందిన అభ్యసనానుభవాలు, జ్ఞాన సామర్థ్యాలు, వత్తిడి లేకుండా పరీక్షించే పరీక్షా విధానం నిరంతర సమగ్ర మూల్యాంకనం(సిసిఇ) మన నూతన ప్రక్రియ! ఈ పరీక్షా విధానం మౌలిక మార్పులు ఏమంటే నేర్చుకున్న దంతా గంట, మూడు గంటల్లో జవాబులు రూపంలో కక్కేసే కంటే.. విద్యార్థి అభ్యసన అనుభవాలు తోపాటు, విద్యార్థి విద్యా సామర్థ్య అంచనా కూడా నిరంతర సమగ్ర ప్రక్రియగా ఉండాలి. అది ఏ పాఠశాలలో ఏ విషయంలో నేర్చుకుంటున్నామో.. ఆ ఉపాధ్యాయులు, ఆ అధ్యాపకులే ఎప్పటికప్పుడు నిరంతరం విద్యార్థిని అంచనా వేసుకుంటూ, విద్యార్థికి పరీక్ష నుండి గమనించిన అంశాలు నిరంతరం సమీక్షించి, సరిచేయడానికి సాధనంగా ఉండాలి. ఆ సాధనమే నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఇ) విధానం అని విద్యాహక్కు చట్టం స్పష్టం చేసింది.

దీనిప్రకారం నిర్మాణాత్మక మూల్యాంకనం(యఫ్‌ఎ), ఇది నాలుగు దశలుగా సబ్జెక్టును విభజించి, ఆ సబ్జెక్ట్‌లో రాత సామర్థ్యం, పఠనసామర్థ్యం, ప్రాజెక్టు వర్క్(పని అనుభవం), స్లిప్ టెస్టు(జ్ఞాన అనుభవం) వీటన్నింటినీ తరగతి సబ్జెక్టు ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో నిర్వహించబడి ఒక్కో అంశం కు 5మార్కులు చొప్పున సగటున 20మార్కులు ఏడాదిలో ఇవ్వబడతాయి. ఈ నిర్మాణాత్మక పరీక్ష అనేది తరగతి సబ్జెక్టు ఉపాధ్యాయుల వ్యక్తిగత బోధన సరిదిద్దడానికి, ఉపాధ్యాయులు తమ బోధనానుభవాలు సమీక్షకు, విద్యార్థి తాను వెనకబడిన విషయం తనకు తాను తెలుసుకోవడానికి తోడ్పడుతుంది. ఒకవిధంగా ఇవి మనం ఎంతోకాలంగా కోరుకున్న మార్పులే! ఇకపోతే సిసిఇలో రెండవ అంశం ఏమంటే సబ్జెక్టు రెండు భాగాలుగా విభజించి ఒక్కోసెమిస్టర్ కు 40మార్కుల చొప్పున రెండు సెమిస్టర్‌లు కు కలిపి 80మార్కులకు విద్య నేర్చిన పాఠశాలలోనే సంగ్రాహణాత్మక మూల్యాంకనం జరుగుతుంది. ఈ సంగ్రాహనాత్మక మూల్యాంకనంలో విద్యార్థి పొందిన జ్ఞానంతోపాటు, ఆయా సబ్జక్టులలోని ఆరు అభ్యసన సామర్థ్యాలు పరీక్షించ బడతాయి. అంటే విద్యార్థి ఆ వయస్సులో పొందాల్సిన విద్యా సామర్థ్యాలు ఎంతో కొంత నిజాయితీగా అంచనా వేయగలిగిన విధానం. ఈ మొత్తం విద్యార్థి పొందిన 100మార్కులనుండి 3నుండి10వరకు గ్రేడులను ఆయా విద్యార్థులు పొందిన మార్కులను బట్టి ఇస్తారు.



ఈ గ్రేడులే విద్యార్థి సమగ్ర మూల్యాంకనం అంచనాగా భావించి బోధనా లక్ష్యాలు విద్యార్థికి అందేలా ముఖ్యంగా సబ్జక్టు ఉపయోగపడే అంశంపైనే ఈ పరీక్షలు! కానీ, మనం తరతరాలుగా వస్తున్న సాంప్రదాయ పరీక్షా విధానం అనే జాడ్యం నుండి బయటపడలేక విద్యార్థినే పరీక్షకు కేంద్ర బిందువుగా మార్చి, పరీక్షలను ఓ ప్రహసనంగా మార్చివేశాము. ఫలితంగా పాత పరీక్షా విధానం అనబడే వత్తిడి, ఫోబియా నుండి బయట పడలేక, వచ్చిన నూతన మార్పులను జీర్ణించుకోలేక, అమలు జరిపే ధైర్యంలేక, అరకొర సంస్కరణలతోనే మన పరీక్షా విధానం సరిపెట్టుకుంటున్నాము. ఒక రకంగా చెప్పాలంటే నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియ అనేది దేశ వ్యాప్తంగా తొలిసారి వచ్చిన ఏకరూప పరీక్షా విధానం! విద్యార్థి, ఉపాధ్యాయులు చేతిలో నిరంతర సమగ్ర సాధనం అయిన ఈ నిరంతర సమగ్ర మూల్యాంకనం విధానం వచ్చి15ఏళ్ళు గడిచినా నేటికీ దాన్ని సంపూర్ణంగా అమలు జరిపే ధైర్యం, తెగువ పాలకవర్గాలకు లేదు. ఇటు అర్థం చేసుకొని అనుసరించే స్థితి కొందరు ఉపాధ్యాయులు, విద్యార్థులలో లోపించింది. పాత సాంప్రదాయిక పరీక్షా విధానం జాడ్యం పిల్ల పోయినా పురిటికంపు పోలేదన్న సామెతను గుర్తు చేసేలా తయారైంది? విధానం మారినా మన ఆలోచనలు ఇంకా పాత పరీక్షా విధానం చుట్టే చక్కెర్లు కొడుతున్నాయి.

విద్యా బాధ్యతలనుండి వైదొలగేలా మనం పెంచి పోషించుతున్న ప్రైవేటు విద్యావ్యవస్థ మార్కుల విధానం తొలగించి గ్రేడుల విధానం తెచ్చినా పదికి పది పేరుతో తమ విద్యా వ్యాపార లక్ష్యాలు అమలు చేస్తూనే ఉన్నాయి. ఇప్పటికీ నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియ జీర్ణంకాక పాత పరీక్షా విధానం తిరిగి ఏరూపంలో తేవాలనే ప్రయత్నాలు అన్ని స్థాయిల్లో కొనసాగుతున్నాయి. అందులో భాగమే కేంద్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని దానికదే నిర్వీర్యం అయ్యే విధంగా, గీతాబుక్కల్ కమిటీ సిఫార్స్ పేరుతో, 50 ఏళ్ళనాడు మనం వదిలేసిన 'డిటెన్షన్' విధానం పునరుద్ధరణ వైపు అడుగులు వేస్తుంది. మన రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు విద్యా వ్యవస్థ వత్తిడి తట్టుకోలేక, మానెటరింగ్ వ్యవస్థ సరిదిద్దుకోలేక, ఇప్పటికే సంగ్రాహనాత్మక మూల్యాంకనం వార్షిక పరీక్షగా, పాత వాసనలతో నిర్వహిస్తున్న 80మార్కులకు గాను, నిర్మాణాత్మక మూల్యాంకనం 20మార్కులు కలిపి పాత పద్ధతిలో100మార్కులకు యస్‌యస్‌సి పరీక్ష నిర్వహించబూనుకుంది. ఇది ఈ సంవత్సరం అమలు పరచాలని అధికారులు ప్రయత్నించారు కూడా? కానీ, కొన్ని సాంకేతిక సమస్యల వలన మరుసటి ఏడాదికి వాయి దా వేసుకున్నారు.

మరో పరీక్ష మార్పుకు సైతం ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మార్చిలో పదవతరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు సరైన గ్రేడ్ రానిపక్షంలో మే నెలలోపు మరో ఇన్‌స్టెంట్ పరీక్ష నిర్వహించి ఒకేసారి ఫలితాలు ప్రకటిస్తామని ప్రకటించారు. అంటే పాత సప్లిమెంటరీ పరీక్షలు తిరిగి పునరుద్ధరణ అన్న మాట! అంటే ప్రైవేటు విద్యా వ్యవస్థ కోరికలు తూచా తప్పకుండా అమలు జరపడానికి అధికారులు, పాలకులు సంసిద్ధం అయ్యారనే విషయం సుస్పష్టం అవుతుంది. అభ్యసనానుభవాలు, పాఠ్యాంశాలు అధ్యయనంలో అంతర్లీనంగా, అంతర్భాగంగా జరగాల్సిన నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఇ) ప్రక్రియ మన పరీక్ష విధానంలో వత్తిడి లేని సులభతరం అయిన విధానాలకు సూచికనై ఉండగా, దాన్ని బలోపేతం చేయకపోగా ఎటు తిరిగి మన పాత మూల్యాంకనం విధానం వైపు మన విద్యా అధికారుల ఆలోచనలు కొనసాగడంలో అంతర్యం ఏమిటో ఒకపట్టాన అర్థం కాదు? మనం చట్టంగా తెచ్చుకున్న సులభం, సరళతరం అయిన పరీక్ష సంస్కరణ వత్తిడి లేని నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియకు బదులు దొడ్డిదారిన తెస్తున్న పాత మూల్యాంకనం విధానం ఏరూపంలో తెచ్చినా అడ్డుకోవాల్సిన అవసరం ఉంది.

మనం దీర్ఘ కాలిక పోరాటంతో విద్యాహక్కు చట్టంగా తెచ్చుకున్న నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియ సంపూర్ణంగా అమలు చేయాలనే డిమాండ్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు ముందుకు పోవలసిఉంది. వత్తిడి, విద్యార్థుల ఆత్మహత్యలు లేని సంపూర్ణ పరీక్షా సంస్కరణ అమలు దిశగా అడుగులు వేద్దాం. మన పాఠశాల పరీక్షా వ్యవస్థలో సరైన మార్పులను మాత్రమే స్వాగతిద్దాం. భవిష్యత్ తరాలకోసం అది మన బాధ్యత కూడానూ!?

# బెట్టింగ్ దురాగతాలను సమాజం నుండి తరిమేయాలి

ఆధునిక యుగంలో సమాజం పోకడ తీరు చూస్తుంటే సామాన్యుల జీవితం కత్తిమీద సామే నని చెప్పక తప్పదు. మానవునికి జీవనాధారమైన వివిధ రకాలైనా సామాగ్రి మొదలు నిత్యావసర వస్తువుల వరకు ప్రతిదీ నిర్ణీత మోతాదులో డబ్బులు వెచ్చించి కొనుగోలు చేయవలసిందే. సగటు దినసరి కూలీ రోజంతా కష్టపడి పనిచేస్తే అతను సంపాదించేది ఆరేడు వందల రూపాయలు. అన్ని రకాల ఉద్యోగులు, స్వయం ఉపాధి కార్మికులు, కర్షకులు అందరూ ఇదే విధానాన్ని అవలంబిస్తూ కుటుంబాలను వెళ్లదీసుకుంటున్నారు. కొన్నిసార్లు ప్రమాదవశాత్తు ఆరోగ్య సమస్యలు ఏర్పడినప్పుడు అత్యవసరంగా అధిక డబ్బు అవసరమైతే బంధువులు లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన బ్యాంకు నందు బంగారు ఆభరణాల తాకట్టు పెట్టి వచ్చే డబ్బులతో అట్టి సమస్య నుండి సురక్షితులు అవుతారు. అనారోగ్యం నుండి బతికి బయట పడితే చాలు నేను తీసుకున్న ఋణం తిరిగి వాయిదాల పద్ధతిలో చెల్లిస్తా అనే ధైర్యం కలిగి ఉంటారు. ఇలానే నిత్య జీవితంలో ఎదురైన అనేక రకాల ఆర్థిక సమస్యల నుండి బయటపడతారు.

**ఈ లోకంలో డబ్బు ఉచితంగా దొరుకుతుందా?**

ఒక మనిషి జేబులో డబ్బులు ఉన్నంత మాత్రాన ఉచితంగా ఎవరికైనా ఇస్తాడా! డబ్బే పరమావధిగా పెట్టుకున్న కొంతమంది తమ సోషల్ మీడియా యూ ట్యూబ్ చానెల్ వేదికగా అమాయక ప్రజల ప్రాణాలు బలి తీసుకునే ప్రభుత్వ గుర్తింపు లేని బెట్టింగ్ యాప్‌లను ప్రమోషన్ చేస్తున్నారు. బెట్టింగ్‌లో కొంత డబ్బు పెట్టడం ద్వారా చాలా ఎక్కువ డబ్బులు వస్తాయని ఆశచూపి బెట్టింగ్ నందు పాల్గొనే లాగా ప్రేరేపిస్తున్నారు. అధిక శాతం ప్రజలు అవగాహన రాహిత్యంతో బెట్టింగ్ లో పాల్గొని తమ డబ్బుతో సహా ఆస్తులన్నీ కోల్పోతున్నారు. చివరి దశలో తమ విలువైన ప్రాణాలను కూడా తీసుకుంటున్నారు. ఎవరో తెలియని వ్యక్తి సోషల్ మీడియా యూ ట్యూబ్ చానెల్ వేదికగా ప్రసారం చేసే సర దా సన్నివేశాలు/విహార యాత్ర ప్రదేశాలు చూడాలని యూ ట్యూబ్ చానెల్ ఎంపిక చేసుకొని అనుసరిస్తుంటే సదరు యూ ట్యూబ్ చానెల్ నిర్వాహకులు తమ స్వలాభం కోసం ఎదుటి వారి ప్రాణాలకు ముప్పు కలిగిస్తూ చాలా కుటుంబాల కన్నీటి శోకంతో సొమ్ము చేసుకుంటున్నారు. ఈ బెట్టింగ్ భూతం యావత్ భారతదేశంతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా బాగా వ్యాప్తి చెందిందని కొన్ని ప్రముఖ తెలుగు న్యూస్ టెలివిజన్, తెలుగు దిన పత్రికలలో వార్తా కథనాలను ప్రచురిస్తూ, అలాంటి మోసాలకు ఎవ్వరూ బలి కాకూడదని హెచ్చరిస్తున్నాయి.

**సామాజిక బాధ్యత కలిగిన పోలీస్ అధికారులు**

మానవీయత విలువలను కాపాడే విధంగా వారు చేసిన కృషి అభినందనీయం. రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిన ఎన్నో సంచలనాత్మకమైన కేసులను తనదైన శైలిలో పరిష్కరించి సామాన్య ప్రజలందరి హృదయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు సహా యావత్ భారతదేశ ప్రజానీకానికి వారు సుపరిచితులని చెప్పవచ్చు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన పోలీస్ ఉన్నత అధికారి విసి సజ్జనార్ IPS (96) అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ADGP) ప్రస్తుతానికి విసి సజ్జనార్ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నా రు. గత కొంత కాలంగా బెట్టింగ్ ఆడటం ద్వారా తమ ప్రాణాలు కోల్పోతున్న వేలాది అమాయక ప్రజలను కాపాడేందుకు పూను కున్నారు. ప్రముఖ టెలివిజన్ ప్రసారం ద్వారా మరియు తన స్వంత సోషల్ మీడియా వేదికగా బెట్టింగ్ నుండి విముక్తి పొందడానికి అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. బెట్టింగ్ ప్రమోషన్ చేస్తున్న వారి మీద విసి సజ్జనార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారం చేసుకొని తెలంగాణ, ఎపి రాష్ట్రాలలో కొంతమంది సోషల్ మీడియా యూ ట్యూబ్ నిర్వాహకుల మీద పలు కేసులు నమోదయ్యాయి. సామాజిక బాధ్యత కలిగిన పోలీస్ ఉన్నతాధికారి చేస్తున్న ఇంత మంచి కార్యక్రమానికి సమాజమంతా సంపూర్ణమైన మద్దతు ప్రకటించాలి. బెట్టింగ్ దురాగతాలను మనమంతా ఒక్కటై సమాజం నుండి తరిమికొట్టాలి.

**అటువంటి యూ ట్యూబ్ చానెల్ నుండి నిష్క్రమించండి**

దురాశ దుఃఖానికి చేటు అన్నట్లు అత్యాశ వల్ల మనిషి వివేకాన్ని కోల్పోతాడు. ఈ అత్యా శ అనేక రకాల అనర్థాలకు దారితీస్తుంది. అత్యాశ వలన సమస్తం పోగొట్టుకునే అవకాశం ఉంది. దీనివలన కలిగే నష్టాలు బెట్టింగ్‌లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను చూస్తే మనకు అర్థం అవుతుంది. అధిక డబ్బే ప్రధానంగా అత్యాశ చూపి ఎన్నో ప్రాణాలు పోవడానికి కారణం అవుతున్న సోషల్ మీడియా యూ ట్యూబ్ చానెల్ నుండి ఇప్పుడే నిష్క్రమించండి. ఇలా చేయడం ద్వారా మీరు బెట్టింగ్ భూతం నుండి విముక్తి పొందవచ్చు.

కొండేటి ప్రకాష్, 7981781086

## నియోజకవర్గాల పునర్విభజనపై
# పార్లమెంటులో గందరగోళం

ప్రతిపక్ష ఎంపిల నిరసన

టీ-షర్టులపై పునర్విభజన వ్యతిరేక నినాదాలు



న్యూఢిల్లీ : పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన సమస్యపై పార్లమెంటు ఉభయసభల్లో గురువారంనాడు తీవ్ర గందరగోళం చెలరేగింది. రెండో విడత బడ్జెట్ సమావేశాల మొదటిరోజున ఉభయసభలూ వాయిదా పడ్డాయి. ఉభయసభల్లో ఎలాంటి ముఖ్యమైన కార్యకలాపాలు జరగలేదు. పునర్విభజనపై ప్రభుత్వవైఖరిని వ్యతిరేకిస్తూ నినాదాలు రాసి ఉన్న టీ-షర్టులను ధరించి వచ్చి ప్రతిపక్ష సభ్యులు లోక్‌సభ, రాజ్యసభలో తీవ్ర నిరసన తెలియజేశారు. దీంతో గురువారంనాడు ఉభయసభలూ వాయిదా పడ్డాయి. పునర్విభజనకు సంబంధించి ప్రభుత్వం ఉభయసభల్లో సరైన వివరణ ఇవ్వడంలో విఫలమైందని విమర్శించారు.ధరించిన టీ-షర్టులు మార్చుకుని తిరిగి సభకు రావాలన్న సభాపతుల డిమాండ్‌ను ప్రతిపక్ష ఎంపీలు తిరస్కరించారు. సభ ఛైర్మన్ తమను సస్పెండ్ చేయాలనుకుంటే అందుకు తాము సిద్ధపడే ఉన్నామని చెప్పారు. దీంతో ఛైర్మన్ రాజ్యసభను కూడా వాయిదా వేశారు.

రాజ్యసభ గురువారంనాడు ఒక్క కార్యక్రమాన్ని కూడా చేపట్టడంతో విఫలమైంది. కారణం వివరించకుండా సభను ఛైర్మన్ వాయిదా వేయడంతో రాజ్యసభలో ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం తెలియజేశాయి. న్యాయబద్ధమైన పునర్విభజనకోసం తమిళనాడు పోరాటం చేస్తుంది....తమిళనాడుదే విజయం....అనే నినాదాలు రాసి ఉన్న తెలుపు రంగు టీ-షర్టులను ధరించి డిఎంకె ఎంపీలు లోక్‌సభకు వచ్చారు. దీంతో స్పీకర్ వారిని హెచ్చరించారు. డిఎంకె ఎంపీలు పునర్విభసన సమస్యను సభలో ప్రస్తావించేందుకు ప్రయత్నం చేశారు. కానీ స్పీకర్ అందుకు వారిని అనుమతించకుండా వారి డిమాండ్లను తిరస్కరించారు. ''సభ కొన్ని నియమ నిబంధనలతో నడుస్తుంది, సభ్యులు వాటిని పాటించాలి, ఆ మర్యాదను, గౌరవాన్ని దక్కించాలి, సభాగౌరవాన్ని సభ్యులు కాపాడాలి, కానీ కొందరు ఎంపీలు మాత్రం ఈ నిబంధనలను పాటించడంలేదు, సభా మర్యాదను ఉల్లంఘిస్తున్నారు, ఇది ఎంతమాత్రం సమ్మతం కాదు'' అని స్పీకర్ ఓం బిర్లా ఉదయం 11 గంటలకు సభ సమావేశం కాగానే హెచ్చరిక చేశారు. ఈ తర్వాత సభాపతిస్థానంలో ఉన్న కృష్ణ ప్రసాద్ తెన్నేటి కూడా ప్రతిపక్ష ఎంపీలకు విజ్ఞప్తి చేస్తూ, ఈ విధమైన నినాదాలు రాసి ఉన్న టీ-షర్టులను తొలగించి వేరే సరైన దుస్తులు ధరించి సభకు తిరిగి రావాలని కోరారు.

''వ్యవసాయంపై ఇప్పుడు మనం సభలో చర్చించాల్సి ఉంది, దేశానికి సంబంధించిన ఇంత ముఖ్యమైన అంశంపై చర్చ ఉన్నప్పుడు మీరు కోరుకున్న విధంగా వేరే అంశంపై చర్చ జరిపేందుకు అనుమతించేదిలేదు, దయచేసి మీరు సహకరించండి, సభా కార్యకలాపాలు కొనసాగించేందుకు సహకరించండి'' అని ప్రతిపక్ష ఎంపీలకు స్పీకర్ స్పష్టం చేశారు. ఇందుకు ప్రతిపక్ష ఎంపీలు అంగీకరించలేదు. దీంతో స్పీకర్ తెన్నేటి సభను రోజంతా వాయిదా వేశారు. ఇదే విషయంపై లోక్‌సభ గురువారంనాడు పదే పదే వాయిదా పడింది. పునర్విభజనపై నినాదాలు రాసి ఉన్న టీ-షర్టులు డిఎంకె ఎంపీలు ధరించి రావడాన్ని తొలుత సభాపతిస్థానంలో ఉన్న ఓం బిర్లా గమనించారు. ఈ విధమైన చర్యలు సభా కార్యకలాపాల నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని అన్నారు. తర్వాత సభను మధ్యాహ్నం వరకూ ఆయన వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సభ సమావేశమైన తర్వాత కూడా అవేదృశ్యాలు పునరావృతమయ్యాయి. దాంతో ఆయన సభను తిరిగి మధ్యాహ్నం రెండు గంటల వరకూ వాయిదా వేశారు. నినాదాలు రాసి ఉన్న టీ-షర్టులు ధరించిన ఎంపీలను స్పీకర్ ప్రత్యక్షంగా ప్రస్తావిస్తూ సభ్యులు బయటకు వెళ్ళి దుస్తులు మార్చుకుని సరైన దుస్తులతో తిరిగి సభకు రావాలని కోరారు. ''ఒక పెద్ద నాయకుడు ఈ విధంగా అమర్యాదకరమైన దుస్తుల్లో రావడం సమ్మతం కాదు, బయటకు వెళ్ళండి, మీ దుస్తులు మార్చుకుని తిరిగి రండి'' అని తెన్నేటి చెప్పారు.

రాజ్యసభలో కూడా అవే పరిస్థితులు తలెత్తాయి. రాజ్యసభలో కూడా డిఎంకె ఎంపీలు ధరించిన తెలుపురంగు టీ-షర్టులపై పునర్విభజనకు సంబంధించిన డిమాండ్లు, నినాదాలు రాసి ఉన్నాయి.ఉదయం రాజ్యసభ సమావేశం కాగానే కొన్ని పార్లమెంటరీ స్థాయీసంఘాలు రూపొందించిన నివేదికలను, పత్రాలను సభకు సమర్పించేందుకు ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్ అనుమతించారు. ఆ తర్వాత గంటసేపు సభ వాయిదా పడింది. సభలో జరిగిన ఘటనలపై అన్ని పార్టీల నాయకులను తాను కలుసుకోవాలనుకుంటున్నానని ధన్‌కర్ అన్నారు. ఐతే ఇతర వివరాలను ఆయన చెప్పకుండా సభను మధ్యాహ్నం వరకూ వాయిదా వేశారు. ''ఈరోజు ఉదయం 11.30 గంటలకు సభానాయకులను సమావేశానికి పిలుస్తాను, సభలో నేను చూసిన ఘటనలపై మాట్లాడతాను'' అన్నారు. ఐతే రాజ్యసభ మూడుసార్లు వాయిదా పడింది. త్రిభాషా సూత్రంపై, నూతన విద్యావిధానంపై తమిళనాడు ఎంపీలు నిరసన తెలియజేశారు. దీనిపై విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకించారు. ఇక సభా నాయకులతో ఛైర్మన్ నిర్వహించిన సమావేశంలో, వివిధ పార్టీలకు చెందిన నాయకులు సభ సజావుగా నడిచేందుకు సహకరిస్తామని భరోసా ఇచ్చారు.

## బిజెపి సర్కార్
# 'కుంభకర్ణుడి' నిద్ర వీడాలి

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ వినూత్న నిరసన



**భోపాల్:** మధ్యప్రదేశ్‌లో బిజెపి హయాంలో అవినీతి, కుంభకోణాలు పెరిగాపోయాయని కాంగ్రెస్ ఆరోపించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొనాలని పిలుపునిచ్చింది. ఏనుగులు ఎక్కి తొక్కినా కుంభకర్ణుడిని మేల్కొల్పడం కష్టమని పురాణాలు చెబుతాయి. ఇదే క్రమంలో కాంగ్రెస్ గురువారం 'కుంభకర్ణుడి' పేరిట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రతిపక్ష నాయకుడు ఉమంగ్ సింఘర్ నాయకత్వంలో శాసనసభ ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహం ఎదుట కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. కుంభకర్ణుడి వేష ధారణలో ఎమ్మెల్యే దినేశ్ జైన్ నిద్రిస్తుంటే... కాంగ్రెస్ నేతలు చుట్టూ కూర్చొని వేణునాధంతో కుంభకర్ణుడిని మేల్కొలిపేందుకు యత్నిస్తున్నట్లుగా వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉమంగ్ సింఘర్ విలేకరులతో మాట్లాడుతూ 'ఒక దాని తర్వాత ఒకటిగా కుంభకోణాలు జరుగుతున్నా రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం మొద్దునిద్ర వీడటం లేదు. అందుకోసమే నాటక రూపేణ నిరసన తెలుపుతున్నా. మధ్యప్రదేశ్‌లో నర్సింగ్ కుంభకోణం, రవాణా కుంభకోణం, పట్వారీ కుంభకోణం వెలుగుచూశాయి. యువతకు ఉద్యోగాలు లేవు. రైతులకు ఎరువులు దొరకడం లేదు. ప్రభుత్వం మాత్రం ఏ నిర్ణయం తీసుకోవడానికి సిద్ధంగా లేదు... అవినీతిని అరికట్టేందుకు ఏ చర్యలకూ చేపట్టడం లేదు' అని అన్నారు. ఇదిలా వుంటే, బడ్జెట్ సమావేశాల వేళ ఫొటోల కోసం కాంగ్రెస్ రభస సృష్టిస్తోందని రాష్ట్ర మంత్రి విశ్వాస్ సారంగ్ విమర్శించారు. అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వంగా ఉన్నప్పటికీ అసెంబ్లీని ఫొటోల కోసం కాంగ్రెస్ దుర్వినియోగిస్తోందన్నారు. వాస్తవాలను ఆధారంగా చేసుకొని మాట్లాడటాన్ని కాంగ్రెస్ అలవాటు చేసుకోవాలని సారంగ్ అన్నారు.

## రికార్డు సృష్టించిన
# ఎంఎఫ్ హుసేన్ పెయింటింగ్

న్యూదిల్లీ: ప్రముఖ భారతీయ చిత్రకారుడు ఎంఎఫ్ హుసేన్ గీసిన ఓ పెయింటింగ్ అరుదైన రికార్డు సష్టించింది. ప్రముఖ వేలం సంస్థ క్రిస్టీ న్యూయార్క్‌లో తాజాగా నిర్వహించిన వేలంలో హుస్సేన్ గీసిన 'అన్‌టైటిల్డ్ (గ్రామ్ యాత్ర)' కళాఖండం 13.8 మిలియన్ డాలర్ల (రూ.118 కోట్లు)కు అమ్ముడు పోయింది. దీంతో ఆధునిక భారత చరిత్రలో అత్యంత ఖరీదైన కళాకతిగా ఇది రికార్డు సష్టించింది. ప్రముఖ ఆర్టిస్ట్ అమతా షెర్గిల్ 1937లో గీసిన 'ది స్టోరీ టెల్లర్' పెయింటింగ్‌ను 2023లో వేలం వేయగా రూ.61.8 కోట్ల ధర పలికింది. అత్యంత ఖరీదైన భారతీయ కళాకతిగా ఇప్పటివరకు ఇదే కొనసాగగా... తాజాగా ఎంఎఫ్ హుస్సేన్ పెయింటింగ్ దీని కంటే రెట్టింపు ధర పలకడం విశేషం. ఎంఎఫ్ హుస్సేన్ కుంచె నుంచి జాలువారిన 'గ్రామ్ యాత్ర' ఒకే కాన్వాస్‌లో 13 రకాల చిత్రాలతో రూపుదిద్దుకొంది. ఈ అద్భుత కళాఖండం కొత్త రికార్డు సష్టించడంలో భాగస్వామ్యమైనందుకు సంతోషంగా ఉందని వేలం సంస్థ క్రిస్టీ ప్రతినిధులు పేర్కొన్నారు

# చట్ట విరుద్ధంగా కంటెంట్ తొలగింపు

కేంద్ర ప్రభుత్వంపై 'ఎక్స్' దావా

నిబంధనలు పాటించాల్సిందే: కేంద్రం

**న్యూఢిల్లీ:** అమెరికాకు చెందిన ఎలాన్ మస్క్ నేతత్వంలోని సామాజిక మాధ్యమం 'ఎక్స్' భారత ప్రభుత్వంపై దావా వేసింది. చట్టవిరుద్ధంగా కంటెంట్‌ను నియంత్రిస్తోందని, ఏకపక్షంగా సెన్సార్‌షిప్‌నకు పాల్పడుతోందని కేంద్రంపై ఆరోపణలు చేసింది. ఈ మేరకు కర్నాటక హైకోర్టు లో పిటిషన్ దాఖలు చేసింది. ఐటీ చట్టం, సహ్యోగ్ పోర్టల్ నిబంధనలు తమకున్న చట్టబద్ధ రక్షణలను ఉల్లంఘించేలా ఉన్నాయని, ఇది తమపై అనధికారికంగా సెన్సార్ చేయడం కిందికే వస్తుందని ఎక్స్ సంస్థ తన పిటిషన్‌లో పేర్కొంది. ప్రభుత్వం ఐటీ చట్టంలోని సెక్షన్ 79(3)()ని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించింది. ఐటీ చట్టం ప్రకారం... బ్లాక్ చేసిన కంటెంట్‌ను తొలగించకపోతే, ఎక్స్ తన చట్టబద్ధమైన రక్షణ కోల్పోయే అవకాశం ఉంటుంది. అయితే ఈ సెక్షన్ కింద కంటెంట్ బ్లాక్ చేసే అధికారాన్ని ప్రభుత్వానికి ఇవ్వలేదని ఎక్స్ వాదిస్తోంది. సెక్షన్ 69(ఎ)ని పక్కదారి పట్టించడానికి అధికారులు ఈ నిబంధనను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంది. దేశంలో అల్లర్లు, ఘర్షణలకు కారణమయ్యే పోస్టులు, పూర్తి వివరాలు లేకుండా సష్టించిన ఖాతాలపై నియంత్రణ విధించేందుకు సెక్షన్ 69ఎ ప్రకారం కేంద్రానికి అధికారం ఉంటుంది. అదేసమయంలో సెక్షన్ 79(3)() స్పష్టమైన నియమాలు, తనిఖీలు లేకుండా అధికారులు సమాచారాన్ని బ్లాక్ చేయడానికి అధికారులు అనుమతి ఇస్తున్నారని 'ఎక్స్' తన పిటిషన్‌లో ప్రస్తావించిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇది విస్తతమైన సెన్సార్‌షిప్‌నకు దారితీస్తోందని విమర్శలు చేసింది.



**చట్టప్రకారం ముందుకెళతాం:** ప్రభుత్వ వర్గాలు 'ఎక్స్' దావాపై కేంద్ర ప్రభుత్వవర్గాల నుంచి స్పందన వచ్చింది. ప్రభుత్వం చట్టాన్ని అనుసరించి ముందుకెళ్తుందని, సోషల్ మీడియా సంస్థలు నిబంధనలు పాటించాల్సిందేనని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఈ మేరకు ప్రభుత్వ ఉన్నత అధికారి ఒకరు ఆంగ్ల మీడియా ప్రతినిధితో వ్యాఖ్యానించారు.

## సునీతా విలియమ్స్‌కు భారతరత్న

మమతా బెనర్జీ డిమాండ్



**కోల్‌కతా:** భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్‌కు భారతరత్న ఇవ్వాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ డిమాండ్ చేశారు. ఎక్స్ వేదికగా సునీతా విలియమ్స్‌ను భారత కుమార్తెగా మమత అభివర్ణించారు. తొమ్మిది నెలల పాటు అంతరిక్షంలో పరిశోధన కోసం అంకితభావంతో పని చేసిందని ప్రశంసించారు. అదేసమయంలో అసెంబ్లీలో సునీతా విలియమ్స్‌కు సభ్యులు అభినందనలు తెలిపారు. అసెంబ్లీలో మమత మాట్లాడుతూ సునీతా విలియమ్స్ అంతరిక్షంలో తొమ్మిది నెలల పాటు అంకిత భావంతో పనిచేసిందని ప్రశంసించారు. ఆమెను భారతరత్న పురస్కారంతో సత్కరించాలని డిమాండ్ చేశారు. రెస్క్యూ ఆపరేషన్ బందాన్ని కూడా ప్రశంసించారు. సునీత క్షేమంగా భూమ్మీదకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. బుచ్ విల్మోర్, సునీత ధైర్యాన్ని మెచ్చుకోవాల్సిందేనన్నారు. తనకు అంతరిక్ష శాస్త్రం అంటే ఆసక్తేనన్నారు. వివిధ సమాచారాల ద్వారా వివరాలు తెలుసుకుంటానని చెప్పారు. సునీతా విలియమ్స్‌తో పాటు బుచ్ విల్మోర్ దాదాపు 286 రోజుల పాటు అంతరిక్షంలో ఉండిపోయారు. వాస్తవానికి వారం రోజుల్లో తిరిగి రావాల్సి ఉండగా... సాంకేతిక లోపంతో తిరిగి రాలేకపోయారు. బుధవారం సునీతా భూమ్మీద అడుగుపెట్టారు. చాలా ఉల్లాసంగా ఆమె కనిపించారు.

## అత్యాచారం కేసులో
# 40 ఏళ్లకు న్యాయం

**న్యూఢిల్లీ:** నాలుగు దశాబ్దాల కింద అత్యాచారానికి గురైన ఓ బాధితురాలికి ఎట్టకేలకు న్యాయం లభించింది. ఈ కేసులో నిందితుడిని నిర్దోషిగా ప్రకటిస్తూ గ తంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తాజాగా కొట్టివేసింది. నిందితుడి కి జైలు శిక్ష ఖరారు చేస్తూ తీర్పునిచ్చింది. దీంతో బాధితురాలు, ఆమె కు టుం బం ఆనందం వ్యక్తం చేసింది. కేసు వివరాలివీ... రాజస్థాన్‌కు చెందిన ఓ అమ్మాయిపై 1986లో 21 ఏళ్ల వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. అప్పటికి ఆమె మై నర్. బాధితురాలి కుటుంబం ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి దర్యాప్తు జరిపారు. ఈ కేసులో విచారణ జరిపిన ట్రయల్ కోర్టు 1987 నవ oబరులో అతడిని దోషిగా తేల్చి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. అనంతరం ఈ కేసు రాజస్థాన్ హైకోర్టుకు చేరింది. దీనిపై సుదీర్ఘకాలం విచారణ జరిగిన తర్వా త నిందితుడిని నిర్దోషిగా ప్రకటిస్తూ 2013లో ఉన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. బాధితురాలు సహా ప్రాసిక్యూషన్ నుంచి బలమైన సాక్ష్యాధారాలు లేనందున అతడిపై అభియోగాలను కొట్టివేస్తున్నట్లు కోర్టు తెలిపింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ బాధితురాలి కుటుంబం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై తాజాగా విచారణ జరిపిన జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్ ధర్మాసనం... కింది కోర్టుల్లో విచారణ జరిగిన తీరుపై అసహనం వ్యక్తంచేసింది. 'బాధితురాలు, ఆమె కుటుంబం తమ జీవితంలో చోటుచేసుకున్న ఈ భయానక అధ్యాయానికి ముగింపు పలికేందుకు నాలుగు దశాబ్దాలు ఎదురుచూడాల్సి రా వడం బాధాకరం. విచారణ సమయంలో బాధితురాలు కన్నీళ్లు పెట్టుకోవడం త ప్ప ఏం జరిగిందో చెప్పలేకపోవడం నిజమే. కానీ, ఇలాంటి పరిణామాలు నిందితుడికి అనుకూలంగా మారకూడదు. ఘటన కారణంగా మానసిక కుంగుబాటుకు లోనవడం వల్లే బాధితురాలు మౌనంగా ఉండిపోయింది. ఆమె వాంగ్మూలం ఆధారంగా మొత్తం విచారణ భారాన్ని బాధితురాలి భుజాన వేయడం సరికాదు' అని సుప్రీంకోర్టు ధర్మాసనం విచారం వ్యక్తంచేసింది. ఈ కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కనబెట్టింది. నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. అతడు నాలుగు వారాల్లోపు కోర్టులో లొంగిపోయి శిక్ష అనుభవించాలని ఆదేశించింది.

# చురాచంద్‌పూర్‌లో చల్లారని ఉద్రిక్తత

పాఠశాలలు, కార్యాలయాలలో

తగ్గిన హాజరు

కర్ఫ్యూ ప్రాంతాలలో

భద్రతా బలగాల పెట్రోలింగ్

కుకీ తెగల ప్రజలను పునరావాస

శిబిరాలకు తరలింపు



**ఇంఫాల్ / చురాచంద్‌పూర్ :** జాతిహింస ప్రజ్వరిల్లిన మణిపూర్ రాష్ట్రంలోని చురాచంద్‌పూర్‌లో పరిస్థి తి ఇంకా ఉద్రిక్తంగానే ఉంది. వాహనాలు రోడ్లపై తిరగడంలేదు. పాఠశాలలు, కార్యాలయాలలో హాజరు పలుచగా ఉంది. గురువారం భద్రతా బలగాలు మణిపూర్‌లో కర్ఫ్యూ విధించబడిన చురాచంద్ జిల్లాలో పెట్రోలింగ్ చేశాయి. హమర్, జోమీ తెగల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్న రెండు రోజుల తర్వాత ఒకరు మరణించగా, పలువురు క్షతగాత్రులయ్యారు. మరింత హింస ప్రజ్వరిల్లకుండా బుధవారం రాత్రి అంతా భద్రతా బలగాలు ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించాయి. మంగళవారం జరిగిన ఘర్షణలలో హమర్ తెగకు చెందిన 51సంవత్సరాల వయసున్న లాల్‌రోపుయి ఫఖువాంగ్‌టే హత్యకు గురయ్యారు. బుల్లెట్ గాయాలతో బాధపడుతున్న అతడిని హుటాహుటిన చురాచంద్‌పూర్‌లోని సైల్మట్ క్రిస్టియన్ హాస్పిటల్‌కు తరలించగా, డాక్టర్లు అతడు అప్పటికే చనిపోయినట్లు ప్రకటించారు. ఆదివారం జోమీ ప్రజలు హమర్ ఇన్‌పుయి ప్రధానకార్యదర్శి రిచర్డ్ హమర్‌పై దాడి చేయడంతో రెండు తెగల మధ్య ఘర్షణలు తలెత్తడంతో హింస ప్రజ్వరిల్లింది. మరుసటిరోజైన సోమవారం జి ల్లాలో కర్ఫ్యూ విధించడానికి ఈ ఘటనకు కారణమైంది. అదే సమయంలో పలువురు స్థానభ్రంశం చెందిన కుకీ తెగల ప్రజలను సురక్షిత ప్రాంతాలలోని పునరావాస శిబిరాలకు తరలించారు. చురాచంద్‌పూర్ పట్టణం జోమీ ప్రజలు అధికంగా నివసిస్తున్న ప్రాంతం. అయితే కొన్ని ప్రాంతాలలో స్వల్ప సంఖ్యలో హమర్, కుకీ తెగల వారు కూడా నివసిస్తున్నారు. బుధవారం నాడు చురాచంద్‌పూర్ లో ఒక విద్యార్థి సంఘం బంద్ పిలుపు ఇచ్చిన కొన్ని గంటల తర్వాత శాసనసభ్యుల బృందం, గిరిజన సంఘాలు వేర్వేరుగా శాంతియుతంగా నిర్వహించాలని అభ్యర్థించారు.చురాచంద్‌పూర్‌కు చెంది న దా దాపు 12 కుకీజోమీ, హమర్ సంఘాలు ఒక సం యుక్త ప్రకటనలో తెగల మధ్య శాంతిని కోరుతూ ఈ పరిస్థితిని పర్యవేక్షించేందుకు ఒక సంయుక్త శాం తి కమిటీని నెలకొల్పేందుకు అంగీకరించారు. 2023 మేలో మెయితీలు, కుకీజో గ్రూపుల మధ్య చోటుచేసుకున్న జాతిహింసలో వేలాది మంది నిరాశ్రయులవ్వ గా, 250మంది చంపబడ్డారని గుర్తించారు. ఫిబ్రవరి 13న మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్‌సింగ్ రాజీనామా అనంతరం కేంద్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించింది. మణిపూర్ రాష్ట్ర శాసనసభ కా లం 2027వరకూ ఉన్నది. ఇప్పుడు అది సుప్తచేతనావస్థలో ఉన్నది.

## కర్నాటక మంత్రులపై వలపు వల!

ఉన్నత స్థాయి విచారణకు కర్నాటక ప్రభుత్వం ఆదేశాలు

**బెంగళూరు:** కొందరు సీనియర్ మంత్రులపై హనీ ట్రాపింగ్ యత్నాలు జరిగినట్లు కర్నాటక అసెంబ్లీలో గురువారం చర్చ జరిగింది. దీంతో ఈ వ్యవహారంలో ఉన్నత స్థాయి విచారణకు కర్నాటక ప్రభుత్వం ఆదేశాలివ్వనున్నది. తనను వలపు వలలో పడ వేసే ప్రయత్నాలు జరిగాయని మంత్రి కేఎన్ రాజన్న అసెంబ్లీకి వెల్లడించారు. పార్టీలకు అతీతంగా 48 మంది రాజకీయ నేతలు ఈ వలపు వలలో చిక్కుకున్నట్లు తెలిపారు. సిఎం సిద్దరామయ్యకు రాజన్న సన్నిహితుడు. ఆయన హనీ ట్రాపింగ్‌ను ఓ వ్యాధిగా వర్ణిస్తూ, దీనిపై విచారణకు ఆదేశాలివ్వాలని పరమేశ్వరాను కోరారు. తొలుత మంత్రి సతీశ్ జర్కిహోళి కూడా తన కేబినెట్ సహచరులను వలస వలలో పడ వేసేందుకు రెండు విఫలయత్నాలు జరిగాయని తెలిపారు. హనీ ట్రాపర్లు రాజన్నను లక్ష్యంగా చేసుకున్నారని చెప్పారు. దీంతో రాజన్న మాట్లాడుతూ తనను వలపు వలలో పడ వేసేందుకు ప్రయత్నాలు జరిగినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తానని, దర్యాప్తునకు ఆదేశాలిచ్చి, దీని వెనుకన్న ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు ఎవరో కనిపెట్టాలని కోరారు. 'సీడీలు, పెన్ డ్రైవ్‌లను తయారు చేసే ఫ్యాక్టరీ కర్నాటకలో ఉందని చాలా మంది అంటుంటారు. నాకున్న సమాచారం మేరకు 48 మందికి సంబంధించిన పెన్ డ్రైవ్‌లు (అసభ్య వీడియోలు) ఉన్నాయి' అని రాజన్న తెలిపారు. సభ్యుల గౌరవాన్ని, సభా మర్యాదను కాపాడటం మన కర్తవ్యం' అని అన్నారు. రాజన్న ఫిర్యాదు ఆధారంగా ఉన్నత స్థాయి విచారణకు ఆదేశాలు ఇస్తానని పరమేశ్వర వెల్లడించారు.

## ప్రియుడితో కలిసి
# భర్తను చంపిన భార్య

**జైపూర్:** వివాహేతర సంబంధాలను కప్పిపుచ్చుకోవడానికి జరుగుతోన్న హత్యలు కలవరం సష్టిస్తున్నాయి. ఒకవైపు ఉత్తరప్రదేశ్‌లో మర్చంట్ నేవీ అధికారి హత్య ఘటన కలకలం రేపుతుండగా... రాజస్థాన్‌లోని జైపూర్‌లో అదే తర హా ఘటన వెలుగుచూసింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం... జైపూర్‌కు చెందిన నిందితురాలు గోపాలి దేవికి ఐదేళ్లుగా దీన్ దయాళ్ కుశ్వాహాతో వివాహేతర సంబంధం ఉంది. తాను ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నానని భర్త ధన్నాలాల్ సైనీకి చెప్పి... ప్రియుడిని కలుసుకోవడానికి వెళ్లేది. అయితే ఆమె మాటలపై అనుమానం వచ్చిన సైనీ... ఏ ఫ్యాక్టరీలో పనిచేస్తుందో తెలుసుకునేందుకు గత శనివారం ఆమెను అనుసరించాడు. అతడు వెళ్లి చూసేసరికి గోపాలి దేవి, కుశ్వాహా కలిసి ఉన్నారు. వారి వివాహేతర బంధం బయటపడింది. దాంతో ఆగ్రహానికి గురైన సైనీ వారితో గొడవపడ్డాడు. దీంతో నిందితులు అతడిని పైఫ్లోర్‌కు తీసుకెళ్లి... ఐరన్ పైప్‌తో దాడి చేశారు. తాడుతో గొంతు నులిమి చంపేశారు. ఆ మతదేహాన్ని ఒక బస్తాలో చుట్టి... నిర్మానుష్య ప్రాంతంలో పడేయాలని నిర్ణయించుకున్నారు. కుశ్వాహా బైక్ మీద ఆ బస్తాను తరలించాడు. ఆ దశ్యాలు సిసిటీవీలో రికార్డయ్యాయి. రింగ్‌రోడ్ సమీపంలో ఆ మృతదేహాన్ని దింపి... నిప్పంటించారు. మృతదేహం కాలుతుండగా అటువైపు ఒక కారురావడంతో భయపడిన నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. అప్పటికి మృతదేహం సగమే కాలింది. తర్వాత దానిని గుర్తించి కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెండు రోజుల తర్వాత అది ఎవరిదో నిర్ధారణ అయింది. ఆ దిశగా విచారణ జరపగా నిందితులు నేరాన్ని అంగీకరించారు. ప్రస్తుతం గోపాలిని అరెస్టు చేయగా.. కుశ్వాహా కోసం గాలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## అసెంబ్లీలో నితీశ్ తాండవం



**పాట్నా:** వయస్సు దృష్ట్యా బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ విపరీత ప్రవర్తనతో తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా మరోసారి ఆయన వార్తల్లోకెక్కారు. ప్రస్తుతం బీహార్ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) సభ్యుడు సుగయ్ యాదవ్ గురువారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సెల్‌ఫోన్ చూస్తూ ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన ప్రశ్న అడిగారు. ఆ సభ్యుడు సెల్ ఫోన్ వినియోగించడాన్ని గమనించిన నితీశ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సభలో సభ్యుడు మొబైల్ వాడడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సభలోకి మొబైల్ తీసుకు రాకూడదనే నిబంధన ఉందని నితీశ్‌కుమార్ గుర్తు చేశారు. సభలోకి సభ్యులు ఎవరు మొబైల్ తీసుకు రాకుండా చర్యలు చేపట్టాలని అసెంబ్లీ స్పీకర్‌ను ఆయన కోరారు. గత పదేళ్లలో సెల్‌ఫోన్ వాడకం బాగా పెరిగిందన్నారు. సెల్‌ఫోన్ ఇలా వినియోగిస్తే.. భూమి త్వరలో నాశనం అవుతుందన్నారు. సభకు ఎవరైనా మొబైల్ తీసుకువస్తే... నిర్దాక్షిణ్యంగా బయట పడేయాలని స్పీకర్‌కు సూచించారు. ఈ అంశంపై ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ తన సోషల్ మీడియా ఎక్స్ ద్వారా స్పందించారు. మొబైల్ ఫోన్ల వినియోగం వల్ల ప్రపంచం పదేళ్లలో నాశనం అవుతుందని నితీశ్ కుమార్ చెబుతున్నారని, అయితే పర్యావరణ పరిరక్షణ కోసం అసెంబ్లీని కాగిత రహితంగా ప్రభుత్వం మార్చిందని ఆయన గుర్తుచేశారు. సభలో సభ్యులు అడిగే ప్రశ్నలు... వాటికి సమాధానాలు ఇవ్వాలంటే సెల్‌ఫోన్ లేదా ట్యాబ్ వినియోగించాల్సి ఉందన్నారు. కంప్యూటర్ అంటే తెలియని నితీశ్ కుమార్‌కు.. సెల్‌ఫోన్ సైతం సమస్యగా మారిందని వ్యంగ్యంగా అన్నారు. బీహార్‌కు టెక్నాలజీ వ్యతిరేకి, యువత, విద్యార్థులు, మహిళలకు వ్యతిరేకి అయిన సంప్రదాయవాది ముఖ్యమంత్రిగా ఉండడం దురదష్టకరమని తేజస్వీ యాదవ్ అభివర్ణించారు. నితీశ్‌కుమార్ వ్యాఖ్యలను తేజస్వీ ఖండించారు.

## విపక్షాల గళం
# అణచివేస్తున్న నితీశ్: రాబ్డీ దేవి



**పాట్నా:** రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పిందని, శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, నేరాలుఘోరాలు పేట్రేగిపోయాయని, ఆటవిక పాలన కొనసాగుతోందని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) నాయకురాలు రాబ్డీ దేవి వ్యాఖ్యానించారు. బీహార్‌లోని నితీశ్ సర్కార్ విపక్షాల గళాన్ని అణచివేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో నిత్యం అత్యాచారాలు, దోపిడీలు, లూటీలు జరుగుతున్నా నితీశ్ కుమార్ ప్రభుత్వానికి పట్టడం లేదని దుయ్యబట్టారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం మానేసి, తన భర్త లాలూ ప్రసాద్ యాదవ్ పేరును ప్రస్తావిస్తూ అమర్యాదపూర్వకంగా వ్యవహరిస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రాష్ట్రంలో అత్యాచారాలు, దొమ్మీలు జరుగుతున్నా అసెంబ్లీలో వీటిని ప్రస్తావించరు. ప్రజల సమస్యలపై గళం వినిపించకుండా మమ్మల్ని అడ్డుకుంటారు. ప్రజల తరఫున మాట్లాడకుండా మేము ఏం చేయాలి?' అని రాబ్డీ దేవి నిలదీశారు. 'ఆయన (నితీశ్) మీ భర్త... మీ భర్త అంటూనే ఉన్నారు. మేము ప్రభుత్వానికి సహకరిస్తాం కానీ మా ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా అధికార పక్షం తప్పించుకుంటోంది' అని ఆమె దుయ్యబట్టారు. ఈడీ తనను అడుగున్న ప్రశ్నలను మీరు (మీడియా) నితీశ్ కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ప్రధాని మోదీని అడగాలన్నారు. రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతోందని రాబ్డీ దేవి విమర్శించారు. సుపరిపాలనకు కేరాఫ్‌గా చెప్పుకునే ఈ ప్రభుత్వం... నిత్యం అత్యాచారాలు, హత్యలు, దోపిడీలు జరుగుతున్నా వాటిని ఆపలేకపోతోంది. హోలీ వేళ రెండు రోజుల్లో 22 హత్యలు జరిగాయి కానీ ఎలాంటి చర్యలను ప్రభుత్వం తీసుకోలేదు' అని రాబ్డీ దేవి వ్యాఖ్యానించారు. 'రెండు రోజుల్లో 22 హత్యలు జరిగాయంటే ఒక రోజులో ఎన్ని జరుగుతున్నాయి... రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు ఏం చేస్తున్నారు' అని మండిపడ్డారు. 'ఇది మంగల్ రాజ్... ఇక్కడ ఎవరూ సురక్షితం' కాదు అని ఆమె అన్నారు. రాబ్డీ దేవి అంతకుముందు శాసనమండలి వద్ద ఆర్జేడీ ఎమ్మెల్యేలతో కలిసి ధర్నా చేశారు. రాష్ట్రంలోని పాలన వైఫల్యాలను ఎండగట్టారు.

# అది అత్యాచారం కాదు

అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యలు



**అలహాబాద్:** ఓ మైనర్ బాలికపై జరిగిన అత్యాచారం కేసులో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి రామ్‌మనోహర్ మిశ్రా సంచలన వ్యాఖ్యలు చేశారు. మైనర్ బాలిక వక్షోజాలు తాకడం, ఆమె పైజామా తాడు తెంపడాన్ని అత్యాచార నేరంగా పరిగణించలేమని చెప్పుకొచ్చారు. ఈ చర్యలు తీవ్రమైన లైంగిక దాడి కిందకు వస్తాయని, అత్యాచారంగా పరిగణించలేమని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో పవన్, ఆకాశ్ అనే ఇద్దరు వ్యక్తులు పదకొండేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు 2021 సంవత్సరంలో పవన్, ఆకాశ్ అనే ఇద్దరు వ్యక్తులు బైక్ మీద వెళ్తూ 11 ఏళ్ల బాలికకు లిఫ్ట్ ఇచ్చారు. మార్గమధ్యంలో ఆమెపై దాడికి పాల్పడారు. బాధితురాలి వక్షోజాలు పట్టుకుని, ఆమె పైజామా తాడు తెంపేశారు. తర్వాత ఆమెను కల్వర్టు కిందకు లాగడానికి ప్రయత్నించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ సమయంలో అటుగా వెళ్లేవారు జోక్యం చేసుకోవడంతో నిందితులు పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాస్‌గంజ్ ట్రయల్ కోర్టు ఆదేశాలతో పవన్, ఆకాశ్‌పై పోక్సో చట్టంలోని సెక్షన్ 18, సెక్షన్ 376 కింద సమన్లు జారీ చేశారు. ట్రయల్ కోర్టు ఆదేశాలను నిందితులు అలహాబాద్ హైకోర్టులో సవాలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారించిన హైకోర్టు న్యాయమూర్తి రామ్‌మనోహర్ మిశ్రా సమన్లలోని సెక్షన్లను సవరిస్తూ సంచలన తీర్పు వెలువరించారు. మైనర్ బాలిక వక్షోజాలు తాకడం, ఆమె పైజామా తాడు తెంపడం, కల్వర్టు కిందకు తీసుకెళ్లడాన్ని అత్యాచారంగా, అత్యాచార యత్నంగా పరిగణించలేమని అన్నారు. నిందితులు చేసిన నేరాలు పోక్సో చట్టంలోని సెక్షన్ 18, సెక్షన్ 376 కిందకు రావని స్పష్టం చేశారు. నిందితులపై పోక్సో చట్టంలోని సెక్షన్ 9/10 (తీవ్రమైన లైంగిక వేధింపులు), సెక్షన్ 354బి (మహిళల గౌరవాన్ని దెబ్బతీసే ఉద్దేశంతో దాడి) కింద కేసులు నమోదు చేసి విచారించాలని ఆదేశించారు.



## ఫ్లైఓవర్ అండర్‌గ్రౌండ్‌లో మార్కెట్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని ఫ్లైఓవర్ అండర్‌గ్రౌండ్‌లో పండ్లు, కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం ఫ్లైఓవర్ కింద స్థలాలను ఆయన సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజుతో కలిసి పరిశీలించి మాట్లాడారు. పట్టణంలోని సాగర్‌రోడ్డులో ట్రాఫిక్ సమస్య పెరిగినందున వీది వ్యాపారులతో, తోపుడు బండ్లతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. తోపుడుబండ్ల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకోని ఫ్లైఓవర్ కింద అన్ని సౌకర్యాలతో వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కల్పించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఫ్లైఓవర్ కింద గల కొంత స్థలంలో డీసీఎంలు, బొలెరో, జేసీబీలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## చక్రయ్యగౌడ్ కుటుంబానికి అండగా ఉంటాం

తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్



**ప్రజాపక్షం/నూతనకల్:** హత్యకు గురైన మిర్యాల మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మెంచు చక్రయ్య గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ అన్నారు. గురువారం మండలంలోని మిర్యాల గ్రామంలో ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ. లక్ష ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చక్రయ్య గౌడ్ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేశారని చెప్పారు. ప్రభుత్వపరంగా ఆయన కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఆయనను హత్య చేసిన నిందితులను త్వరలో పట్టుకొని వారికి చట్టపరంగా శిక్షపడేలా చూస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు జెన్నారెడ్డి వివేక్ రెడ్డి, తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ నాగం సుధాసుధాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## కేసారం-2 డబుల్‌బెడ్రూమ్ ఇండ్లను సిద్ధం చేయాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/సూర్యాపేట(రూరల్):** మండలంలోని కేసారం2 రెండు పడకల ఇండ్లను ఏప్రిల్ మొదడి వారంకెల్లా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం మండలంలోని కేసారం గ్రామ సమీపంలో నిర్మిస్తున్న రెండు పడకల గదుల గృహాల సముదాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసారం2లో 480 ఇండ్లకు పనులు జరుగుతున్నాయని వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఏప్రిల్ రెండోవారంలో గృహప్రవేశాలు జరిగేలా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వేణుమాధవరావు, తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, ఆర్ అండ్ బి డిఇ పవన్ కుమార్, అధికారులు ఉన్నారు.

## యాదాద్రిలో 50 టెన్త్ పరీక్ష కేంద్రాలు

**ప్రజాపక్షం/యాదాద్రి** : ఈనెల 21 నుండి జరగబోవు పదవ తరగతి పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. గురువారం మండల విద్యాధికారులు, పరీక్ష సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్లు , డిపార్ట్మెంటల్ ఆఫీసర్లతో జిల్లా కలెక్టరు హనుమంతరావు జూమ్ మీటింగ్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లడుతూ జిల్లాలో పదవ తరగతి పరీక్షకు 8632 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలు హాజరవుతున్నారు. 50 సెంటర్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, అందుకుగాను చీఫ్ సూపరిండెంట్లు 50 మంది, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు 50 మంది, ఇన్విజిలేటర్స్ 576 మంది ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పదవ తరగతి పరీక్షలు సజావుగా జరగడానికి అన్ని ఏర్పాటు పూర్తి చేయడం జరిగిందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పదవ తరగతి పరీక్షలు నిర్వహించేలా చీఫ్ సూపరింటెండెంట్లు మరియు డిపార్ట్మెంటల్ ఆఫీసర్లకు తగిన సూచనలు ఇచ్చారు. ఈ మీటింగ్‌లో జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ రఘురాం రెడ్డి, వివిధ మండలాల విద్యాధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు మరియు డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి:** ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారంతో ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలోని 14 కేంద్రాల్లో ఈనెల 5 నుంచి పరీక్షలు జరిగాయి. గురువారం ద్వితీయ సంవత్సరం పరీక్షలకు గాను మొత్తం 3,577 మంది విద్యార్థులకు గానూ 3,458 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా,117 మంది పరీక్షలకు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి హృదయరాజ్ తెలిపారు. గద్వాలలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్,జ్ఞానప్రభ, వాగ్దేవి, కొట్టం జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మిడియట్ నోడల్ అధికారి తనిఖీలు నిర్వహించారు. గురువారం పరీక్షలు పూర్తికావడంతో విద్యార్థులు కేంద్రాల నుంచి ఉత్సాహంతో బయటకు వచ్చారు. తోటి స్నేహితులను కలుసుకున్నారు. రెండేళ్లు కలిపి చదువుకున్న స్నేహితులు దూరమవుతుండడంతో కొంత మంది నిట్టూర్పు చెందాడు.

## జోగులాంబలో 40 పరీక్ష కేంద్రాలు

**ప్రజాపక్షం / జోగులాంబ గద్వాల ప్రతినిధి :** రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 21న తేదీ నుంచి ఏప్రిల్ 4 వరకు జరగనున్న పదవ తగరతి పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 40 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా గద్వాల పట్టణంలో 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 7,717 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష కొనసాగనున్నాయి. చివరి నిమిషంలో వచ్చే విద్యార్థుల కోసం ఐదు నిమిషాలు అదనపు సమయం కేటాయించనున్నారు. 9:35 గంటలకు గేట్లు మూసివేస్తారు. ఆయా కేంద్రాల్లో ఇప్పటికే సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్స్ ను అధికారులు ఇప్పటికే విడుదల చేశారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా ఉంటుంది. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

# మహిళ చదువుకుంటేనే దేశం అభివృద్ధి

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహిళ చదువుకుంటే కుటుంబంతోపాటు, సమాజం, తద్వారా దేశమే అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.గురువారం ఆయన జిల్లా కేంద్రంలోని రామగిరిలో ఉన్న మహిళా డిగ్రీ కళాశాలలో కోటి రూపాయల ఎస్ డిఎఫ్ నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు.అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ చదువు ప్రతి ఒక్కరికి చాలా ముఖ్యమని, కుటుంబాలు బాగుపడాలంటే ప్రతి ఒక్కరు చదువుకోవాలి అన్నారు. ఇంటర్మీడియట్ విద్య జీవితాన్ని మార్చే సమయమని, అందువలన సమయాన్ని వృధా చేసుకోకుండా కష్టపడి చదివి పైకి రావాలని, సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న మహిళలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థినిలు చదవాలన్నారు. రామగిరి మహిళా డిగ్రీ కళాశాలను దశలవారీగా అంచలంచలుగా అభివృద్ధి చేస్తున్నామని, అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో సాధికారత సాధించేందుకు విద్య చాలా ముఖ్యమన్నారు. అందువల్ల విద్యార్థినీ లు బాగా చదువుకోవాలని, తల్లి దండ్రులు ఎన్నో కష్టాలకు ఓర్చి పిల్లలను చదివిస్తారని, అందువల్ల కష్టపడి చదవాలన్నారు. ప్రభుత్వం కల్పించే ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాసరాజు, ప్రతీక్ ఫౌండేషన్ చైర్మన్ గోనారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ ఉన్నారు.

**చరిత్రలో నిలిచిపోయే బడ్జెట్ :** రాష్ట్ర ప్రభుత్వం బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ చరిత్రలో నిలిచిపోయే బడ్జెట్ అని రాష్ట్ర రోడ్లు ,భవనాలు ,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం ఆయన నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ అందరికీ ప్రతిఫలాలు అందించే విధంగా బడ్జెట్లో ప్రయత్నించడం జరిగిందని తెలిపారు. బడ్జెట్లో ఇరిగేషన్ పెద్దపీట వేయగా, అందులో నల్లగొండ జిల్లా ముందుందన్నారు.జిల్లాలో ఈ రబీలో లక్ష ఎకరాల ఆయకట్టు పెరిగిందని, దీని ద్వారా దాన్యం దిగుబడి పెరిగినప్పటికీ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు.ఎస్ఎల్ బి సీలో ప్రమాదం జరిగి 8 మంది చనిపోవడం బాధాకరమని అన్నారు.ఆర్‌అండ్ బి బడ్జెట్లో భాగంగా 5900 కోట్లతో 12,000 కిలోమీటర్ల రోడ్లకు వచ్చేనెల 2న టెండర్లు పిలువనున్నామని తెలిపారు. నూతన హైకోర్టు భవనాన్ని, 2700 కోట్లతో ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనాన్ని నిర్మించనున్నామని చెప్పారు.ఈ ప్రెస్ మీట్ లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఉన్నారు.



## పారదర్శకంగా ఇసుక తవ్వకాలు

జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు ఆదేశం

**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి:** జిల్లాలో ఇసుక సౌలభ్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం రాజోలీ మండలం తుమ్మిళ గ్రామంలో గుర్తించబడిన ఇసుక డీసిల్టేషన్ ప్రదేశాన్ని కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అక్కడి భౌగోళిక పరిస్థితులను స్వయంగా గమనించి, ఇసుక తవ్వకాల ప్రక్రియ, భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలు, పర్యావరణ పరిరక్షణ అంశాల పై సంబంధిత అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక తవ్వకాలు పూర్తి పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సరఫరా వ్యవస్థను మెరుగుపర్చాలని అధికారులను ఆదేశించారు. నీటిపారుదల, రెవెన్యూ, మైనింగ్ శాఖలు సమన్వయంతో పని చేసి, ఇసుక తవ్వకం, నిల్వ, సరఫరాను సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. అంతకు ముందు కలెక్టర్ తుమ్మిళ ఎత్తిపోతుల పథకాన్ని సందర్శించి, ప్రాజెక్టు పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి నిల్వలు, ఇన్‌డెంట్ చేసిన నీటి సరఫరా , సాగు అవసరాలు, తాగునీటి వినియోగం, భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యల పై అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు. నీటి సరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏ.డి మైనింగ్ అధికారి రమణ, ఇరిగేషన్ ఈ.ఈ శ్రీనివాస్, తహశీల్దార్ రామ్ మోహన్, ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ క్యాలెండర్ అమలులో కాలయాపన తగదు : వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/నల్లగొండ:** జాబ్ క్యాలెండర్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయకుండా తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ), రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నిరుద్యోగులకు అన్యాయం చేయడాన్ని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పార్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం సిపిఐ కార్యాలయంలో సర్దార్ భగత్ సింగ్ 94వ వర్ధంతి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ రూపంలో ఒక అభయాన్ని ఇచ్చిందన్నారు. కానీ, ఆచరణలో రకరకాల కారణాలతో జాబ్ క్యాలెండర్ అమలును కాలయాపన ద్వారా నిర్లక్ష్యం చేస్తోందన్నారు.నిండు అసెంబ్లీలో గత ఏడాది ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ను అమలు చేయలేదని, పరీక్షలు నిర్వహించలేదన్నారు. మార్చి 23న సర్దార్ భగత్ సింగ్ 94వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూడిద సురేష్ ఉపాధ్యక్షులు గడ్డం నవీన్ కార్యదర్శి ఎస్‌కె షరీఫ్,బండారు శంకర్,గోస్కొండ మల్లేష్,జిల్లా సత్యం కట్కూరి లింగస్వామి,మధు,గిరి యాదగిరి,శేఖర్,చాపల విప్లవ్, వంశీ,పానుగుళ శివ,బొడిగె లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



# నాణ్యతతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు

ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య




**ప్రజాపక్షం/యాదాద్రి:** ఆలేరు నియోజకవర్గంలోని ఆలేరు మండలంలో మంతాపురి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కొరకు పైలెట్ విలేజ్‌గా 47 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలసి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల నమూనా చూపించడం జరిగింది. రెండు నెలలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా నాణ్యతతో నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులందరూ సకాలంలో నిర్మాణపు పనులు చేపట్టి ఇళ్లను నిర్మించుకునేందుకు తోడ్పాటు అందించాలని అధికారులకు సూచించారు. మినిమం 400 స్క్వేర్ ఫీట్స్ ఉండాలన్నారు. బేస్మెంట్ లెవల్‌కి రూ.లక్ష, పైకప్పుకు రూ.లక్ష, స్లాబ్ కొరకు రూ.రెండు లక్షలు, ఇల్లు మొత్తం తయారైన తర్వాత రూ.లక్ష రూపాయలు చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ డబ్బులు వారి వారి యొక్క ఖాతాలలో జమ చేయడం జరుగుతుందన్నారు. తదుపరి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, హౌసింగ్ అధికారి శ్రీరాములు, ఎమ్మార్వో ఎంపీడీవోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సాగర్ ప్రాజెక్టు సమీపంలో కార్చిచ్చు

*మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది

**ప్రజాపక్షం/నందికొండ:** సాగర్ ప్రధాన డ్యాం దృశ్య కేంద్రంపై భాగంలో తెలంగాణ ప్రాంతం వైపు ఎడమ ఎర్త్ డ్యాం మీద బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. అగ్ని ప్రమాదానికి గల ప్రధాన కారణం విద్యుదాఘాతం అని తెలుస్తుంది. దీనితో అక్కడ ఉన్న ఎండు గడ్డికి మంటలు అంటుకోవటంతో అగ్ని కీలలు దావనంలా వ్యాపించి ఎర్త్ డ్యామ్ ను చుట్టుముట్టాయి. ఎండలు తీవ్రంగ ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, డ్యామ్ సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపులకి తెచ్చారు. దాదాపు అర కిలోమీటరు మేర మంటలు వ్యాపించి ఎండు గడ్డి దగ్ధమవడంతో ప్రాజెక్ట్ రక్షణ కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కేబుల్ వైర్లు, విద్యుత్ వైర్లు పూర్తిగా దగ్ధం అయ్యాయి. మంటలు వ్యాపించిన ప్రాంతానికి కూత వేటు దూరంలోనే ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, దృశ్య కేంద్రం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సిబ్బంది చురుకుగా ఉండి మంటలు అక్కడకి వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. అగ్ని ప్రమాదం వలన జరిగిన నష్టం లక్షల్లోనే ఉండవచ్చని తెలుస్తుంది అందుకు గురువారం ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్ ప్రాజెక్ట్ అధికారులతో మీటింగ్ ఏర్పాటు చేశారు దీనితో నష్టం అనేది ఎంత జరిగిందో ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.



# జాబ్ క్యాలెండర్ అమలు చేయాలి

ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఎల్లంకి మహేష్, పేరబొయిన మహేందర్



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** జాబ్ క్యాలెండర్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయకుండా తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ), రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నిరుద్యోగులను మోసం చేయడాన్ని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఖండిస్తున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఎల్లంకి మహేష్, పేరబొయిన మహేందర్ తెలిపారు. అఖిలభారత యువజన సమాఖ్య సంస్థాన్ నారాయణపురం మండల జనరల్ బాడీ సమావేశం కొండూరి వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఎల్లంకి మహేష్, పేరబొయిన మహేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ రూపంలో ఒక అభయాన్ని ఇచ్చిందన్నారు. కానీ, ఆచరణలో రకరకాల కారణాలతో జాబ్ క్యాలెండర్ అమలును కాలయాపన ద్వారా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఒకవైపు ఎస్సీ వర్గీకరణ, మరోవైపు బీసీ రిజర్వేషన్ల పెంపు ఈ రెండింటిని కారణంగా చూపడం అసలు సరైంది కాదన్నారు. వాస్తవానికి టీజీపీఎస్సీకి ఇవి రెండూ కూడా అసలు అడ్డు కానే కావని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. జాబ్ నోటిఫికేషన్లు వేసే అధికారం టిజీపీఎస్సికి ఉన్నదని, పరీక్షలను నిర్వహించే అధికారం కూడా టిజీపీఎస్సిదే అన్నారు. ఈ రెండు ఉన్నప్పటికీ కూడా జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లను వేయడాన్ని టీజీపీఎస్సీ ఆలస్యం చేస్తున్నదని వారు విమర్శించారు.ఎంతో ఆశతో ఎదురుచూసే నిరుద్యోగులకు ప్రభుత్వం టీజీపీఎస్సీ ఇచ్చిన జాబ్ క్యాలెండర్ ప్రకారం తప్పకుండా నోటిఫికేషన్ వివరాలను ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఇదే కాకుండా నోటిఫికేషన్ల ప్రకటన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ శాఖ కార్యదర్శి చిలివేరు అంజయ్య, పిసిఐ జిల్లా సమితి సభ్యులు కలకొండ సంజీవ, ఏఐవైఎఫ్ నాయకులు కొండూరి వెంకటేష్, మారగోని నాగరాజు, గడ్డం యాదగిరి, శనిగల నరేష్, వీరమళ్ళ నవీన్, రావుల ప్రశాంత్, గడ్డం యాదగిరి, ఐతరాజు కిరణ్, కొండూరి వంశీ, ఎలుగు ప్రవీణ్, సాయిచరణ్, వినోద్ పాల్గొన్నారు.

# నేటి నుంచి 'టెన్త్' పరీక్షలు

జిల్లా వ్యాప్తంగా 105 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

18,825 మంది విద్యార్థులు హాజరు

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

986 మంది ఇన్విజిలేటర్లు ఏర్పాటు



**ప్రజాపక్షం/ నల్లగొండ ప్రతినిధి:** పదవ తరగతి పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానన్నాయి. ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పరీక్షలు జరుగుతాయి. జిల్లా వ్యాప్తంగా 18, 825 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 18666 మంది ,259 మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారు. అదేవిధంగా105 కేంద్రాల్లో 986 మంది ఇన్విజిలేటర్లు ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేశా రు. 105 మంది డిపార్ట్మెంట్ అధికారులు సిట్టింగ్ స్పాట్లు 13 మంది విద్యాశాఖ రెవెన్యూ పోలీస్ శాఖలకు చెందిన అధికారులు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు అన్ని ఏర్పాట్లను చేశారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్షల కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు ఉంటుంది. గతంలో పదో తరగతి పరీక్షలో పాల్గొన్న విద్యార్థులకు ఆన్సర్ సీట్ అడిషనల్ సీట్లు ఇచ్చేవారు కాని ఈ సంవత్సరం విద్యార్థులకు జవాబు రాసేందుకు 24 పేజీలో బుక్‌లెట్‌ను అందించడం జరుగుతుంది. ఈ బుక్లెట్ పైన కూడా క్యూఆర్ కోడ్‌ను ముద్రించా రు. పరీక్షలు జరిగే ప్రాంతాల్లో ట్రెజరర్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, పోస్ట్ ఆఫీస్ లేని వాటిని సెంటర్లుగా ఎంచుకొని పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వారు ఇతర సెంటర్ వారు ప్రశ్నపత్రాలు పెట్టి పోస్ట్ ఆఫీస్ లోనే పేపర్లను ఉంచుతారని అక్కడి నుంచి పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లి పరీక్ష పూర్తయిన తర్వాత అదే పోస్ట్ ఆఫీస్ లో అప్పజెప్పాల్సి ఉంటుంది. కస్టోడియన్లు జాయింట్ కస్టోడియన్లు పరీక్ష కేంద్రాలకు పేపర్లు తీసుకొని రావడంతో పాటు తిరిగి పోస్ట్ ఆఫీస్‌లకు తీసుకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రతి పరీక్ష కేంద్రంలో చీప్ సూపర్డెంట్ ల రూమ్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రశ్న పత్రాలను సీసీ కెమెరాలు ముందే ఓపెన్ చేస్తారు విద్యార్థులు హాల్ టికెట్ తీసుకొని 45 నిమిషాల ముం దే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని పరీక్ష హాల్లోకి సెల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు లకు అనుమతి లేదు.

## పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాటు

జిల్లా ఎస్పి శరత్ చంద్రపవార్



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్** : నేటి నుంచి వచ్చే నెల ఏప్రిల్ 4 వ తేది వరకు జరగనున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ అన్ని రకాల పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ తెలిపారు.ఈ పరీక్షా కేంద్రాల వద్ద 163 బి.ఎన్.యస్.యస్ 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉ న్న అన్ని జిరాక్స్ సెంటర్స్, ఇంటర్ నెట్ సెంటర్స్, చుట్టుపక్కల లౌడ్ స్పీకర్లు, మూసి వేయాలన్నారు. పరీక్ష సెంటర్స్ వద్ద నుండి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దని అన్నారు. పరీక్షలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్ నందు పొందుపరిచిన విధంగా సమయానికి చేరుకోవాలని అన్నారు. అభ్యర్థులు తమవెంట పరీక్షా హాల్ లోకి సెల్ ఫోన్లు, ట్యాబ్, పెన్ డ్రైవ్, బ్లూటూత్, ఎలక్ట్రానిక్ వాచ్, కాలిక్యులేటర్లు, వాలెట్లు,వంటివి తీసుకువెళ్లడా నికి అనుమతి ఉండదని చెప్పారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లేముందే ప్రధాన గేట్ వద్ద తనిఖీలు నిర్వహించే పోలీసు వారికి సహకరించగలరని పేర్కొన్నారు.

# భద్రకాళి చెరువు పూడికతీత పనులు వేగవంతం

## హనుమకొండ కలెక్టర్ పి. ప్రావీణ్య



**ప్రజాపక్షం/హనుమకొండప్రతినిధి:** భద్రకాళి చెరువులో కొనసాగుతున్న పూడికతీత పనులను సంబంధిత శాఖ ల అధికారులతో కలిసి హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య గురువారం కలిసి పరిశీలించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిలతో కలిసి పూడికతీత పనుల పురోగతి గురించి సాగునీటిపారుదల శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ శంకర్ లను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు జరిగిన పూడికతీత గురించిన వివరాలను కలెక్టర్ ఆరా తీశారు.కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ పూడికతీత పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. మట్టి తరలించేందుకు చెరువు మార్గంలో వీలైనన్ని అంతర్గత దారులు మరిన్ని ఉండేలా చర్యలు చేపట్టి త్వరగా ఎక్కువ సంఖ్యలో వాహనాల ద్వారా మట్టి తరలింపును చేయించాలన్నారు. ఏవైన ఇబ్బందులు ఉన్నట్లయితే తమ దృష్టి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కుడా పీవో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో భద్రకాళి చెరువు పూడికతీత పనులు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో నిర్వర్తించాల్సిన బాధ్యతలపై జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో సాగునీటిపారుదల శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ శంకర్ మాట్లాడుతూ పూడికతీత మట్టిని తరలించేందుకు వెహికల్ పాసులు జారీ చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రవేశం, వెలుపలికి వెళ్లే మరో దారిని ఏర్పా టు చేస్తే ఇబ్బందులు ఉండవన్నారు. రాత్రి వేళలో మట్టి ని తరలించేందుకు అదనపు సిబ్బందిని పర్యవేక్షించేందుకు కేటాయించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ పూడికతీత మట్టిని తరలించేందుకు ఇబ్బందులు లేకుండా అంతర్గత రహదారిని ఒక్కరోజులోనే పూర్తయ్యే విధంగా అధికారులను ఆదేశించారు. సిబ్బంది పర్యవేక్షణ కోసం రెండు రోజు ల్లో పెద్ద కంటైనర్ ఏర్పాటు తాగునీరు, కుర్చీలు సమకూర్చాలని పేర్కొన్నారు. విడతల వారీగా విధులు నిర్వర్తించేందుకు అక్కడ తగిన సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. కౌంటర్లను ఏర్పాటుచేసి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. రాత్రివేళ విధులు నిర్వర్తించేందుకు అదనపు సిబ్బంది నియమించాలన్నారు. రెండు నీటి ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలన్నారు. వీలైనన్ని విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. మట్టి తరలింపునకు ఒకే వైపు కాకుండా మరో మార్గం ద్వారా తరలించేందుకు ప్రత్యామ్నాయ రోడ్డును సిద్ధం చేయాలన్నారు. సోమవారం నుండి రాత్రి వేళల్లోనూ మట్టిని తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. టెండర్ దారులు ఎంత త్వరగా మట్టిని తరలిస్తే అంత మంచిదన్నారు. అధికారులు, టెండర్ దారులు సమన్వయంతో త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, కుడా పీవో అజిత్ రెడ్డి, ఏసీపీలు దేవేందర్ రెడ్డి, సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగబాబు, ఎంవీఐ వేణు గోపాల్, భద్రకాళి చెరువు పూడికతీత మట్టి టెండర్ దారులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

### జయశంకర్ జిల్లా ఎస్‌పి కిరణ్ ఖరే

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు యువత, విద్యార్థులు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్ కోసం బాటలు వేసుకోవాలని జిల్లా ఎస్పి కిరణ్ ఖరే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి, డ్రగ్స్ మహమ్మారిని ప్రారంభ దశలోనే గుర్తించి, నివారించాలని, డ్రగ్స్, గంజాయి విక్రయ దారులు యువతనే లక్ష్యంగా చేసుకుని తమ కార్యకలాపాలను కొనసాగిస్తారని, యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడడం వలన క్రమేపి ఆరోగ్యం క్షీణించడంతో పాటు అది ఒక వ్యసనంగా మారుతుందని, నేర ప్రవృత్తి వైపు దారితీస్తుందన్న విషయం గమనించాలని పేర్కొన్నారు. తద్వారా కుటుంబ సభ్యులు, బంధువులకు దూరమవుతారని అన్నారు. చెడు అలవాట్లకు బానిసై, యువత చెడిపోవద్దని ఎస్పి సూచించారు. దీనిపై యువత చైతన్యం కలిగి ఉండాలన్నారు. డ్రగ్స్ వినియోగిస్తే చాల దుష్పరిణామాలు, చూపుతాయని పేర్కొన్నారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయి సంబధిత సమాచారం తెలిస్తే 87126 58111 నెంబర్ కు ఫోన్ చేసి ఇన్ఫర్మేషన్ ఇవ్వాలని, డ్రగ్స్, గంజాయి నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలు విక్రయిస్తే చట్ట పరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్పి కిరణ్ ఖరే హెచ్చరించారు.

## టెన్త్ పరీక్షలకు భారీ బందోబస్తు

### డిఎస్‌పి ఎన్.రవీందర్



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** నేటి నుండి జరిగే ఎస్ఎస్సి పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ములుగు డిఎస్పి ఎన్ రవీందర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆదేశాల మేరకు ంగురువారం పోలీస్ సిబ్బంది తో ములుగు మండలం లోన ఎక్జామినేషన్ సెంటర్ లను సందర్శించి బందోబస్ట్ ఏర్పాటులను పరిశీలించి తగు సూచనలను ఇవ్వడం జరిగింది. ముఖ్యంగా ప్రతి ఎక్జామినేషన్ సెంటర్ దగ్గర ఖచ్చితంగా బాలికలను తనికీ చేయడం కోసం విమెన్ కర్టెన్ ఏర్పాటు చేయాలి. అలాగే 144 ప్రధాన రహదారి 163అమలులో ఉన్నందున ఎక్జామినేషన్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడ కూడా నలుగురు కంటె ఎక్కువ మంది గుమికూడి ఉండరాదు. అందరూ కూడా పదవ తరగతి ఎక్జామినేషన్స్ అయిపోయే అంతవరకు ఎవరు ఎగ్జామ్స్ సెంటర్ రాకూడదని అన్నారు.

## నగదు రహిత హెల్త్ కార్డుల కోసం కృషి

### ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి




**ప్రజాపక్షం/నెక్కొండ:** ఉపాధ్యాయులకు నగదు రహిత హెల్త్ కార్డులు ప్రభుత్వంచే ఇప్పించుటకై కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో ఎమ్మెల్సీగా ఎన్నికై తొలిసారి తన సొంత మండలం గా భావించే నెక్కొండకు విచ్చేసిన సందర్భంగా ఉపాధ్యాయులు హై స్కూల్ ఆవరణలో ఆయనను సన్మానించారు. శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు ప్రైవేటు ఉపాధ్యాయులకు సైతం నగదు రహిత హెల్త్‌కార్డులు ఇప్పించుటకై ప్రభుత్వంతో మాట్లా డి కృషి చేస్తానన్నారు. ఎం ఈ ఓ రత్నమాల, నెక్కొండ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రంగారావు, పిఆర్‌టియు మండల ప్రధాన కార్యదర్శి యాకోబు రెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు రాపోలు యాదయ్య, నల్లబెల్లి మండల పిఆర్టియు అధ్యక్షుడు నక్కిరెడ్డి మహేందర్, మండల మహిళా అసోసియేషన్ అధ్యక్షురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు వినయ్, రమేష్, లక్ష్మణ్, బండారి రమేష్, ఎంఆర్సి సిబ్బంది, ఎంఎస్‌ఏ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## బల్దియా బడ్జెట్ ఆమోదం



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ మహా నగర పాలక సంస్థకు సంబంధించిన 2025–26 సంవత్సరానికి రూ. 1071.48 కోట్ల అంచనాలతో మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన గురువారం పాలకవర్గం ఆమోదించింది. బల్దియా అకౌంట్స్ అధికారి బడ్జెట్ అంచనాలను వెల్లడించిన మెజార్టీ సభ్యులు అంగీకారం తెలపడంతో పాలకవర్గం బడ్జెట్‌ను ఆమోదించింది. కాగా ఇందులో రూ. 337.38 కోట్లు సాధారణ పన్నుల ద్వారా, రూ. 728.10 కోట్లు గ్రాంట్ల ద్వారా, రూ. 600 కోట్లు డిపాజిట్లు, అడ్వాన్సుల ద్వారా సమకూరుతుందని అంచనా వేశారు. రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీమ్ మసూద్, కార్పోరేటర్లు, బల్దియా వింగ్ అధికారులు పాల్గొన్నారు.

## 'సిల్వర్‌క్రౌన్ హైస్కూల్' విద్యార్థుల ప్రతిభ




**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** శ్రీనివాస రామానుజన్ ఫౌండేసన్ వారు నిర్వహించిన ఒలంపియాడ్ టాలెంట్ టెస్టులో వరంగల్ రంగశాయిపేట బెస్తం చెరువు వద్ద గల సిల్వర్ క్రౌన్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇటీవల ఫౌండేషన్ వారు నిర్వహించిన పరీక్షలో తొమ్మిది మంది విద్యార్థులు రాష్ట్ర, జిల్లాస్థాయిలో అవార్డులు గెలుచుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఎడ్యుకేషన్ ఎక్‌లెన్స్ అవార్డుల పేరిట ప్రముఖుల చేతుల మీదుగా బుధవారం విద్యార్థులు అవార్డు అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు రిత్విక్, జిల్లాస్థాయిలో 2వ ర్యాంకు సిద్దేశ్వర్, లక్ష్యన, 3వ ర్యాంకు నవనీత్, జిల్లాస్థాయిలో ప్రోత్సాహక బహుమతులను హిమబిందు, వర్షిత్, శ్వేత, షేక్ అమీన్, ప్రవీర్‌చంద్‌లు గెలుపొందారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ కూచన కవిత, డైరెక్టర్ వడిచర్ల ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

## 56శాతం ఉన్న బిసిలకు 3.6శాతమా?

**ప్రజాపక్షం/హనుమకొండటౌన్ :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 2025–2026సంవత్సరానికిప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో బీసీలకు అన్యాయం జరిగిందని బిసిసంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 3,04,965 కోట్ల మొత్తం బడ్జెట్లో 56 శాతం పైగా ఉన్న బీసీలకు కేవలం ముష్టి వేసినట్లు 3.6 శాతం రూ. 11,405 కోట్లు కేటాయించి అవమానపరిచారని ఆయన మండిపడ్డారు. బిసిలకు కేటాయించిన ఈ బడ్జెట్ బీసీలకు ఏ విధంగా, ఏ మేరకు, ఏ మూలకు సరిపోతాయా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు చెప్పాలని వేణుగోపాల్ గౌడ్ డిమా ండ్ చేశారు. బీసీలకు స్థానిక సంస్థల్లో మరియు విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదింప చేసిన మీ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం ఎందుకింత వివక్షత చూపుతున్నారని ప్రశ్నించారు. బడ్జెట్లో బీసీలకు ఇంత తక్కువ నిధులు కేటాయించడంలో ఆంతర్యం ఏమిటని, ఇది వివక్షత కాదా..? అని ప్రశ్నించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం ప్రతి సంవత్సరం బీసీలకు 20 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి ఇప్పుడు మాట మార్చడం సరికాదన్నారు.

## అక్రమ నిర్మాణాలు నిలిపేయండి



**ప్రజాపక్షం/నర్సంపేట :** ఏన్నో ఏళ్ల నుండి ప్రభుత్వ భూమి అనిచెబుతూ,అంబేద్కర్‌భవన్‌నిర్మాణం చేసేందుకు స్థలాన్ని గతంలో కేటాయించినప్పటికి, అధికార పార్టీకి చెందిన నాయకులు తమ భూమి అంటూ అక్రమ నిర్మాణాలు చేస్తున్నప్పటికి అధికారులు పట్టించుకోకపోవడంతో కాలనీ వాసులు మనస్థాపానికి గురయ్యారు. కొందరు కాలనీవాసులు నర్సంపేట పట్టణంలోని జిల్లా పరిషత్ సెకండరీ (మోడల్) పాఠశాల ఆవరణలోని వాటర్ ట్యాంక్ ఎక్కి హల్ చల్ చేశారు. ఈ సంఘటన నర్సంపేట పట్టణంలో గురువారంచోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నర్సంపేట పట్టణంనర్సంపేట మహబూబాబాద్ 365 జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని, రెవెన్యూ, మున్సిపాలిటి అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కుమ్మరికుంటలోని ఎస్సీ కాలనీకి చెందిన కొందరు కాలనీ వాసులు పెట్రోల్ డబ్బాలు తీసుకుని పట్టణంలోని పాఠశాల ఆవరణలోని ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తం చేశారు.కలెక్టర్ రావాలంటూ నినాదాలు చేశారు. నర్సంపేట ఏసిపి కిరణ్ కుమార్, నర్సంపేట ఆర్‌డివో ఉమారాణి, తహసీల్దార్ రాజేష్, నర్సంపేట రూరల్ సిఐ సాయి రమణ వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. నర్సంపేట మున్సిపాలిటి టిపివో వీరస్వామిని వివరాలడిగారు. ఇళ్లు నిర్మించేందుకుఅనుమతులులేవనిచెప్పడంతోకూల్చివేయాలని ఆర్డీవో ఉమారాణి ఆదేశించారు. సిబ్బందితో టిపివో వీరస్వామి వెళ్లి పిల్లర్లను తొలగించారు. శాంతించిన కాలనీవాసులు ట్యాంక్ దిగి కిందకు రావడంతో కథ సుఖాంతమైంది.

## ఆస్తిపన్ను చెల్లించిన ప్రెస్‌క్లబ్ కార్యవర్గం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సామాజిక బాధ్యతగా ప్రతిఏటా ఆస్తి పన్ను చెల్లించడంలో భాగంగా ఆస్తి పన్ను చెక్కును గురువారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బాధ్యులు క్లబ్ ఆవరణలో మున్సిపల్ కార్పొరేషన్ 30వ డివిజన్ బిల్ కలెక్టర్ టి విజయ్‌కుమార్,వార్డు అధికారిణి నీరటి నవ్యశ్రీకి అందించారు. రెండేళ్ల కాలంలో మూడు సంవత్సరాల పన్నును చెల్లించడం జరిగిందని గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఒక ఏడాది పన్నును అదనంగా చెల్లించాల్సి వచ్చిందని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్లో సభ్యులు కానీ కొందరు వ్యక్తులు ప్రెస్ క్లబ్ కార్యవర్గంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని,వారికి జర్నలిస్టుల సొమ్ము దుర్వినియోగం చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు వత్తాసు పలుకడం సిగ్గుచేటన్నారు. ప్రెస్ క్లబ్ పాలన పూర్తి పారదర్శకంగా, బ్యాంకింగ్ ద్వారా మాత్రమే జరుగుతున్నదని ప్రెస్ క్లబ్ చరిత్రలో ఎన్నడు లేనివిధంగా క్లబ్‌కు వచ్చే ఆదాయాన్ని పెంచడమే కాకుండా.వచ్చిన నిధులను దుర్వినియోగం చేయకుండా "కాపలా" కాస్తున్నామని, ఒకరిద్దరూ క్రమశిక్షణ లేని వర్కింగ్ జర్నలిస్టులు కానీ వ్యక్తులు చేసే ఆరోపణలను పట్టించుకోవద్దని సభ్యులకు విజ్ఞప్తి చేశారు. తమను సంప్రదించకుండా అనుమానాలను నివృత్తి చేసుకోకుండా అబద్దాలను ప్రచారం చేసే వ్యక్తుల పట్ల కఠిన చర్యలకు ఉపక్రమిస్తామని హెచ్చరించారు. సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు చేసే వ్యక్తులు పద్ధతి మార్చుకోకపోతే చట్టపరంగా ముందుకు వెళ్తామని అన్నారు. జర్నలిస్టుల దశాబ్దాల కల ఇంటి స్థలాల విషయంలోనూ త్వరోలోనే తీపి కబురు చెబుతామని ప్రకటించారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య,సహాయ కార్యదర్శి డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్,కార్యవర్గ సభ్యులు జనగాని ఆంజనేయులు,ఐజెయురాష్ట్రకార్యవర్గ సభ్యులు కంకణాల సంతోష్, రాంరాజ్, కృష్ణ పాల్గొన్నారు.

## కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

### మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/వరంగల్ :** కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖఅన్నారు.వరంగల్ దేశాయిపేటలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నూతనంగా నిర్మించిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌ను మంత్రి కొండా సురేఖ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, కార్పోరేటర్లు కావటి కవిత రాజుయాదవ్, సురేష్ జోషి తదితరులు పాల్గొన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులు కడార్ల రాణి, జన్ను కమల మంత్రిని ఘనంగా సత్కరించారు.

## 'టెన్ బై టెన్' మార్కులు సాధించాలి

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** పదవ తరగతి విద్యార్థులు 10/10 మార్కులు తీసుకువచ్చి రాబోయే రోజుల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య అన్నారు. వారు మాట్లాడుతూ, పరీక్ష హాల్లోకి భయం లేకుండా పోవాలని, పరీక్షలను మంచి దస్తూరితో పేపర్ ప్రజెంటేషన్ చేయాలని సూచించారు. పరీక్ష రాసే ముందు ప్రశ్నాపత్రాన్ని ఒకటికి రెండు సార్లు చదివి అర్థమైన రీతిలో ఒక నిర్ణయానికి వచ్చి సమాధానాలు స్పష్టంగా రాయాలని ఆయన అన్నారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ సూపరిండెంట్ మడుగురి నాగేశ్వర రావు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి పోటీ పరీక్షలను సులువుగా ఎదుర్కోవడానికి ప్రణాళికబద్ధంగా చదవాలన్నారు.

## బూత్‌లెవల్ ఏజెంట్లను నియమించండి

**ప్రజాపక్షం/జనగామప్రతినిధి:** రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్‌లెవల్ ఎజెంట్లను నియమించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. గురువారం బూత్ లెవల్ ఎజెంట్ల నియామకం, స్పెషల్ సమ్మరి రివిజన్ 2025పై గురువారం మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 865 పోలింగ్ కేంద్రాల్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పార్టీకి



చెందిన బూత్‌లెవల్ ఎజెంట్లను నియమించాలన్నారు.జనవరి 6న ఓటరు జాబితాను అన్ని పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో పెట్టడం జరుగుతుందన్నారు. కలెక్టరేట్ ఏఓ మన్సూర్, ఎలక్షన్ సెక్షన్ సూపరిండెంట్ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బృంగి భాస్కర్, బిఆర్ఎస్ ప్రతినిధి రవి, బిజెపి ప్రతినిధి ఎవిజయభాస్కర్,సిపిఎం ప్రతినిధి ప్రకాష్,బిఎస్‌పిఇ నుండి ఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై సమాచార సేకరణే లక్ష్యం

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** చట్టవ్యతిరేక కార్యకలపాలపై ముందస్తు సమాచారాన్ని సేకరించడం స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది ప్రధాన కర్తవ్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. గురువారం వరంగల్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది పోలీస్ కమిషనర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా పోలీసు అధికారులు నిర్వహిస్తున్న విధుల తీరు తెన్నులపై పోలీస్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడతూ క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఖచ్చితమైన సమాచారాన్ని ఖచ్చితమైన సమయానికి అందజేయాలని, స్థానికంగా ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు సమా చారాన్ని సేకరించాలని,రౌడీ షీటర్ల ప్రస్తుత స్థితిగతులపైఆరా తీయడం, భూకబ్జా దారులకు పాల్పడే వారి సమాచారాన్ని సేకరించాలని,అధికారులు క్షేత్ర స్థాయిలో ఎక్కువ సమయాన్ని కేటాయించాలని,భవిష్యత్తులో జరిగే సంఘటనలపై నిఘా వుండాలని. తక్కువ మాట్లాడుతూ ఎక్కువ సమాచారాన్ని సేకరించాలని, పాస్‌పోర్ట్ విచారణ త్వరగా పూర్తి చేయాల్సిన మీ బాధ్యత మీపై వుందని. ముఖ్యంగా నీజాయితీగా పనిచేయాలని, ప్రతిభ కబరిచిన వారికి రివార్డు అందజేయబడుతాయని, వరంగల్ పోలీస్ కమిషనరేట్ కీర్తి ప్రతిష్టలు స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పైనే అధారపడి వున్నాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. స్పెషల్ బ్రాంచ్ ఏసిపిలు జితేంద్ రెడ్డి, పార్థసారధి, రాజు, గురుస్వామి,శేకర్, సంజీవ్,చంద్రమోహన్,డి.ఏ.ఓ ఇషాక్‌తో పాటు తదితరులు పాల్గోన్నారు.

## స్టేషన్‌ఘన్‌పూర్ అభివృద్ధే ధ్యేయం

### ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/రఘునాథపల్లి :** తన ఆలోచన ఎల్లప్పుడూ నియోజక వర్గ అభివృద్ధిపైనే ఉంటుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.రఘునాథపల్లి మండల కేంద్రం తహసీల్దార్ కార్యాలయంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రఘునాథపల్లి మండలానికి సంబందించిన 32మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు 32లక్షల 03వేల 712 రూపాయలచెక్కులను, అలాగే 40మంది ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు 16లక్షల 74 వేల 500 రూపాయల విలువగల చెక్కులను మొత్తం 48లక్షల 78వేల 212రూపాయల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి దరఖాస్తు లను పెండింగ్ లో ఉంచకుండా వెంటవెంటనే పరిశీలించి త్వరితగతిన దరఖాస్తు దారులకు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. 3లక్షల 04వేల కోట్ల బడ్జెట్ లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6గ్యారెంటీలఅమలుకు 56వేల కోట్లను కేటాయించిందని తెలిపారు. నియోజకవర్గానికి మంజూరు అయినా 3,500 ఇందిరమ్మ ఇళ్లతో పాటు అదనంగాముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరో 1500 ఇళ్లు కేటాయిస్తానని హామీ ఇచ్చారని మొత్తం 5వేల ఇందిరమ్మ ఇళ్లు ఉన్నాయన్నారు. ఏడాది లోగా దేవాదుల పెండింగ్ పనులను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. వచ్చే వర్షాకాలం లోగా నియోజకవర్గం లోని ప్రతీ గ్రామానికి, ప్రతీ ఎకరానికి సాగు నీరు అందించే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. అధికారులు, మండల నాయకులు, లబ్ధిదారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ప్రతీ ఇంటికి సంక్షేమం

**లింగాల ఘనపూర్ :** ప్రతీ గ్రామంలో అభివృద్ధి... ప్రతీ ఇంటికి సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. లింగాల ఘనపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మండలానికి సంబందించిన 39మంది కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు 39లక్షల 04వేల 524రూపాయల విలువ గల చెక్కులను అలాగే 43మంది ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు 17లక్షల 55 వేల 500 రూపాయల చెక్కులను అందజేశారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## 'మన అగ్రిటెక్'కు అభినందన

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో ఆధునిక వ్యవసాయ పరికరాలతో నెలకొల్పిన మన అగ్రిటెక్ సంస్థను గురువారం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద సందర్శించారు. మన అగ్రిటెక్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన డ్రోన్ స్ప్రేయర్‌ను కలెక్టర్ సత్యశారద, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి డ్రోన్ మేళాను ప్రారంభించారు.ఒక్కో స్టాల్‌ను కలెక్టర్ వీక్షించారు. మన అగ్రి టెక్ అధినేత పాశింటి రమేశ్ స్టాల్స్‌లో ఏర్పాటుచేసిన ఆధునిక పరికరాలను వివరించారు. నూతనంగా ఆవిష్కరించిన డ్రోన్ ప్రత్యేకతలను వివరిస్తూ ఆధునిక వ్యవసాయంలో రైతులకు మన అగ్రిటెక్ ద్వారా గత 8 ఏళ్లుగా అందిస్తున్న సేవలను చిత్రాల



ద్వారా కలెక్టర్ వివరించారు.ముమ్ముందు తాము అందిస్తున్న ఆధునిక వ్యవసాయ పరికరాలను రైతులకు కావల్సిన సబ్సిడీ కల్పించి తోడ్పాటునందించాలని రమేశ్ కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ అభినందించారు. సబ్సిడీ విషయంలో కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఎనుమాముల మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ పెద్దలు, మార్కెట్ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 'జయశంకర్'లో టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జిల్లాలో నేటి నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు ఈనెల 21 నుండి ఏప్రిల్ 4 వరకు జరుగనున్నాయి. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు, భారీ పోలీస్ బందోబస్తు నడుమ కట్టుదిట్టమైన భారీ భద్రత మధ్య పరీక్షలు నిర్వహించనున్నారు. పోలీస్ పహారాతో పాటు వేసవి దృష్ట్యా చల్లని తాగునీటిని ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.జిల్లావ్యాప్తంగా మొత్తం 34 49 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. 21 పరీక్షా కేంద్రాలు, 121 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరిక్ష రాయనున్నారు. అందులో 1725 మంది బాలురు కాగా 1724 మంది బాలికలు మొత్తం 3449 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారు. పరీక్షలు నిర్వహణకు 12 జోన్స్ గా విభజించి, 20 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 20 మంది డిపార్ట్మెంటల్ అధికారులు, సి కేంద్రాలకు ముగ్గురు కస్టోడియన్స్, రెండు రూట్లు గా విభజించి ఇద్దరు రూటు అధికారులను, రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్స్, రెండు సిట్టింగ్ స్క్వాడ్స్, 230 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. సీఎస్ సమక్షంలో సిసి కెమెరాల పర్యవేక్షణలో ప్రశ్నపత్రాలను తెరవనున్నారు. విద్యార్థులను ఉదయం 9 గంటల నుండి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 930 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుంది. పరీక్షకు లేట్ అయిన వారికి ఐదు నిమిషాలు మాత్రమే అవకాశం కల్పించనున్నారు. వేసవి కాలంలో ఓఆర్ఎస్ ప్యా కెట్లు అందుబాటులో ఉంచడంతో పాటు మొబైల్ అత్యవసర వాహనాలు అందుబాటులో ఉంచారు. మొత్తంగా జిల్లాలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో 10వ తరగతి పరీక్షలకు అధికార య ంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేశారు.

### పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

### కలెక్టర్ రాహుల్ శర్మ

నేటి నుండి ప్రారంభం కానున్న 10వ తరగతి పరీక్షలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లాలో ఈసారి నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా బోధన సాగిందని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధనకై విద్యార్థులకు పునశ్చరణ తరగతులు, రెండుసార్లు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించామని అన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించామని, ఫలితాలు తప్పక ఆశాజనకంగా ఉంటాయని పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధనకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం, సాయంత్రం రెండు గంటల పాటు అదనంగా ప్రత్యేక తరగతులు నిర్వహించి సన్నద్ధం చేశామని తెలిపారు. గతేడాది వార్షిక ఫలితాల్లో 93 శాతం ఉత్తీర్ణతతో, రాష్ట్రంలో 16వ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈ సంవత్సరం ఉత్తమ నూరు శాతం ఫలితాలు సాధన లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించడంతో పాటు విద్యార్థులకు ఓఎంఆర్ షీట్స్ పై అవగాహన కల్పించామని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేశామని, పరీక్ష ముగిసిన తదుపరి సమాధాన పత్రాలకు పకడ్బందీగా సీల్ వేసేలా జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/ కమలాపూర్:** మహిళల అభ్యున్నతి కోసం రాష్ట్ర సిఎం రేవంత్ రెడ్డి ఉగాది కానుకగా 88 లక్షల 1 వెయ్యి 48 రూపాయలు విడుదల చేయడం పట్ల మహిళా సంఘాల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కమలాపూర్ కు చెందిన లక్ష్మి సాయి గ్రామైక్య సంఘం సభ్యులు సంఘంలో 33 స్వయం సహకార సంఘాలు ఉన్నాయని, అందులో భాగంగానే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని సంఘం అధ్యక్షులు మౌటం సంధ్యారాణి తెలిపారు. ఏప్రిల్ 2024 నుండి జనవరి 2025 వరకు 33 స్వశక్తి సంఘాలకు వారికి సంబంధించిన పొదుపు ఖాతాలలో డబ్బులు జమ చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ప్రతి సభ్యురాలుకు తెలియజేయడం కోసమే సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి సాయి సంఘం ప్రధాన కార్యదర్శి చినుమల్ల రాధిక, కోశాధికారి అనిత, ఉపాధ్యక్షురాలు రామగిరి సుజాత, వివోఏ మేడిపల్లి శ్రీలత, మహిళలు పాల్గొన్నారు.

## రైతులకు అండగా ఉంటా

ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

**ప్రజాపక్షం /జగిత్యాలరూరల్ :** జగిత్యాల రూరల్ మండలం జగిత్యాల చల్గల్ మార్కెట్ యార్డులో 1 కోటి 70 లక్షలతో నిర్మిస్తున్న ఫ్లాట్ ఫారంను పరిశీలించి పనులు నాణ్యత గా జరిగేలా చూడాలని, మామిడి మార్కెట్ సీజన్ వస్తున్న సందర్భంగా మార్కెట్‌లో రైతులకు, వ్యాపా రులకు ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్.ఎమ్మెల్యే సంబధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 1 కోటి రూపాయలతో సీసీ రోడ్లు, మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టడం జరిగిందని, మార్కెట్ అభివృద్ధికి ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నట్లు తెలిపారు. రూ.7 కోట్లతో మ్యాంగో మార్కెట్ లో షెడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రం లో 52 మార్కెట్ లకు గాను జగిత్యాల, రాయికల్ మార్కెట్ లకు మాత్రమే నిదులు మంజూరు అయ్యాయని, రైతు భరోసా 3 ఎకరాల వారికి విడుదల చేసినట్లు తెలిపారు.రైతులకు అన్ని విధాలుగా ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లులు దామోదర్ రావు, రాధ రవీందర్ రెడ్డి, నాయకులు ఎల్లారెడ్డి, సురేందర్ రావు, బాలా ముకుందం, మహేశ్వర్ రావు, గిరినాగ భూషణం, అడువల లక్ష్మణ్, జగిత్యాల మండల, పట్టణ నాయకులు, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని మండలేశ్వర స్వామి ఆలయ సమీపంలో గోగికార్ రాములు, గోడికె శంకర్ వారి జ్ఞాపకార్థంగా చలివేంద్రాన్ని గురువారం స్థానిక శాసన సభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎండ తీవ్రత నుండి ఉపశ మనం పొందాలంటే తాగునీరు ఎంతో ఉపయోగమన్నారు. నిత్యం జాతీయ రహదారిపై వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండడం వాహనదారులకు ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని వారు అభిప్రాయ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు గోగి కార్ మహేందర్, గోలి శ్రీనివాస్, పంబాల రాము, భూమన్న, సీపెల్లి రవీంధర్, సుధాకర్, కిషోర్ సింగ్, రాజు(లింబాజీ), భారత్, అజయ్, సుమన్, తదితరులు ఉన్నారు.




## ఉపాధి పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి

బికెయంయు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఉపాధిహామీ కూలీలు పనిచేస్తున్న పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించి కూలీలకు రక్షణ కల్పించాలని బికెఎంయు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ కోరారు. గురువారం బికెఎంయు ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ డిఆర్‌డివో శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో పనిచేస్తున్న మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు, మౌలిక వసతులు లేక తీవ్ర ఎండ ప్రభా వంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పని ప్రదేశాల్లో మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని, వోఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని, దూర ప్రదేశాలకు వెళ్లే కూలీలకు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. అధికారుల పర్యవేక్షణ ఎల్లవేళలా ఉండాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రేట్లను 600 రూపాయలకు పెంచాలన్నారు. 200 రోజులు కూలీలకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎగుర్ల మల్లేశం, నాయకులు నల్లగొండ శ్రీనివాస్, రాజయ్య తదితరులున్నారు.

## పరీక్ష కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ అమలు



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో జరిగే పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్ష కేంద్రాల వద్ద మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ యాక్టు 2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో ఉంటుందని కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌస్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు గురువారం వెలువడ్డాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం పదవ తరగతి పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాలకు ఐదు వందల మీటర్ల దూరం వరకు ఇద్దరికి మించి గుంపులుగా ఉండరాదని, అదేవిధంగా ఎలా ంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజెలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించ రాదని పేర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్ జిరాక్స్ షాపులు మూసివేయాలని సూచించారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు కరీంనగర్ సిపి తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కరీంనగర్ సిపి తెలిపారు.

## సబ్బండ వర్గాల అభ్యున్నతే లక్ష్యం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్




**ప్రజాపక్షం/గంగాధర :** రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్ అన్నారు. బిసి, ఎస్‌సి వర్గాల ప్రజలు ఏళ్లుగా ఎదురుచూస్తున్న బిసి రిజర్వేషన్ బిల్లును, ఎస్‌సి వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడం చరిత్రక నిర్ణయం అని పేర్కొన్నారు. బిసి, ఎస్సీ వర్గాలపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనం అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయిస్తూ ఎస్సీ వర్గీకరణకు ఆమోదిస్తూ అసెంబ్లీలో ఆమోదించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో మండలాధ్యక్షుడు పురమల్ల మనోహర్, దుబ్బాసి బుచ్చయ్య, జాగిరపు శ్రీనివాస్ రెడ్డి, రామిడి రాజిరెడ్డి, దొర్నాల శ్రీనివాస్ రెడ్డి, వేముల బాస్కర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొలెపాక స్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దూలం వీరేశం తదితరులున్నారు.

## ఉపకాల్వ ధ్వంసంపై ఇఇకి ఫిర్యాదు

**ప్రజాపక్షం/శంకరపట్నం** శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామ శివారు లో ఎస్సారెస్పీ ఉపకాల్వ ధ్వంసంపై గురువారం ఈఈకి యువజన సమితి రాష్ట్ర కార్యదర్శి మోరె గణే ష్ ఫిర్యాదు చేశారు. మొలంగూర్ గ్రామంలోని 3 ఎల్ ఉపకాల్వ నుంచి సర్వే నెంబర్ 753, 754, 755, 756 సర్వే నెంబర్లతో పాటు ఇతర ప్రభు త్వ సీలింగ్ భూములకు ఈ కాల్వ ద్వారా గతంలో సాగునీరు అందేది అని తెలిపారు. కొంత మంది రియల్టర్లు 3ఎల్ ఉపకాల్వను ధ్వంసం చేయడంతో సాగునీరు అందడం లేదన్నారు. నిరుపేద దళితులు వెనుకబడిన వర్గాలు ఈ భూము ల్లో పంటలు సాగు చేసుకుంటున్నారని, సాగునీరు లేక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. ధ్వంసమైన కాల్వను పునరుద్ధరణ చేయాలని ఇఇని కోరారు.

## సమస్యల పరిష్కారమే ఎఐటియుసి ధ్యేయం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:**సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల సమ స్యల పరిష్కారం కోసం ఎఐటియుసి కృషి చేస్తుందని సింగరేణి కాంట్రాక్టు వర్క ర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం.ఎ. గౌస్ పేర్కొన్నారు. గురువారం సింగరేణి సెక్టార్ టూ లోని సి జోన్ లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను కలిసి అనంతరం ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న సిజోన్ డిజోన్ కార్మికులను యాజ మాన్యం టెండర్ కాలపరిమితి ముగిసిందని ఇరవై రోజుల పాటు పని లోకి తీసుకోకుండా పక్కకు పెడితే ఎఐటియుసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆర్జీవన్ సివిల్ అధికారులతో మాట్లాడి విధుల్లోకి తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. యాజమాన్యం సిజోన్ డిజోన్‌లకు టెండర్‌లను పిలిచిందని, ఇది ఎఐటియుసి కృషి అని కార్మిక వర్గం గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి నాయకులు కోట వెంకన్న, చెంద్రయ్య, ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పలుఅభివృద్ధి పనులకు శ్రీకారం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి పట్టణంలోని 15వ వార్డు చందపల్లిలో టియుఎఫ్ఐడిసి నిధులు 35లక్షల అరవై వేయిల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్డును గురువారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ పెద్దపల్లి పట్టణంలో మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులను అభివృద్ధి చెయ్యడం జరుగుతుందనీ 15 అవార్డు ప్రజల సౌకర్యార్థం ఈరోజు టియుఎఫ్ఐడిసి నిధుల ద్వారా 500 మీటర్ల సిసి రోడ్డును ప్రారంభించామని, అలాగే చందపల్లి నుండి తుర్కలమం దికుంట వరకు ఇటీవలే బిటి రోడ్ పూర్తి చేసుకోవడం జరిగిందనీ, దానికి లింక్ అయి ఉన్నటువంటి 500 మీటర్ల సీసీ రోడ్ అయిన బిటి రోడ్ అయిన సంబంధిత అధికారులతో మాట్లాడి పూర్తి చేయడం జరుగుతుందన్నారు. చందపల్లిలో దరిదాపు మంచి నీటి సరఫరా 90% పూర్తి చేయడం జరిగిందని ఇంకా 10% సరఫరా ఏమైనా ఇబ్బంది ఉన్నట్లయితే పూర్తిగా మరమ్మతులు చేసి వేసవి కాలంలో మంచినీటి సరఫరా ఇబ్బంది లేకుండా చూస్తామని అన్నారు. పెద్దపల్లి పట్టణంలో దాదాపుగా 30 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని ఇప్ప టివరకు 10 కోట్ల రూపాయలతో మురికి కాలువలు సీసీ రోడ్లు పనులు పూర్తి చేసుకోవడం జరిగిందని ఇంకా 20 కోట్ల రూపాయల పనులు పురోగతి లో ఉన్నాయని అవి కాకుండా 15 కోట్ల రూపాయల పనులను అంచనా వేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా పెండింగ్ ఉన్న పనుల ను అన్ని వార్డు ల్లో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ ,వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప, ఎఇ సతీష్,టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్, మాజీ కౌన్సిలర్లు, వార్డు ప్రజలు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## నియోజకవర్గంలో ఎమ్మెల్యే గంగుల విస్తృత పర్యటన

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** కరీంనగర్ నియోజకవర్గంలో గురువారం మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విస్తృతంగా పర్యటించారు. కొత్తపల్లి మండలంలోని ఖాజీపూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గంగులకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలను అందించి శాలువాతో సత్కరించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేఇన సిఆర్ఆర్ నిధులు సుమారు నాలుగున్నర కోట్ల రూపాయలతో ఖాజీపూర్ నుంచి ఐలవాని పల్లెకు వెళ్లే బిటి రోడ్డు నిర్మాణానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్లకు అధికారులకు తగు సూచనలు చేశారు. రోడ్డును నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని అదికారులను ఆదేశించారు.కరీంనగర్ పట్టణంలోని 21 డివిజన్ సీతారాంపూర్‌కు చేరుకున్న ఎమ్మెల్యే స్థానిక మాజీ కార్పోరేటర్ జంగిలి సాగర్‌తో కలిసి డిఎంఎఫ్‌టి నిధులు సుమారు 40 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణానికి, అనంతరం నగరపాలక సంస్థ పరిధిలోని గోపాలపూర్ వార్డులో సిఆర్ఆర్ నిధుల ద్వారా బిటి రోడ్డు నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కొత్తపల్లి మాజీ ఎంపిపి పిల్లి శ్రీలత మహేష్, మాజీ కార్పొరేటర్ వంగపల్లి రాజేందర్‌రావులు పాల్గొన్నారు.

## అడుగంటిన భూగర్భజలాలు

### ఎగువ ప్రాంత రైతుల కళ్లలో కన్నీరు



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** చిగురుమామిడి మండల పరిధిలోని ఎగువ ప్రాంత రైతులు సాగునీటి కష్టాలతో విలవిల్లాడుతున్నారు. వరి చేను పొట్టకొచ్చేదశలో పంటలు నీటి ఎద్దడితో ఎండిపోతున్నాయి. భూగర్బజలాలు అడుగంటి బావులలో నీటి చుక్క తడి లేకుండా ఎండిపోతున్నాయి. ఉన్న కాస్త నీరు పొలానికి పారించేందుకు రైతులు కరెంటు మోటార్ల ద్వారా నీరు పెట్టిన అరగంట వ్యవధిలో నీటి నిల్వలు పడిపోతు న్నాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో వివిధ పద్దతుల ద్వారా ట్యాంకర్ల సహాయంతో పొలాలకు నీరు పారిస్తూ భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. మండల పరిధిలోని ఒగులాపూర్, ఇందుర్తి, ముది మాణిక్యం, రామంచ, ముల్కనూర్, సీతారంపూర్, పీచుపల్లి, రేకొండ, బొమ్మనపల్లి గ్రామాలకు వరద కాల్వల ద్వారా రైతులకు సాగునీరు అందిస్తున్నారు. మిగతా ఎగువ ప్రాంత రైతులకు కెనాల్ ద్వారా నీరందించే సౌకర్యం లేనందున వేసవికాలంలో పంటలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం వెంటనే చేపట్టి సాగునీరు కష్టాలను తీర్చాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## పొలాలు ఎండిపోకుండా అధికారులు చర్యలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

యాసంగి పంటకు నీటి విడుదలపై సమీక్ష



**ప్రజా పక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** జిల్లాలో ఎస్సారెస్పీ క్రింద యాసంగి పంట పొలాలు సరిగా నీటి సరఫరా కోరకు అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటూ వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లాకలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం 83 కాల్వ క్రింద యాసంగి పంటకు నీటి విడుదల, పైసంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ ఎస్సారెస్పీ కాల్వ క్రింద యాసంగి పంట కింద 7 తడులలో 6 తడుల నీటిని ఇప్పటికే విడుదల చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగిపోవడం, ఎ స్సారెస్పీ నుంచి ఆశించిన స్థాయిలో నీరు విడుదల కాకపోవడం, ఎండ తీవ్రత వల్ల ఆవిరి లో కొంత నీరు నష్టపోవడం వంటి కారణాల వల్ల చివరి ఆయకట్టు ప్రాంతాల్లో పంట పొలాలకు ఆశించిన స్థాయిలో నీరు అందడం లేదని అన్నారు. ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న నీటి నిల్వలను జాగ్రత్తగా వినియోగించుకోవాలని, ఎస్సారెస్పీ కాల్వలపై ఎక్కడా నీటి వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కాల్వల పై అవసరమైన చోట తగు చర్యలు తీసుకుంటూ నీటిని విడుదల చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను సంబంధిత అధికారులను తెలుసుకొని వారికి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సంబంధిత జిల్లా ఇరిగేషన్ అధికారి శ్రీనివాస్,మంథని ఈ ఈ బాల రామయ్య ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసులపై అవగాహన

జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** డిస్ట్రిక్ట్ లెవల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని జగిత్యాల జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జగిత్యాల ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ అధ్యక్షతన జగిత్యాల డిస్ట్రిక్ట్ లెవల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్.సి, ఎస్.టి అట్రాసిటీ కేసులలో జాప్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం చేయాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత సంబధిత అధికారులను ఆదేశించారు. జగిత్యాల జిల్లాలో ఎస్.సి, ఎస్.టి అట్రాసిటీ కేసుల నమోదు, ఆయా కేసుల పరిష్కారానికి అధికారులు తీసుకుంటున్న చర్యలు, బాధితులకు అధించాల్సిన లబ్ధి పై కమిటీ సభ్యులు చర్చించారు. ముఖ్యంగా జిల్లాలో ఎస్.సి, ఎస్.టి అట్రాసిటీ కేసులు వివిధ స్థాయిలలో పెండిగులలో ఉన్నాయని వాటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని, ప్రతి సంవత్సరం అట్రాసిటీ కేసులు పెరగకుండా కట్టడి చేయవచ్చన్నారు. కమిటీ సభ్యులు ఎస్.సి, ఎస్‌టిలకు సంబధించిన భూములను వేరే ఇతర కులాలకు చెందినవారు కబ్జాలు చేయకుండా చూడాలని ఎస్.సి, ఎస్.టీ అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో జగిత్యాల, ఆర్.డి.ఓ మధుసూదన్, జగిత్యాల డిఎస్పీ రఘు చందర్, డిఆర్‌డిఒ రఘు వరన్, జగిత్యాల జిల్లా ఎస్.సి అభివృద్ధి శాఖ అధికారి రాజ్ కుమార్, జగిత్యాల డి.ఎం.హెచ్.ఓ ప్రమోద్ కుమార్, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ అధికారి, జెడ్పీ సీఈవో, ఎస్.సి, ఎస్.టీ అట్రాసిటీ కమిటి సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నీటిని విడుదలలో నిర్లక్ష్యం ఎందుకు..?

వంటేరు ప్రతాప్‌రెడ్డి



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** జగదేవ్‌పూర్ మండలంలోని మునిగడప పెద్ద చెరువు వరకు నాలుగు కిలోమిటర్ల మేర కాలువ నిర్మాణ పనులు పూర్తైనప్పటికీ కొండపోచమ్మ సాగర్ నీటిని వదలడంలో నిర్లక్ష్యం ఎందుకని ఎఫ్‌డిసి మాజీ చర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాలక ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం మునిగడప వద్ద పెండింగ్‌లో ఉన్న కాలువ పనులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో కెసిఆర్ ప్రభుత్వం కొండపోచమ్మ సాగర్ నుండి మునిగడప చెరువు వరకు కాలువ నిర్మాణం పనులను 99శాతం పూర్తిచేసిందన్నారు. అక్కడక్కడ పెండింగ్‌లు పనులు ఉన్నప్పటీకి వాటిని పూర్తి చేస్తే మునిగడప చెరువులోకి నీటిని నింపితే సిద్దిపేట జిల్లాలోని 20 గ్రామాలతో పాటు వరంగల్, యాదాద్రిభువనగిరి జిల్లాలోని పలు గ్రామాలకు భూగర్భ జాలాలు పెరుగుతాయన్నారు. జగదేవ్‌పూర్ నుండి మునిగడప పెద్ద చెరువు వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల ఈ కాలువ ద్వారా సాగు నీరును అందిస్తే వందల ఏకరాలలో రైతులు పంటలు సాగు చేసుకోని ఆర్థికంగా బలపడుతారని తెలిపారు. రేవంత్‌రెడ్డికి చిత్త శుద్ధి ఉంటే ఈ నేల 25 లోపు మునిగడప పెద్ద చెరువులోకి కొండపోచమ్మ సాగర్ నీటిని నింపే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పనుగట్ల శ్రీనివాస్‌గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ ఇంద్రసే నారెడ్డి, మాజీ సర్పంచ్‌లు యాదవరెడ్డి, మహేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి,నాయకులు కవిత శ్రీనివాస్‌రెడ్డి, బాలకిషన్, ఐలయ్య, బాల్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులనుపరిష్కారించాలి

సిద్దిపేట సిపి డాక్టర్ అనురాధ

ప్రజాపక్షం/సిద్దిపేట : హుస్నాబాద్ డివిజన్‌లో ఉన్న పెండింగ్ కేసులను త్వరగా పరిష్కారించాలని, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని సిద్దిపేట పోలీస్ కమీషనర్ డాక్టర్ అనుధాధ పోలీస్ అధికారులను అదేశించారు. గురువారం సిద్దిపేట కమిషనర్ కార్యాలయంలో హు స్నాబాద్ డివిజన్ పోలీస్ అధికారులతో పలు సమస్యలపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. అమె మాట్లాడుతూ 2023–2024సవత్సరంలో ఉన్న పెండిగ్ కేసులపై ఎసిపి,సిఐ లను అడిగి తెలుసుకున్నారు. పది పరీక్షల సందర్బంగా పరీక్ష కేంద్రాల వద్ద ఏలాంటి సమస్యలు తలెత్తకుండ పటిష్ట బందోబస్తు ఏర్పటు చేయాలని అలాగే త్వరలో జరుగబోవు స్థానిక ఎన్నికలకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని , రోడ్డు ప్రమాదాలు జరగకుండ, ఏలాంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధినిర్వహనలో ఎలాంటి అలసత్వం వహించిన వారిపై శాఖ పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో అడిషనల్ డిసిపి సుబాష్‌చంద్రబోస్, హుస్నాబాద్ ఎసిపి సతీష్ , సిఐలు శ్రీనివాస్, చేర్యాల సి ఐ శ్రీను, ఎస్‌బి ఐ ఇన్స్‌పెక్టర్ కిరన్, రామకృష్ణ, ఏఒ యాదయ్యతో పాటు ఎస్ ఐలు తదితరులు పాల్గొన్నారు.

## జోష్ నింపిన ‘ఆల్ఫోర్స్ ‘బ్లింక్’’వార్షికోత్సవ వేడుకలు





**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి :** కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో గల అల్ఫోర్స్ పాఠశాల ప్రాంగణంలో ‘బ్లింక్’ పేరుతో నిర్వహించిన పాఠశా ల వార్షికోత్సవ వేడుకలు జోష్ నింపాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య యు.ఉమేష్ కుమార్, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డిలు హాజరయ్యారు. విసి ఉమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు కళల వైభవాన్ని విశ్లేషించి చెప్పాలని తద్వారా వారికి కళల పట్ల ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన ఉండాలని, అందులో పాల్గొనడానికి ఆసక్తితో ఉండేలా దృష్టి సారించాలన్నారు. మన దేశచరిత్ర విభిన్న కళలకు విశిష్టమైనదని గుర్తు చేస్తూ అటువంటి కళలు, సాంప్రదాయాలు మరే ఇతర దేశంలో అవలంభించరని చెప్పారు. ఆల్ఫోర్స్ విద్యా సంస్థల్లో నరేందర్ రెడ్డి సారథ్యంలో విద్యార్థులకు వివిధ కళా నైపుణ్య కార్యక్రమాలను దశల వారీగా నిర్వహించడం అభినందనీయమన్నారు. డా.వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ప్రణాళిక బద్ధంగా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను సృజనాత్మకతను వెలికి తీయడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయడం చాలా గొప్ప విషయమని, వారికి కావాల్సిన వనరులను కల్పించి అద్భుతాలు చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు గత 35 సంవత్సరాలుగా నాణమైన విద్యనందించడం చాలా అదృష్టం గా బావిస్తున్నామన్నారు. వేడుకల్లో భాగంగా విధ్యార్థులు ప్రదర్శినంచిన నృత్యాలు ఆకట్టుకున్నారు. వార్షిక ప్రణాళికలలో భాగంగా నిర్వహిం పబడిన వివిధ ప్రతిభాపాటవ పోటీలలో, పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేసి శుభాభి నందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పది పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

ఎంఇఒ భూక్యబన్నాజి



**ప్రజా పక్షం/ వేములవాడ:** నేటి నుండి నిర్వహించే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాధికారి భూక్యబన్నాజి తెలిపారు. వేములవాడ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, హంసిని హై స్కూల్, గౌతం మోడల్ స్కూల్, కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్, శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్ ఆరు పరీక్షా కేంద్రాలలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని అన్నారు .మొత్తం మండల కేంద్రాల్లో ఆరు పరీక్షా కేంద్రాలలో 1243 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని ఇట్టి పరీక్షలు ఈనెల 21 తేదీ నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఉదయం 9:30 నుండి 12.30 వరకు జరుగునని తెలిపారు పరీక్ష జరుగు ఆరు పరీక్ష కేంద్రాలను మండల విద్యాధికారి తనిఖీ చేసి పరీక్ష కేంద్రాల వద్ద మంచినీటి సౌకర్యం వైద్య సౌకర్యం అందుబాటులో ఉంటాయని, అలాగే విద్యార్థినీ విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, హాల్ టికెట్, బ్లూ, బ్లాక్ పెన్,లాంగ్‌స్కేల్ తమ వెంట తెచ్చుకోవాలని, విద్యా ర్థులు పరీక్ష కేంద్రంలో నిర్ణీత సమయం 9.30 నిమిషాలు తర్వాత ఐదు నిమిషాలు అనగా 9. 35 నిమిషాల వరకు వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఇస్తారని అనగా 5 నిమిషాలు గ్రేస్ పీరియడ్ ఉంటుందని, ఆ తరువాత ఎట్టి పరిస్థితుల్లో విద్యార్థిని విద్యార్థులను పరీక్షా కేంద్రం లోపలకు అనుమతించరని మండల విద్యాధికారి తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, విద్యార్థులు ఎలాంటి ఒత్తి డికి లోనుకాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని మండల విద్యాధికారి భూక్యా బన్నజీ తెలిపారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాలలో చీఫ్ సూపరిండెంట్ బుర సదానందం, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ లక్ష్మణ్,పట్టణ సిఆర్పి ఆకుల శ్రీనివాస్ లతో పరీక్ష ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

## రెనేఆసుపత్రి, ట్రాఫిక్ పోలీసు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ




**ప్రజాపక్షం/కరీంనగర్ :** ప్రపంచ తల గాయాల అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని రెనే హాస్పిటల్, కరీంనగర్ ట్రాఫిక్ పోలీసు సం యుక్త ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంలోని రెనే ఆసుపత్రి నుంచి తెలంగాణ చౌక్ వరకు బైక్ ర్యాలీని ని ర్వహించారు. ఈ ర్యాలీని కరీంనగర్ ఏసిపి వెంక ట్ స్వామి జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. బైక్ నడిపే ప్రతి క్షణం విధిగా హెల్మెట్ ధరించాలని, మన వారి కోసమైనా ఆరోగ్యంగా జీవించాలన్నారు. సమావేశంలో పోలీసు కమిషనర్ గౌస్ ఆ లం చేతుల మీదుగా సుమారు 200 మంది మున్సిపల్ కార్మికులు, అంబులెన్స్ డ్రైవర్లు, పోలీసు సిబ్బందికి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. తల గాయాలు కుటుంబాలను, సమాజాన్ని ప్రభావితం చేసే గొప్ప సమస్య అని, ప్రతి ఒక్కరూ ట్రా ఫిక్ నియమాలు తప్పకుండా పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. రెనే హాస్పిటల్స్ అధినేత ప్రొఫెసర్ డా.బంగారి స్వామి మాట్లాడుతూ తన వైద్య వృత్తిలో చాలా వరకు ప్ర మాదాలు జాగ్రత్తులు పాటించకపోవడం వల్లనే జరిగాయన్నారు. వాహనం అనేది సుఖవంతమైన ప్రయాణానికి మాత్రమేనని, వేగవంతమైన ప్రయాణానికి కాదనే విషయం అందరూ తప్పకుండా గుర్తుంచుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో రెనె హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ ఇన్ఫర్టిలిటీ స్పెషలిస్టు డా.బంగారి రజనీ ప్రియదర్శిని, వన్ టౌన్ సిఐ కోటేశ్, టూ టౌన్ సిఐ సృజన్ రెడ్డి, త్రీ టౌన్ సిఐ జాన్ రెడ్డి, ట్రాఫిక్ సిఐ, రెనే హాస్పిటల్ మెడికల్ సూపరిండెంట్ డా.రవీంద్రాచారి, గుండె వైద్య నిపుణులు డా.దినకర్, సీనియర్ ఫిజీషియన్ డా.నిఖిల్ లక్ష్మణ్, తదితరులున్నారు.

ఫోకస్

# వ్యవసాయం

## వ్యవసాయ పర్యాటకానికి ఎన్నో సవాళ్లు!





ఇటీవల కాలంలో 'వ్యవసాయ పర్యాటకం' గురించిన చర్చ ఎక్కువగా వినిపిస్తున్నది. వ్యవసాయ రంగాన్ని పర్యాటక రంగంతో జతకలపడం ద్వారా స్థానికుల ఆదాయాన్ని పెంపొందించడాన్ని వ్యవసాయ పర్యాటకంగా పేర్కొంటున్నారు. ఇది రైతులకు ఎన్నో విధాల ఉపయోగపడుతుందనడంలో అనుమానం లేదు. అయితే, ఈ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తించి, పరిష్కరించకపోతే, ఆశించిన ఫలితాలు పొందడం సులభసాధ్యం కాదు. అత్యంత కీలకమైన సమస్యల్లో మొట్టమొదటిది సరైన అవగాహన లేకపోవడం. పర్యావరణ, సాంస్కృతిక, సాహస క్రీడలపై పర్యాటకుల్లో అవగాహన తక్కువగా ఉందనేది వాస్తవం. పర్యాటనలు అంటే తీర్థయాత్రలు లేదా చారిత్రక ప్రదేశాలను తిలకించడం మాత్రమే అనే అభిప్రాయం మన దేశంలో వేళ్లూనుకుంది. దీనిని నుంచి ప్రజలు బయటపడాలంటే, ఇతరత్రా పర్యాటక అంశాలపై వారికి అవగాహన కలిగించాలి. అంతేగాక, 'వ్యవసాయ పర్యటకం' దేశంలోని కొన్ని రాష్ట్రాల్లోని అతి కొన్ని ప్రాంతాలకు పరిమితం కావడంతో రోజురోజుకూ పోటీ పెరుగుతున్నది. ఈ పోటీకి అనుగుణంగా పర్యాటకు సంఖ్య పెరగడం లేదు. కాబట్టి, పర్యాటకులను ఆకర్షించడానికి ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు చొరవ చూపాలి. ప్రయాణ సౌకర్యాలు సక్రమంగా లేకపోవడం కూడా 'వ్యవసాయ పర్యాటకం' ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒకటి. చాలా ప్రాంతాలకు సరైన రోడ్లు లేదా వాహనాల సదుపాయం లేదు. ఆరోగ్య సంరక్షణకు అవసరమైన ఏర్పాట్లు మృగ్యం. దీనితో పర్యాటకులు ధైర్యం చేసి అలాంటి ప్రాంతాలకు వెళ్లలేకపోతున్నారు. ఆర్థిక పరిమితులు, వసతి, శిక్షణ, మార్కెటింగ్ ఖర్చులను భరించే శక్తి ఎక్కువ మంది రైతులకు లేదు. దీనితో 'వ్యవసాయ పర్యాటకం' ఆలోచన నీరుగారిపోతున్నది. ఉదాహరణకు, ఉత్తరాఖండ్‌లోని వ్యవసాయపర్యాటక ప్రదేశాలు వర్షాకాలంలో అందుబాటులో ఉండవు. ఇలాంటి సమస్యలు చాలా ప్రాంతాల్లో గమనించవచ్చు. కొన్ని సందర్భాల్లో 'వ్యవసాయ పర్యాటకం' కారణంగా వ్యవసాయ భూములు వాణిజ్య కార్యకలాపాలకు కేంద్రాలుగా మారే ప్రమాదం ఉంది. టూరిస్ట్ హోమ్‌స్టేలు, రిసార్ట్‌లు, రెస్టారెంట్ల ద్వారా పర్యాటకం నుండి వచ్చే ఆదాయం మరింత లాభదాయకంగా ఉంటుంది అంతేగాక, అది తక్షణ నగదును అందిస్తుంది. కాబట్టి రైతులు పంట ఉత్పత్తి కంటే పర్యాటకానికి ప్రాధాన్యత ఇస్తారు. కాగా, పంజాబ్, హర్యానా, యుపి, ఎంపి వంటి ఉత్తరాది రాష్ట్రాలలో గోధుమ, వరి ఆధిపత్యంలో ఉన్న ఏక పంట వ్యవసాయ పర్యాటకాన్ని నిరుత్సాహపరుస్తుంది. ఎందుకంటే పర్యాటకులు ఉద్యానవన సాగు, పూల పెంపకం, పశువుల పెంపకం వంటి ఇంటరాక్టివ్ వ్యవసాయ కార్యకలాపాలను ఇష్టపడతారు. వ్యవసాయ పర్యాటక ఆదాయం సీజన్లను బట్టి హెచ్చుతగ్గులకు లోనుకావడం కూడా రైతులను నిరుత్సాహపరుస్తుంది. సహజంగా పర్యాటకల తాకిడి పంట కోతల సమయంలో గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. కానీ ఆఫ్‌సీజన్లలో లేదా కఠినమైన వాతావరణ సంఘటనల కారణంగా గణనీయంగా తగ్గుతుంది. ఈ హెచ్చుతగ్గుల ఆదాయం సహజంగానే రైతులను ఆకర్షించదు. ఉదాహరణకు, రాజస్థాన్‌లోని ఎడారి పొలాలు వేడి కారణంగా తక్కువ వేసవి పర్యాటకాన్ని ఎదుర్కొంటున్నాయి. అయితే, అస్సాంలోని టీ ఎస్టేట్‌లలో వరదలు, రోడ్డు అడ్డంకుల కారణంగా వర్షాకాలంలో పర్యాటకుల సంఖ్య భారీగా తగ్గుతుంది. ఈ రంగాన్ని భద్రతా సమస్యలు కూడా వేధిస్తున్నాయి. మారుమూల వ్యవసాయపర్యాటక ప్రదేశాలు దొంగతనం, అడవి జంతువులు, పరిమిత అత్యవసర సేవల వంటి ప్రమాదాలను ఎదుర్కొంటున్నాయి. ఉదాహరణకు, కర్ణాటకలో అడవి ఏనుగుల నుంచి సమస్యలు పొంచి ఉంటాయి. ఈ సమస్యలను గుర్తించి, పరిష్కరిస్తే 'వ్యవసాయ పర్యాటకం' అన్ని విధాలా అభివృద్ధి చెందుతుంది.

# హిమానీనదాలతో మానవాళికి రక్షణ



ప్రపంచ నీటి టవర్స్‌గా గ్లేసియర్లు సేవలు అందిస్తున్నాయి. భూగోళ సంరక్షణలో ప్రధాన భూమికను నిర్వహిస్తున్నాయి హిమానీనదాలు లేదా గ్లేసియర్లు. భూమాత భవిష్యత్తు సంరక్షకులు హిమానీనదాలు. ప్రకృతి ఏర్పాటు చేసిన మంచు కొండలు గ్లేసియర్స్. గ్లేసియర్స్ నెమ్మదిగా కరుగుతూ సహజ మంచి నీటి ఊటలుగా నదుల రూపం ప్రవహిస్తూ ఉంటాయి. భూమి పర్యావరణ వ్యవస్థల పరిరక్షణకు హిమానీనదాలు గొడుగు పడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2,75,000 గ్లేసియర్స్ ఉన్నాయని, ఇవి దాదాపు 2 బిలియన్ల ప్రజలకు తాగునీరు, జీవనోపాధులకు వనరులుగా సేవలు అందిస్తున్నాయి. 2050 నాటికి దాదాపు 6,200 హిమానీనదాలు కరిగి అదృశ్యం అవుతాయని అంచనా వేస్తున్నారు. స్విస్‌లో గ్లేసియర్ల ఘనపరిమాణాలు 10 శాతం, తజికిస్థాన్‌లో 33 శాతం, ట్రోపికల్ అండెస్‌లో 97 శాతం వరకు తగ్గుతాయని తేల్చడం ప్రమాద హెచ్చరికగా తీసుకోవాలి. ధరణి ఆరోగ్య సంరక్షణతో పాటు మంచి నీటి సహజ వనరులుగా, వ్యవసాయానికి నీటి వనరులుగా, పరిశ్రమల నీటి అవసరాలను తీర్చే మంచు కొండలుగా, హైడ్రో పవర్ జనరేషన్ వనరులుగా, జీవనోపాధులను కల్పించే సహజవనరులుగా హిమానీనదాలు సేవలు అందిస్తున్నాయి. దాదాపు 2 బిలియన్ల ప్రపంచ మానవాళి గొంతు తడుపుతున్న గ్లేసియర్స్ సముద్ర మట్టాలను నియంత్రిస్తూ జీవవైవిధ్యాలను నిశ్శబ్దంగా కాపాడుతున్నాయి. ఇంతటి విశిష్టత కలిగిన హిమానీనదాలు మానవ ప్రమేయంతో క్రమంగా, వేగంగా కరుగుతుండటంతో భూగోళ సమతుల్యత దెబ్బతింటూ మానవాళితో పాటు జీవకోటికి కూడా ప్రమాదకరంగా మారుతున్నాయి. భూతాపం వల్ల వాతావరణ ఉష్ణోగ్రతలు పెరగడంతో గ్లేసియర్లు వేగంగా కరుగుతూ నీటి కొరత లేదా నీటి ఒత్తిడి పెరగటం, కరువుకాటకాలు రావటం, సముద్ర మట్టాలు విపరీతంగా పెరగటం, వరదలు పెరగడం, కొండచరియలు విరిగి పడడం, పర్యావరణ వ్యవస్థలు దెబ్బతినడం, మానవ జీవనోపాధులు తగ్గడం, ప్రపంచ ఆర్థికాభివృద్ధి మందగించడం చూస్తున్నాం. దీనికి విరుగుడుగా తక్షణ చర్యగా కార్బన్ ఉద్గారాలను తగ్గించడంతో ప్రాధాన్యతాక్రమంలో జరగాలి. గ్లేసియర్స్ వేగంగా కరగడాన్ని భవిష్యత్తు అతి పెద్ద రిస్క్ గల అంశంగా భావించిన ఐరాస తన సర్వసభ్య సమావేశంలో తీసుకున్న తీర్మానం ప్రకారం 2025 ఏడాదిని అంతర్జాతీయ హిమానీనదాల సంరక్షణ సంవత్సరం లేదా ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ గ్లేసియర్స్ ప్రిజర్వేషన్‌గా పాటించాలని నిర్ణయించడం సముచితంగా ఉన్నది. రాబోయే తరాలకు ఆరోగ్యకర జీవవైవిధ్యాలను అందించడానికి గ్లేసియర్లను సంరక్షించటా నేడు విధిగా జరగాలి. దీనికి తోడుగా ఈ ఏడాది నుంచి ప్రతి ఏట 21 మార్చిన ప్రపంచ హిమానీనదాల లేదా గ్లేసియర్స్ దినోత్సవంను నిర్వహించుకుంటూ, గ్లేసియర్స్ పరిరక్షణ అవశ్యకతను ప్రజలకు వివరించడం జరుగుతున్నది. 1900 నుంచి నేటి వరకు సముద్ర జల మట్టాలు 20 సెమీ వరకు పెరగడం ఒక ప్రమాద హెచ్చరికగా తీసుకోవాలి. హిమానీనదాలు నేడు కరుగుతున్న వేగం ఇలాగే కొనసాగితే 2050 నాటికి 33 శాతం వరకు ప్రస్తుత గ్లేసియర్లు కరిగి తరగ వచ్చని అంచనా వేస్తున్నారు.

అతి ప్రధాన సహజ వనరులుగా అమూల్య సేవలను అందిస్తున్న శీతల మంచు కొండలు లేదా హిమానీనదాలు వాతావరణ ప్రతికూల మార్పులు, హరితగృహ వాయు ఉద్గారాలు పెరగడం, భూతాపం పెరగడం లాంటి కారణాలతో గ్లేసియర్స్ వేగంగా కరిగి తరుగుతూ పర్యావరణ సంక్షోభానికి ఆజ్యం పోస్తున్నాయి. గ్లేసియర్లు వేగంగా కరిగిపోవడాన్ని అరికట్టడానికి అంతర్జాతీయ పౌర సమాజం మానవ హారం పట్టాలి. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకొని 22 మార్చిన నిర్వహించుకునే ప్రపంచ నీటి దినోత్సవం2025 నినాదంగా హిమానీనదాల పరిరక్షణ అనబడే ఇతివృత్తాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. ప్రపంచంలో అంటార్కిటికా సెల్లర్ గ్లేసియర్, భారత్‌లో సియాచిన్ గ్లేసియర్‌లు అత్యంత పెద్దవిగా గుర్తించారు.

యునెస్కో నిర్ణయం ప్రకారం గ్లేసియర్లను పునర్ ప్రతిష్ఠాపన చేయడం, వాటి సహజ పర్యావరణాన్ని కాపాడడం, శాస్త్రీయ పరిశోధనలు వేగవంతం చేయడం, అంతర్జాతీయ సహకారాలను ఏకీకృతం చేయడం, ప్రాంతీయ పౌర సమాజాన్ని జాగ్రుత పరచడం, ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడం లాంటి చర్యలు సత్వరమే తీసుకోవాలని ఆశిద్దాం. గ్లేసియర్లు మంచి నీటి సహజ వనరులని, భూమి భవిష్యత్తు సంరక్షకులని తెలుసుకొని పలు రకాల చర్యలు తీసుకుంటూ హిమానీనదాల సహజత్వాన్ని కాపాడుకుందాం, భవిష్యత్తు తరాలకు మంచి సహజ నీటిని బహుమతిగా అందిద్దాం.

పర్యావరణం

## అటవీ సంరక్షణ మన కర్తవ్యం



ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 1.6 బిలియన్ల గిరిజనులు తమ ఆహారం, ఆవాసం, శక్తి, ఔషధాలు, ఆదాయ వనరులు, జీవన భృతులకు అడ్మిషన్లు మాతఒడిన జీవితాలను గడుపుతున్నారు. దాదాపు 80 శాతం జీవవైవిధ్య పరిరక్షణ అడవులతోనే సుసాధ్యం అవుతున్నది. అడవులతో మానవాళికి కలప, వంట చెరుకు, పేపర్, ఫర్నీచర్, ఔషధాలు, జిగురు, ఆహారం, పూలు/పండ్లు/కాయలు/మొగ్గలు, శుద్ధ జలం, పశుగ్రాసం, పీచు పదార్థాలు, నూనెలు లాంటి అనేక ఉత్పత్తులు ఉచితంగా, సమృద్ధిగా అందుబాటులో ఉంటున్నాయి. అడవుల పరోక్ష ప్రయోజనాల్లో వానలు కురవడం, భూతాపం అదుపులో ఉండడం, కరువు నివారణ, జీవవైవిధ్యం సంరక్షించబడడం, నేల నాణ్యత పెరగడం, నేల కోత అరికట్టబడడం, వరదలను అదుపు చేయడం, గాలి శుద్ధి చేయబడడం, కార్బన్‌ను తొలగించడం, వాతావరణ సానుకూల మార్పులు జరగడం లాంటి పలు అంశాలు ఉన్నాయి. స్వార్థపూరిత, అనాలోచిత, అజ్ఞాన మానవ ప్రమేయాలతో అడవుల విస్తీర్ణం క్రమంగా తరుగుతోంది. ప్రతి ఏట దాదాపు 13 హెక్టార్ల అడవులు కోతకు గురి అవుతున్నాయి. భూగోళదళంపై దాదాపు 30 శాతం అటవీ విస్తీర్ణం ఉండాలి. పోడు సాగు, కలప స్మగ్లింగ్ లాంటివి కూడా అటవీ విస్తీర్ణం తగ్గడానికి కారణం అవుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నేటికి దాదాపు సగానికి పైగా అడవులను ప్రపంచం కోల్పోవడంతో నేడు విపరీతమైన ప్రతికూల వాతావరణ మార్పులను చవిచూస్తున్నాం. భూమాత ఊపిరితిత్తులు, కార్బన్ శోషణ కేంద్రాలుగా అమూల్య సేవలను అందిస్తున్న అడవుల పరిరక్షణ ఉద్యమాలకు ఊపిరి పోయడానికి ఐరాస ప్రతి ఏట 21 మార్చిన అంతర్జాతీయ అడవుల దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఫారెస్ట్రీ)ని పాటించారని 2013లో నిర్ణయం తీసుకోవడం జరిగింది. 2025 అంతర్జాతీయ అడవుల దినోత్సవ ఇతివృత్తంగా అడవులు ఆహారం (ఫారెస్ట్ అండ్ ఫుడ్) అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. అడవుల నరికివేత ఫలితంగా క్రూర జంతువులు, కోతులు, పులులు, ఏనుగులు, ఎలుగుబంట్లు లాంటివని మానవ ఆవాసాల్లో సంచరించడం అపారమైన పంట ప్రాణ నష్టాలు చేయడం చూస్తున్నాం. అడవుల సంరక్షణకు ప్రతి ఏట మొక్కలు నాటడం, నరికి అడవులకు అనేక రెట్లు వనాలు పెంచడం, కార్చిచ్చులను అదుపు చేయడం, అటవీ సంరక్షణ చట్టాలకు పదును పెట్టడం, మానవ ఆవాసాల్లో హరిత వనాలు పెంచడం, పోడు వ్యవసాయాన్ని తగ్గించడం, వన్య ప్రాణులను కాపాడడం, అడవులను పర్యాటక స్థలాలుగా మార్చడం, అటవీ ఉత్పత్తులను పెంచుకోవడం, పేపర్/కలప వినియోగాలను తగ్గించడం లాంటి చర్యలు దోహదపడతాయి. మనిషి లేకుండా అడవులు ఉండగలవని, అడవులు లేకుండా మానవ (సకల జీవకోటి) జీవితాలు అసాధ్యమని తెలుసుకోవాలి. అడవులు మనం పీల్చే గాలి ప్రసాదమని, హరిత క్షేత్రాలు మన జీవితాలతో విడదీయరాని బంధాన్ని వెనవేసుకున్నాయని తెలుసుకొని అడవులను రక్షించుకుందాం, మొక్కలను నాటి పోషించుకుందాం, పచ్చని కాపురాల తోరణాలతో సంతోషంగా జీవితాలను గడుపుదాం.

## విద్యారంగానికి నిధులు కేటాయించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం : మచ్చ రమేష్




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరించడాన్ని నిరసిస్తూ వెంటనే బడ్జెట్ సవరించి విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్‌ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కమాన్ చౌరస్తా వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్, జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్‌లు మాట్లాడుతూ గత బడ్జెట్‌కు ఈ బడ్జెట్‌కు కేవలం 0.2 శాతం నిధులు కేవలం 1816 కోట్లు మాత్రమే పెంచారన్నారు. ఈ నిధులు విద్యారంగ అభివృద్ధికి ఏ మేరకు సరిపోవన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో విద్యకు 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని, కానీ రెండో బడ్జెట్ కేటాయింపులో ఆ హామీ మేరకు నిధులు కేటాయించకపోవడం సరికాదన్నారు. బడ్జెట్ ప్రసంగంలో ఉన్నత విద్యాబలోపేతం, ప్రభుత్వ యూనివర్సిటీల అభివృద్ధి ఊసేలేదన్నారు. మంత్రి లేని విద్యాశాఖ పాలనలో లోపం స్పష్టంగా కనబడుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రి నియమించకపోవడం పట్ల ఎఐఎస్‌ఎఫ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామన్నారు. వెంటనే విద్యాశాఖకు మంత్రిని నియమించి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్ తదితరులున్నారు.

## పేద బడుగు బలహీన వర్గాలకు బడ్జెట్‌లో మరింత ప్రాధాన్యం : మేకల రవి

**ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి :** పేద, బడుగు, బలహీన వర్గాలకు బడ్జెట్‌లో మరింత ప్రాధాన్యం ఇవ్వాలని, గుడిసె వాసులకు పట్టాలిచ్చి పక్క గృహాలు నిర్మించి ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. వరంగల్ పట్టణంలోని గొర్రెకుంట పీసరి కొమురయ్య నగర్‌లో సిపిఐ శాఖ మహాసభ గురువారం సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మేకల రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొంతమేరకు పేదలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు కనబడుతున్న, మరింత బడ్జెట్‌ను బిసి దళిత గిరిజన మైనారిటీ వర్గాలకు కేటాయించాల్సిన అవసరమున్నదన్నారు. అలాగే విద్య, వైద్య రంగాలను బలోపేతం చేసేందుకు మరిన్ని నిధులు కేటాయించాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మరింతగా మెరుగు పరచాల్సిన అవకాశం ఉందన్నారు. భూమిలేని నిరుపేదలు భూపోరాటాల్లో పాల్గొని గుడిసెలు వేసుకొని నివసిస్తున్న వారందరికీ పట్టాలు ఇచ్చి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు, రైతులకు మేలు జరిగే పద్ధతుల్లో బడ్జెట్ ఉండాలన్నారు. రానున్న కేంద్ర బడ్జెట్లో అన్ని రంగాల్లో వరంగల్ జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ కోసం అధిక నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా పట్ల మోదీ సర్కార్ సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాష్ మియా, పనాస ప్రసాద్, గీసుకొండ మండల సిపిఐ కార్యదర్శి తోట చంద్రకళ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె భద్రి, నాయకులు మద్దెల శ్రీలత, వనమ్మ, వేణు, కుమార్ పాల్గొన్నారు. అనంతరం 11 మందితో నూతన శాఖ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.




# అర్హులైన 2000 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

**స్థానిక శాసనసభ్యులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి : గోదా శ్రీరాములు**



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్:** అర్హులైన 2000 మందికి ఇంటి పట్టాలు ఇవ్వాలని, స్థానిక శాసనసభ్యులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భువనగిరి పట్టణ సమితి సమావేశం చింతల మల్లేష్ అధ్యక్షతన సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడుతూ భువనగిరి పట్టణంలో నిరుపేదలు అర్హులైన వారు గత సంవత్సరం నుండి ఇంటి నివేశన స్థలాలు ఇండ్లు కావాలని ఇల్లు మంజూరు చేయాలని ఆందోళన నిర్వహించారని తెలిపారు. భువనగిరి పట్టణానికి సమీపంలో ప్రభుత్వ భూములు ఖాళీగా ఉన్నాయని ఇట్టి భూములన్నింటినీ సర్వే చేయించి అర్హులైన జాబితాలోని వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 1వ తేదీన స్థానిక శాసనసభ్యులు అనిల్ కుమార్ రెడ్డిని సిపిఐ జిల్లా కార్యాలయానికి ఆహ్వానించాం ఆ సందర్భంగా శాసనసభ్యులు అనిల్ కుమార్ రెడ్డి నివాసాలు లేని లబ్ధిదారులందరితో ముఖాముఖి విషయాలు తెలుసుకున్నారని చెప్పారు. మార్చి నెలాఖరు వరకు సర్వే చేయించి అర్హులైన వారందరికీ పట్టాలు ఇప్పించేదాన్ని కొరకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని అన్నారు. ప్రభుత్వంలో ఉన్నారు. కాబట్టి శాసనసభ్యులు వందలాది మందికి పట్టాలు ఇప్పించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. భువనగిరి పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించుటకు 100 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిధులు మంజూరు కోసం భువనగిరి పురపాలక కార్యాలయం ముందు సిపిఐ పట్టణ సమితి కామ్రేడ్ ఏశాల అశోక్ పుట్ట రమేష్ గారల నాయకత్వంలో నిరాహార దీక్షల ద్వారా నిరసనలు తెలియజేశారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, సిపిఐ భువనగిరి పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి లక్ష్మయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వస్తువుల అభిలాష్, పట్టణ కార్యవర్గ సభ్యులు చింతల పెంటయ్య, చొప్పరి సత్తయ్య, బద్దం వెంకటరెడ్డి, గుండెబోయిన స్వామి, ఏదునూరు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

ఎఐవైఎఫ్ రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షుడు, డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ




**ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి :** భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 94వ వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్)రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రికను వరంగల్‌లోని ఎల్బీ నగర్ ఆయనే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సయ్యద్‌వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ భగత్ సింగ్ జీవితం భారత దేశ యువతకు స్ఫూర్తిదాయకమని, అటువంటి మహనీయుని త్యాగాలను నేటి సమాజానికి తెలపాల్సిన బాధ్యత పాలకులదేనన్నారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించాలన్నారు. ప్రజల ఐక్యతను చీల్చే మతోన్మాద రాజకీయాలు నేడు దేశంలో విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని, స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోనైనా, నేటి కాలంలోనైనా అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చి, దోపిడీదారులకు ఉపకరించే, దేశ ద్రోహ కర్తవ్యాన్నే మతోన్మాద శక్తులు నెరవేరుస్తున్నాయని ధ్వజమెత్తారు. దేశ స్వాతంత్ర్య సముపార్జన ధ్యేయంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన భగత్ సింగ్ స్వాతంత్ర్య అనంతరం కుల, మతాలకు అతీతంగా ధనిక, పేద తారతమ్యాలు లేని, అవినీతి రహిత సమసమాజ స్థాపన కలలు కన్నాడన్నారు. మతోన్మాద ముక్త భారతం సాధించడానికి భగత్ ఆలోచనలు, ఆయన చూపిన కార్యాచరణ, మనకు తరగని స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. సామాజిక, న్యాయం, లౌకిక వాదన పరిరక్షణ, శాస్త్రీయ సోషలిజం, తీవ్రవాదానికి వ్యతిరేకంగా శాంతి స్థాపన కోసం, అశ్లీల సాహిత్యం, అశ్లీల సినిమాల నిషేధం కోసం, దేశాన్ని చీల్చడానికి కుట్రలు చేసే విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా, దేశ ఐక్యత, సమైక్యత కోసం (ఎఐవైఎఫ్) కృషిచేస్తుందన్నారు. ఇంతటి పోరాట చరిత్ర కలిగిన (ఎఐవైఎఫ్) ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ 94వ వర్ధంతిని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా క్రీడోత్సవాలు, డ్రగ్స్, మత్తు పదార్థాల వ్యతిరేక కాంపెయిన్, యువకవి గాయకుల సమ్మేళనం, రక్తదాన శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు,వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు, సదస్సులు, ర్యాలీలు, కాగడాల ప్రదర్శన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

### సింగరేణిలో గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

## ఎఐటియుసి ఆందోళనలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి కొత్తగూడెం రీజియన్ పరిధిలోని వికె 7ఓసి, సత్తుపల్లి ఓసిలలో బొగ్గు తీసే పనిని కాంట్రాక్టుకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముందు ఎఐటియుసి ఆధ్వర్యంలో ఒక రోజు నిరాహార దీక్షలను సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య దీక్షల్లో పాల్గొన్న వారికి పూలమాలలు వేసి ప్రారంభించారు. అనంతరం సీతారామయ్య మాట్లాడుతూ 2015లో కేంద్ర ప్రభుత్వం ఎంఎండిఆర్ చట్టంలో మార్పులు చేయడం వల్ల దేశంలో ఉన్న బొగ్గు బ్లాక్‌లను వేలం ద్వారా ప్రైవేటు వారికి ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకోవడం వల్ల సింగరేణిలో కొత్త గనులు రావడం లేదని ఆయన అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి చెందిన రెండు బొగ్గు గనులను సంస్థకు ఇవ్వకుండా సింగరేణి ని వేలంలో పాల్గొననీయకుండ వారి అనుయాయులకు ఇచ్చిందని ఆయన ఆరోపించారు. ఇట్టి గనులను దక్కించుకున్న వారు వాటిని ప్రారంభించలేదన్నారు, ఎందుకంటే ఎల్లందు ఏరియా ట్రైబల్ ఏరియా 1/70 చట్టం ఉందని దాని ప్రకారం ప్రభుత్వానికే ఆ గని దక్కుతుందని ఆయన అన్నారు. వికె 7ఓసి, జెకె ఒసిలో బొగ్గు తీసే పనిని యాజమా న్యం కాంట్రాక్టుకు ఇవ్వడాన్ని ఎఐటియుసి తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. యాజమా న్యం, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బొగ్గు తీసే పనిని కాంట్రాక్టుకు కాకుండా సింగరేణి ఉద్యోగులే తీసే విధంగా చర్యలు తీసుకోవాలని లేకుంటే సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, అవసరమైతే సమ్మెకు పిలుపునిస్తామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు వంగ వెంకట్, మల్లికార్జున్, రంగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో విద్యా రంగానికి మొండి చేయి

ఎఐఎస్‌ఎఫ్ జగిత్యాల జిల్లా కార్యదర్శి అక్రమాలిక్




**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** విద్యారంగ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విద్యారంగానికి కేటాయించిన నిధులను చూస్తే అర్థమవుతుందని ఇది ముమ్మాటికి విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వమేనని ఎఐఎస్‌ఎఫ్ జగిత్యాల జిల్లా కార్యదర్శి మహమ్మద్ అక్రమ్ మాలిక్ విమర్శించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం ముందు తలదించుకుని అక్రమాలిక్ ఆధ్వర్యంలో నాయకులు నిరస న వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అక్రమాలిక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7.57 శాతం నిధులు కేటాయించడంలోనే విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తు శుద్ధి ఉందో తెలిసిందన్నారు. ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో డొల్లతనం కనిపిస్తుందనీ చెబుతూ కనీసం విద్యారంగానికి కేటాయించాల్సిన మినిమం బడ్జెట్ కూడా కేటాయించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రా ష్ట్రంలో ఎన్నికల మేనిఫెస్టోలో కనీసం 15శాతం నిధులు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ గత సంవత్సరం ఈ సంవత్సరానికి 0.2 శాతం మాత్రమే కేటాయించడం దారుణమన్నా రు. రాష్ట్రంలో ఉన్నత విశ్వవిద్యాలయాలకు తక్కువ నిధులు కేటాయించడం తగదన్నా రు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30 శాతం అధిక నిధులు కేటాయించి విద్యారంగా అభివృద్ధికి, పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని అక్రమాలిక్ కోరారు. లేనియెడల ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామనిఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మంద రాకేష్, పట్టణ అధ్యక్షులు మహేష్, రూరల్ మండల అధ్యక్షులు అంకతి ప్రణయ్, పట్టణ నాయకులు సాయి చరణ్, జిల్లా సమితి సభ్యులు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## 58 జిఒ ప్రకారం ఇళ్ళ పట్టాలు ఇవ్వాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ ప్రతినిధి :** నిషాన్‌ఘాట్, వీకర్‌సెక్షన్ కాలనీలో నివసిస్తున్న పేదలకు జీఓ నెం 58 ప్రకారం ఇంటి పట్టాలు ఇవ్వాలని సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న కాలనీవాసుల నిరాహార దీక్షలో మద్దతుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న కాలనీ వాసులకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీలో మౌళిక వసతులు ఏర్పాటు చేసి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి అమీనా ఖాన్, బికేఎంయు జిల్లా అధ్యక్షులు ఖండాల గణేష్, దళిత కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు రాందాస్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## ధైర్యంగా పరీక్షలు రాయండి

ఐటిడిఎ పిఒ రాహుల్



**ప్రజాపక్షం/భద్రాచలం :** విద్యార్థులు ఎలాంటి భయాలు పెట్టుకోకుండా పదో తరగతి పరీక్షలు ధైర్యంగా రాయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సూచించారు. గురువారం లక్ష్మీదేవిపల్లి మండలం సర్వారం ప్రభుత్వ గిరిజన ఆశ్రమపాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు విద్యార్థుల జీవితాలకు ఓ మైలురాయని, ఈ రాయిని దాటిన ప్రతీ ఒక్కరూ ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు. పరీక్ష రాసేటప్పుడు సమయాన్ని గమనిస్తూ ప్రణాళికా బద్ధంగా రాయాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, ఏటిడిఒ చంద్రమోహన్, క్రీడల అధికారి గోపాలరావు, హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# 25 లక్షల ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణమే లక్ష్యం

మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/పెనుబల్లి :** రాష్ట్రంలో 25 లక్షల ఇండ్లు నిర్మించడమే లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు ఉగాది పర్వదినం నుంచి రాష్ట్రంలోని ప్రతి రేషన్ కార్డు మహిళలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. గురువారం పెనుబల్లి మండలం రామచంద్రాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ గృహ సముదాయానికి మంత్రి శంకుస్థాపన చేశారు. పెనుబల్లి మండలం రామచంద్రాపురం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడంతో ఈ గ్రామంలో 28 ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. గ్రామంలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రికి రామచంద్రాపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు షేక్ కరీముల్లా ఆధ్వర్యంలో గ్రామస్థులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పేదల కోసం ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన ఇండ్లు తప్పా బిఆర్‌ఎస్ పది సంవత్సరాల కాలంలో పేదలకు ఇళ్ళు ఇవ్వలేదని, నేడు మరలా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్రంలో వచ్చే 3 సంవత్సరాల కాలంలో 25 లక్షల ఇండ్లు నిర్మించి అర్హులకు అందివ్వడమే తమ లక్ష్యం అన్నారు. చదువుకున్న యువత కోసం రాజీవ్ యువ వికాసం కింద చేయుతనిచ్చేందుకు రుణాల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని దశల వారీగా అమలు చేసుకుంటూ వస్తున్నామన్నారు. రాష్ట్ర రాబడి మొత్తం అప్పులు కట్టడానికి సరిపోతుందని, అప్పులకు వడ్డీ కట్టుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో పయనించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. రామచంద్రాపురం గ్రామానికి సీతారామ ప్రాజెక్టు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. అటవీ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా గ్రామంలో భూములు వివరాలు సేకరించి కలెక్టర్ ద్వారా పాస్ పుస్తకాలు అందజేయాలని ఆదేశించారు. రామచంద్రాపురం గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దాలని అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు. సభలో మంత్రి వెంట జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, టిజిఐడిసి చైర్మన్ మువ్వా విజయబాబు, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు వంకాయలపాటి వెంకటేశ్వరరావు, షేక్ కరీముల్లా, చీకటి రామారావు, పంది వెంకటేశ్వరరావు, చీకటి చిన్న నరసింహారావు, రాజబోయిన కోటేశ్వరరావు, కీసర శ్రీని వాసరెడ్డి, బుక్యా కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసులకు అండగా ఉంటాం

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఆదివాసులకు అండగా ఉంటామని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం అన్నారు. గురువారం మండల పరిధిలోని ఉల్వనూరు బంజర గ్రామ పంచాయితీ చిరతానిపాడుగుంపు సిపిఐ శాఖ మహాసభ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ అనాదిగా పోడు సాగు చేసుకుంటున్న పోడు సాగుదారులందరికీ పట్టాలు అందించి రైతు భరోసా అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబవశివరావు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయితీలో సిపిఐకు ప్రాతినిత్యం వచ్చే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మాడే చుక్కారావ్, సహాయ కార్యదర్శిగా సురేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఉప్పు శెట్టి రాహుల్, నాయకులు ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, వేములపల్లి శ్రీను, కొంగర అప్పారావు, అమృతరావు, బాలాజీ, రేగు కృష్ణ, బాలు, స్వర్ణలత, రమణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ప్రైవేటీకరణ ఆలోచన తగదు



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సింగరేణిని ప్రైవేటీకరించాలని కేంద్రం ఆలోచన విరమించుకోవాలని ఎఐటియుసి నాయకులు కోరారు. గురువారం ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలపై కొత్తగూడెం హెడ్ ఆఫీస్ నందు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఎఐటియుసి కేంద్ర కమిటీ సభ్యులు వంగ వెంకట్ మాట్లాడుతూ పివి ఓసి, జివిఆర్ ఓసి 3 ప్రైవేటీకరణ చేయాలనుకునే కేంద్ర ప్రభుత్వం ఆలోచన సరైనది కాదన్నారు. కార్మికుల బాగోగులు చూడవలసిన యాజమాన్యం కార్పొరేట్ బడా బాబుల కోసం ఆలోచిస్తుందని, కార్మికుల హక్కులను కాలరాయాలని అవలంబిస్తున్న పద్ధతిని కార్మిక లోకం తిప్పి కొట్టాలన్నారు. సిఎంఒ, సిఎస్ఒ పోస్టులను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయాలనుకోవడం విరమించుకోవాలన్నారు. సింగరేణికి రావాల్సిన 35 వేల కోట్లు తక్షణమే విడుదల చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో వట్టి కొండ మల్లికార్జున్, వీరస్వామి, రమణమూర్తి, సముద్రాల సుధాకర్, గట్టయ్య, రాములు, మధు, ప్రసాద్, శ్రీనివాస్, నరసింహారావు, కిషోర్, భరణి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఖయ్యూం, రసూల్ రణధీర్, వినయ్, అజిత్, సృజన్, తదితరులు పాల్గొన్నారు.

## పేదోళ్లకు కష్టం వస్తే గుర్తొచ్చేది ఎర్రజెండానే : సారయ్య




**ప్రజాపక్షం/ఇల్లందు :** భూమి, ఆకాశం ఉన్నంతవరకు కమ్యూనిజం ఉంటుందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.సారయ్య పేర్కొన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం ఏర్పాటు చేసిన సభలలో సిపిఐ పతాకాన్ని ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కార్మికులకు, పేదవారికి కష్టం వస్తే గుర్తొచ్చేది ఎర్రజెండానే అన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచిన, నిత్యావసర సరుకులు, గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు పెరిగినా ఏ ప్రభుత్వమైనా సరే సామాన్య, మధ్యతరగతి ప్రజలకు భారం చేకూర్చే చట్టాలను గాని, పథకాలు గాని అమలుచేస్తే వాటికి వ్యతిరేకంగా పోరాడేది కమ్యూనిస్టు పార్టీయే అని గుర్తు చేశారు. అనంతరం మూడు వార్డుల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. 22వ వార్డు కార్యదర్శిగా రామకృష్ణ, 23వ వార్డు కార్యదర్శిగా కుమ్మరి రవీందర్, 24వ వార్డు కార్యదర్శిగా చెరకు సారయ్యలను ఎన్నుకున్నారు. మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, పట్టణ మండల కార్యదర్శులు బంధం నాగయ్య, ఉడత ఐలయ్య, శాఖ ఉపాధ్యక్ష, కార్యదర్శులు దాసరి రాజారాం, ఎం.డి.నజీర్ అహ్మద్, బాస శ్రీనివాస్, కౌన్సిలర్ కుమ్మరి రవిందర్, రామకృష్ణ, వడ్ల శ్రీనివాస్, దాట్ల శ్రీకాంత్, దేవరాజ్, రషీద్, కె. శివ, సోని, లక్ష్మి, లలిత పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులకు ఎఐటియుసి అండ

ప్రధాన కార్యదర్శి సింగమనేని ప్రసాద్

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఐటిసి పిఎస్‌పిడి పేపర్ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఏఐటియూసి అండగా ఉంటుందని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి సింగమనేని ప్రసాద్ అన్నారు. గురువారం కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉదయం కాగిత పరిశ్రమ ముందు ఎఐటియుసి ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిసి పిఎస్‌పిడిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు యజమాన్యం శ్రమకు తగ్గ ఫలితం ఇవ్వడం లేదన్నారు. శ్రమ దోపిడి చేస్తుందని పెరుగుతున్న ధరలకు అనుకూలంగా వేతనాలు పెంచకుండా, కాలయాపన చేస్తూ కొంత మంది స్వార్థపు రాజకీయ నాయకులు అండతో కాంట్రాక్ట్ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని ఆరోపించారు. భవిష్యత్తులో కాంట్రాక్ట్ కార్మికులకు అండగా ఉండి వారి న్యాయమైన సమస్యల పరిష్కారానికి దశల వారి ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.



## కాలిన పామాయిల్ తోటలను పరిశీలించిన అధికారులు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రఘునాథపాలెం మండల పరిధిలోని బావోజీతండా గ్రామానికి చెందిన బానోత్ శివలాల్, బానోత్ పార్వతిలకు చెందిన పామాయిల్ తోటలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో కాలిపోయాయి. గురువారం పామాయిల్ తోటలను ఉద్యానవన శాఖాధికారి నగేష్, వ్యవసాయ శాఖ ఎడిఎ కొంగర వెంకటేశ్వర్లు, ఎఒ ఉమామహేశ్వరరెడ్డి, ఎఇఒ శిరణ్మయి, ఆర్ఐ ప్రవీణ్, విద్యుత్ శాఖ ఎఇ సతీష్ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పామాయిల్ తోటలో ఉన్న ఎల్‌టి లైన్‌ను తొలగించాలని పలుమార్లు విద్యుత్ శాఖాధికారులను కోరామని అయిన పట్టించుకోలేదని రైతు శివలాల్ తెలిపారు. లైన్ మార్చకపోవడంతో ప్రమాదం వాటిల్లి చేతికొచ్చిన పంట కాలిపోయిందని రైతు వాపోయాడు. ప్రభుత్వం తరుపున కాలిపోయిన చెట్లకు నష్ట పరిహారం అందించాలని రైతులు కోరారు.



## భద్రాచలం జిల్లాలో టెన్త్ విద్యార్థులు 12,282 మంది

పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

విద్యార్థులకు కలెక్టర్ శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/భద్రాచలం :** పదో తరగతి పరీక్షలు నేటి నుండి ప్రారంభం కానున్నాయి. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల ఏర్పాట్లను ఆధికారులు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 73 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 12,282 మంది విద్యార్థ పరీక్షలు రాయనున్నారు. నేటి నుండి ప్రారంభమయ్యే పరీక్షలు ఏప్రిల్ 4వ తేది వరకు జరుగుతాయి. ఉదయం 9.30 నిమిషాలకు పరీక్ష ప్రారంభం కానుండగా 12.30 గం.లకు ముగియనుంది. విద్యార్థులను ఉదయం 8.30 గం. నుండే పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతించనుండగా ఐదు నిమిషాల పాటు ఆలస్యంగా వచ్చినప్పటికీ పరీక్షకు అనుమతించనున్నట్లు అధికారులు తెలిపారు. 73 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, ఐదుగురు ఫ్లైయింగ్ స్కాడ్‌లు, ఏడుగురు రూట్ ఆఫీసర్లు, 73 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 26 మది సెంటర్ కస్టోడియన్లు, 73 మంది సిట్టింగ్ స్కాడ్‌లు వీధులు నిర్వహించనున్నారు.




పరీక్ష అనంతరం సమాధాన పత్రాలు పోస్టాఫీసులకు చేరవేసేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రా ల వద్ద 144 సెక్షన్ అమల్లో పెట్టారు. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్‌టిసి బస్సులు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లో మంచినీటి సదుపాయంతో పాటు వేసవిని దృష్టిలో పెట్టుకుని అన్ని సదుపాయాలు కల్పిచామని అధికారులు తెలిపారు.

### కలెక్టర్ 'ఆల్ ది బెస్ట్'

పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి భయం లేకుండా పరీక్షలు రాసి చక్కటి ఫలితాలు తీసుకొచ్చి జిల్లాను అగ్రగామిగా నిలపాలని ఆయన ఆకాంక్షించారు.

### ఖమ్మం జిల్లాలో 97 పరీక్షా కేంద్రాలు

**ఖమ్మం అర్బన్ :** పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు ఖమ్మం జిల్లాలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 16,788 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షకు హాజరు కానుండగా వీరి కోసం 97 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 16,417మంది రెగ్యులర్ విద్యార్థులు, 371 మంది ప్రైవేటు, సప్లమెంటరీ విద్యార్థులు ఉన్నా రు. జిల్లాలో పరీక్షల నిర్వహణ కోసం 97 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్ మెంట్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, పోలీస్ సిబ్బందిని నియమించారు. 1,185 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. గతంలో జవాబు పత్రంగా ఒక జంట పేపర్ ఇచ్చి, అదనపు జవాబు పత్రాలు ఇచ్చేవారు. ఈసారి 24 పేపర్లతో కూడిన బుక్‌లెట్‌ను ఇవ్వనున్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు డిఇఒ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. సమస్యలు ఉంటే 8331851510 నెంబర్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

## ధాన్యం కొనుగోలుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

344 కేంద్రాల ఏర్పాటు

ఖమ్మంజిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రబీ మార్కెటింగ్ సీజన్‌లో ఖమ్మంజిల్లాలో రైతులు పండించిన ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి 2024–25 రబీ ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత అంచనా ప్రకారం రబీ సీజన్‌కు సంబంధించి 1.85 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం, 78వేల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం మొత్తం 2.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయబోతున్నామన్నారు. ధాన్యం రవాణా అంశంలో ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. జిల్లాలో మొత్తం344 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతులకు అనుకూలంగా కేంద్రాలు ఉండాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జి, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందజేయాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం ఏప్రిల్ రెండవ వారం నుంచి ధాన్యం కోతలు ప్రారంభమవుతాయని జిల్లాలో వరి పంట కోతల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకు వచ్చే షెడ్యూల్ పకడ్బందీగా తయారు చేయాలన్నారు. వ్యవసాయశాఖ విస్తరణ అధికారులు గ్రామాల వారీగా సన్న రకం ధాన్యం ధృవీకరణ చేసి కొనుగోలు కేంద్రాల మ్యాపింగ్ చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా సరిహద్దుల్లో అవసరమైన చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల నుంచి మనకు సన్నరకం ధాన్యం రాకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ప్యాడి క్లినర్, వేయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు మొదలగు వాటిని అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో విద్యుత్ సరఫరా, మౌలిక సౌకర్యాల కల్పన, వేసవి దృష్ట్యా చల్లని తాగు నీరు అందుబాటులో ఉండేలా చూడడంతో పాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీ సంచులు, అకాల వర్షాల నుంచి పంట కాపాడేందుకు వీలుగా టార్పాలిన్లు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. అవసరమైన హమాలీలు ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో డిఆర్‌డిఒ సన్యాసయ్య, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఎ అలీమ్, జిల్లా సహకార అధికారి గంగాధర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 'ఎక్స్‌ప్రెస్‌వే'ల వివరాలు తెలపండి

పార్లమెంటులో ఎంపి రామసహాయం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రధాన మంత్రి గతి శక్తి పథకం క్రింద దేశంలో ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో ఎక్స్‌ప్రెస్ వే జాతీయ రహదారుల నిర్మాణం పురోగతి వివరాలు, ప్రాజెక్టుల వేగిరానికి చేపడుతున్న చర్యల గురించి తెలపాలని ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి గురువారం లోక్‌సభలో ప్రశ్నించారు. దీనికి కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖల మంత్రి నితిన్ గడ్కరీ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. జాతీయ ఎక్స్‌ప్రెస్ వే లతో సహా జాతీయ రహదారు (ఎన్‌హెచ్)ల అభివృద్ధి, నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహిస్తుందన్నారు. యాక్సెస్ నియంత్రత హై స్పీడ్ కారిడార్లు (హెచ్‌ఎస్‌సి) సహా అన్ని జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులు పిఎంగతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ (ఎన్‌ఎంపి) సూత్రాలకు అనుగుణంగా ప్రణాళికలు చేయబడ్డాయన్నారు. 2,474 కిలో మీటర్ల పొడవులో జాతీయ హెచ్‌ఎస్‌సిలు, ఎక్స్‌ప్రెస్‌వే ల అమలు చేయబడ్డాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 779 కిలో మీటర్ల పొడువులో నాలుగు నేషనల్ హెచ్‌ఎస్‌సి ఎక్స్‌ప్రెస్ వే లు ఉన్నాయని కేంద్ర మంత్రి తెలిపారు. హైదరాబాద్ విశాఖపట్నం, సోలాపూర్ కర్నూల్ చెన్నై, ఇండోర్ హైదరాబాద్ మరియు నాగపూర్ విజయవాడ కారిడార్లకు సంబంధించి 415 కిలో మీటర్ల పొడవు నిర్మించబడినట్లు వివరించారు. ప్రాజెక్టులు త్వరిత గతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కేంద్ర మంత్రి తెలిపారు.

## అన్నివర్గాల సంక్షేమానికి పథకాలు



పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజా భవన్ నందు మణుగూరు మండలానికి చెందిన 39 మందికి గురువారం రూ. 39,04,524/ లక్షల విలువ గల కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని, రాష్ట్రంలోని పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందని అన్నారు. మీ కుటుంబంలో ఆడబిడ్డకు పెళ్లి చేసి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు ఆసరాగా ఉండేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేస్తుందని ఈ డబ్బులు జాగ్రత్తగా మీ కుటుంబ అవసరాలకు వాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మణుగూరు ఎమ్మార్వో రాఘవ రెడ్డి, మణుగూరు ఎంపీడీవో శ్రీనివాస రావు, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మహిళ మండల అధ్యక్షులు సౌజన్య, మణుగూరు శివాలయం గుడి చైర్మన్ కూచిపూడి బాబు తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

మణుగూరు ముత్యాలమ్మ నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని ముత్యాలమ్మ నగర్ లో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర ప్రారంభోత్సవానికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో రాఘవ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస రావు, ఎంఈఓ నాగజ్యోతి, సిడిపిఓ జయలక్ష్మి, ఐటిడిఏ డిఇ మధుకర్, ఏఈ ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు పిరినకి నవీన్, తరుణ్ రెడ్డి, సతీష్, శివ సైదులు, సౌజన్య, మణుగూరు శివాలయం గుడి చైర్మన్ కూచిపూడి బాబు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్లలో పర్యటించిన కమిషనర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య పర్యటించారు. గురువారం కార్పొరేషన్ పరిధిలోని 46వ డివిజన్‌లో కమిషనర్ అభిషేక్ అగస్త్య పర్యటించారు. డివిజన్‌లో కాలువల శుభ్రతను పరిశీలించారు. నీటి నిల్వలు లేకుండా మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. డివిజన్‌లో కార్పొరేటర్‌తో కలిసి పలు కాలువలను పరిశీలించారు. అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, కొత్తగా నిర్మించాల్సిన కాలువలు ప్రణాళిక ప్రకారంగా ఉండాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. కొత్త కాలువలు నిర్మించేటప్పుడు నీరు సులభంగా పారేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. డివిజన్‌లోని ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎనిమిదవ డివిజన్‌లో కమిషనర్ పర్యటించి అక్కడ వాక్‌వేను సందర్శించారు. మొక్కల నిర్వహణను పరిశీలించారు. వాక్‌వే పనిచేసే సమయాన్ని, మొక్కలకు నీరు పెట్టే సమయాన్ని సూపర్వైజర్‌ను అడిగి తెలుసుకున్నారు. వాక్‌వేలో పాడైన లైట్లను తక్షణమే రిపేర్ చేయించడంతో పాటు అవసరమైన చోట కొత్త లైట్లు ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. డివిజన్ పరిధిలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## లింగాపూర్ పైప్ లీకేజీ సమస్య పరిష్కారం

ప్రజాపక్షం ఎఫెక్ట్

'ప్రజాపక్షం' కథనానికి స్పందన



**ప్రజాపక్షం/కడం:**లింగాపూర్ గ్రామంలో మిషన్ భగీరథ పైప్ లీకేజీ గురించి మార్చి 18న ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు.బుధవారం రోజున తగిన చర్యలు తీసుకుని పైప్ లీకేజీ సమస్యను పూర్తిగా పరిష్కరించారు.గ్రామస్తులు సమస్య పరిష్కారానికి సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.పైప్ లీకేజీ వల్ల రోడ్డు పాడైపోవడం,నీటి వృధా వంటి సమస్యలు తలెత్తగా,ప్రజాపక్షం కథనం అనంతరం అధికారులు స్పందించడంతో గ్రామస్థులకు ఊరట లభించింది.

## అధికారులు సమన్వయంతో పనిచేయాలి

జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** అధికారులు నియోజకవర్గ అభివృద్ధి కొరకు సమన్వయంతో పనిచేయాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు అన్నారు. జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో విధులు నినర్వహజస్తున్న అన్ని శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహజంచారు. అభివృద్ధికి సంబందించిన శంకుస్థాపనలు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయరాదన్నారు. నియోజకవర్గ అభ్యున్నతికి అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని, అందుకు క్షేత్రస్థాయిలో పనులను ఎప్పటికప్పుడు పర్యావేక్షించాలని సూచించారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

## శనగల కొనుగోలు ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/బోథ్:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బోథ్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ బోథ్ లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చేతుల మీదుగా శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. రైతులు తమ పంటలను శుభ్రపరిచి ఆరపెట్టుకొని మార్కెట్ కు తీసుకురావాలని తెలిపారు.మద్దతు ధర 5650 గా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డిఎం ప్రవీణ్ రెడ్డి, పాక్స్ చైర్మన్ కదం ప్రశాంత్,పాక్స్ సిఈఓ గోలి స్వామి, ఏఎంసి చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, కార్యదర్శి, ఏఎంసి డైరెక్టర్‌లు,వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## 2వ రోజు రిలే నిరాహార దీక్షలు



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ ప్రతినిధి:** సిసిఐ సాధన కమిటి ఆధ్వర్యంలో గురువారం రెండవ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ దీక్షల్లో వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ సిసిఐ రిఓపెన్ చేయడం కోసం ఆదిలాబాద్ ఎంపి పార్లమెంట్‌లో మాట్లాడి బడ్జెట్‌ను తీసుకురావాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాలు తప్పవని కేంద్ర ప్రభుత్వంను హెచ్చరించారు.

## ప్యారా నగర్ డంపింగ్ యార్డు పనులను వెంటనే నిలిపి వేయాలి




**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ అటవీ ప్రాంతం, ప్యారానగర్ లో జీహెచ్ఎంసీ డంప్ యార్డు ఏర్పాటుకు నిర్ణయించిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి ఆరోపించారు. డంపింగ్ యార్డు కు వ్యతిరేకంగా నర్సాపూర్ పట్టణ జాతీయ రహదారిపై చేపట్టిన రిలే నిరాహారదీక్షలో పట్టణ టిఆర్ఎస్ నాయకులతో కలిసి భైటాయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పీల్చేగాలి తాగు నీరు కలుషితమై ప్రజలకు నానా కష్టాలు వస్తాయని ఆమె అన్నారు. ఈ ప్రాంతంలో జీవించలేని పరిస్థితులు నెలకొంటాయని అనేక రకమైన వ్యాధులు వ్యాపించి ప్రజలు అనారోగ్యాల గురవుతారని అవకాశముందని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండురోజుల క్రితం అసెంబ్లీసమావేశాలలో స్పీకర్ ముందు ఈఅంశాన్ని లేవనెత్తా నాని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు కల్లూరి హరి కృష్ణ, సత్యం గౌడ్, మర్రి మహేందర్ రెడ్డి, బారాసా పట్టణ అధ్యక్షులు పంబల్ల బిక్షపతి, మండల అధ్యక్షులు భోగ శేఖర్, తంగేడుపల్లి ఆంజనేయులు, తొంట వినయ్, విఠల్ గుప్త, కిషన్ గౌడ్,అంగారి రమేష్ గౌడ్, జగుపతి, మానయ్య పాల్గొన్నారు.

## బోరు విషయంలో అన్నదమ్ముల మధ్య కొట్లాట

ఐదుగురికి తీవ్ర గాయాలు..ఇద్దరి పరిస్థితి విషమం...

పోలీసులకు ఫోన్ చేసినా పట్టించుకోలేదు..



**ప్రజాపక్షం/శివ్వంపేట :** మెదక్ జిల్లా శివ్వంపేట మండలం తిమ్మాపూర్‌లో అన్నదమ్ముల మధ్య బోరు విషయంలో అన్న కుటుంబంపై తమ్ముడి కుటుంబం గొడ్డలి, కొడవళ్లు, కట్టెలతో దాడి చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన అన్నదమ్ములైన బాలయ్య, భిక్షపతి కుటుంబీకుల మధ్య బోరు వేసే విషయంలో గొడవ జరిగింది. దీంతో బాలయ్య కొడుకులు నర్సింలు, యాదగిరి, అంజమ్మతో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. దాడి జరిగిన విషయాన్ని డయల్ 100కు ఫోన్ చేసినా వెంటనే స్పందించలేదని బాధితులు తెలిపారు. దాడిచేసిన భిక్షపతి, ప్రసాద్, రాజు, సుశీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పదో తరగతి పరీక్షల ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో 68 పరీక్ష కేంద్రాలు

పరీక్షలు రాయనున్న 10,388 మంది విద్యార్థులు



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:** మెదక్ జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. జిల్లాలో 10,388 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనుండగా 68 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9:30 నుంచి 12:30 వరకు విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలకు దాదాపు 590 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్షల సందర్భంగా ప్రభుత్వం జిల్లాకు నియమించిన ప్రత్యేక అబ్జర్వర్ తోపాటు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయనున్నారు. 03 ఫ్లైయింగ్ స్క్వాడ్ (17) సిట్టింగ్ స్క్వాడ్ లు, (68) చీఫ్ సూపరింటెండెంట్ లు, (70) డిపార్ట్మెంటల్ అధికారులను నియమించారు. పరీక్ష కేంద్రాలలో మాల్ ప్రాక్టీస్ కు ఆస్కారం లేకుండా విద్యార్థులు సీసీ కెమెరాల నిఘా నీడలో పరీక్షలు రాసే విధంగా చర్యలు చేపట్టారు. మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, నిరంతర విద్యుత్, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉండేలా తగు జాగ్రత్త చర్యలు చేపట్టారు. పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమల్లో ఉంటుందని, గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడమైందని అధికారులు వెల్లడించారు.

**విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరు-కోవాలి**

**సెల్ ఫోన్లు నిషేధం.. డిఇఒ రాధా కిషన్**

పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, మొబైల్ ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేది లేదని నిషేధించడం జరిగిందని డిఈఓ రాదా కిషన్ తెలిపారు. ఉదయం 9:30 ల నుంచి 12:30 నిమిషాలకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులు 8:30 నిమిషాల వరకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని స్పష్టం చేశారు.

**పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జిల్లా కలెక్టర్**

జిల్లాలో పదవ తరగతి పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం హవేళీఘన్పూర్ మండలం సర్దన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, విద్యార్థులకు తాగునీరు, బెంచీలు, బల్లలు, కుర్చీలు, మూత్రశాలల సౌకర్యం వంటి అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. పోలీస్ ఎస్కార్ట్ తో ప్రభుత్వ వాహనంలో నిర్దేశించిన ఆయా రూట్లలో మాత్రమే పరీక్ష పేపర్లను పరీక్ష కేంద్రాలకు తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ఎక్కడా కూడా మాల్ ప్రాక్టీస్ కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు తమ సందేహాల నివృత్తికిజిల్లా విద్యా కార్యాలయాల్లో 9491676947, 9502494882! కంట్రోల్ రూం నంబర్ లో సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

## మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలి

కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి:** నిర్మల్ కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో మార్చి 8 మహిళా దినోత్సవం పురస్కరించుకొని,జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ అధికారులకు సమాఖ్య సభ్యులు పూల మొక్కలను అందించి స్వాగతం పలికారు.కలెక్టర్,అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,మహిళలు నేడు తమ స్వయంకృషితో అన్ని రంగాలలో రాణించగలుగుతున్నారని తెలిపారు. నిర్మల్ జిల్లా స్వయం సహాయక సంఘాలకు జాతీయస్థాయిలో అనేక అవార్డులు లభించాయని, ఇది ఎంతో గర్వకారణమైన విషయమని తెలిపారు. జిల్లా పేరును జాతీయ స్థాయిలో నిలబెట్టినందుకుగాను డిఆర్డిఓ విజయలక్ష్మి ,మహిళా సంఘాలకు అభినందనలు తెలియజేశారు.ఇదే ఉత్సాహంతో ముందుకు సాగుతూ, భవిష్యత్తులో స్వయం సహాయక సంఘాలు మరిన్ని అవార్డులు, ప్రోత్సాహకాలు సాధించాలని ఆకాంక్షించారు.నిర్మల్ జిల్లాకు మహిళా సంఘాలే బ్రాండ్ అంబాసిడర్లని కొనియాడారు.నిర్మల్ కొయ్య బొమ్మలను భావితరాలకు అందించుటకై కొయ్య బొమ్మల తయారీలో వినియోగించే పొనికి కర్రలను ఉత్పత్తి చేయడానికి సమాఖ్య ఆధ్వర్యంలో పొనికి వనాలు పెంచడం గొప్ప విషయం అన్నారు.మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని,అందుకుగాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారితకు ఎన్నో రకాల పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాయని తెలిపారు.పథకాలన్నింటినీ మహిళలు సద్వినియోగపరుచుకొని వ్యాపారం,స్వయం ఉపాధి ఏర్పరచుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు.జిల్లా స్వయం సంఘాలు బ్యాంకు లింకేజీ, రుణ వితరణ, తదితర అంశాలలో అగ్రగామిగా ఉందన్నారు. మితిమీరిన ఎరువులు వాడి పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా నేడు ఎన్నో రకాల వ్యాధులకు గురవుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, డిఆర్డిఓ విజయలక్ష్మి, జిల్లా మహిళా సమాఖ్య సంఘం అధ్యక్షురాలు గంగామణి,మహిళ సమాఖ్య సభ్యులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలి:ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ఖానాపూర్:** ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం చైర్మన్, వైస్ చైర్మన్ తో పాటు 16 మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తో కలిసి నిర్మల్ డిసిసి అధ్యక్షుడు శ్రీహరిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ గుర్తిస్తుందని, బైట దొంగలతో భయం లేదు కానీ ఇంటి దొంగలతోనే భయమని, అలాంటి వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అన్నారు. గ్రామాలలో ప్రజలతో ఉండి వారి సమస్యలను నా దృష్టి కి తీసుకురావాలని అన్నారు. నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ సభ్యులు రైతులకు అందుబాటులో ఉండి ఏ సమస్య రాకుండా చూడలని సూచించారు.అదే విధంగా డిసిసి మాట్లాడుతూ దేశంలో ఏ పార్టీ చేయ్యలేని సాహసం చేసి బీసీ కులగణన, ఎస్సీ రిజర్వేషన్ చేసి అందరికి న్యాయం చేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అందరిది అని కులమతాలకు అతీతంగా ఉంటుందని అన్నారు. అదే విధంగా నూతన చైర్మన్ గా ఎంపిక చేసిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కు, డిసిసి అధ్యక్షుడు శ్రీహరిరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఖానాపూర్, కడెం, దస్తూరాబాద్, పెంబి మండలాల రైతుల సమస్యలను మార్కెట్ కమిటీ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. రైతులకు అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మజీద్, ఖానాపూర్, పెంబి మండల అధ్యక్షుడు దొనికేని దయానంద్, స్వప్నీల్ రెడ్డి,నిమ్మల రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, వివిధ మండల రైతులు, పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

కలెక్టర్ రాహుల్ రాజ్

గంజాయి నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్: ఎస్పి ఉదయ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:** మెదక్ జిల్లాలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం చేస్తూ, నియంత్రణకు పకడిబందీగా కార్యాచరణ చర్యలు అమలు చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తో కలిసి సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డిపిఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాధక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలపై కలెక్టర్ చర్చించారు. మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణ తీసుకోవాల్సిన చర్యల పై ప్రతి 3 నెలలకు ఒకసారి జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, మన జిల్లాలో గంజాయి నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని తెలిపారు. గంజాయి అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, అదే సమయంలో డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే నష్టాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి సమస్యలు పరిష్కరిస్తాం

కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/ దండేపల్లి/మంచిర్యాల ప్రతినిధి :** జిల్లా రైతులు ఒకే పంటను పునరావృతంగా సాగు చేయకుండా డిమాండ్ ఉన్న ఇతర పంటల వైపు మొగ్గు చూపాలని, అలాగే నీటిపారుదల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం దండేపల్లి మండలంలోని నాగసముద్రం, మాకులపేట గ్రామాల్లో పంట పొలాలను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వరి పంట స్థితిగతులు, నీటి అందుబాటు, వాతావరణ ప్రభావం వంటి అంశాలపై రైతులతో చర్చించారు. కడెం కాలువ నుంచి కింది ఆయకట్టుకు నీరు అందేలా చూడాలని కోరిన రైతులకు, ఇరిగేషన్ అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, నీటి వసతి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అదనపు నీరు అవసరం లేని పంటలు సాగు చేయడం మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి జాగర్లమూడి ప్రసాద్, వ్యవసాయ అధికారి గొర్ల అంజీత్ కుమార్, డిప్యూటీ తహసిల్దార్ విజయ, ఆర్ఐ బొద్దుల భూమన్న, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీ కన్య పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభం



**ప్రజాపక్షం/బాన్సువాడ:** వర్ని, చందూరు సొసైటీ పరిధిలోని కేంద్రాలలో యాసంగి పంట వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా రైతులు పండించిన ధాన్యాన్ని ధాన్యపు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసిలు అంబర్‌సింగ్, శ్రీనివాస్ గౌడ్, నేమాని బుజ్జి, గోపాల్, శ్రీనివాస్, సాయిబాబా, అశోక్, సాయిరెడ్డి, అధ్యక్షులు శనిగరం కిషన్, అజయ్, రాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి



ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

అర్బన్ ఎమ్మెల్యే, కలెక్టర్‌తో కలిసి

అమృత్ 2.0 పనుల ప్రగతిపై సమీక్ష

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** ప్రజలకు మౌలిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు వీలుగా ఆయా పథకాల కింద నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ అలీ షబ్బీర్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతులతో కలిసి అమృత్ 2.0 పథకం పనుల ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. సుమారు 400 కోట్ల విలువ గల పనులకు గత జనవరిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి షబ్బీర్ అలీ ఇతర ప్రతినిధులు శంకుస్థాపనలు చేసిన విషయం విధితమే. ప్రస్తుతం ఆ పనులు ఏ దశలో కొనసాగుతున్నాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిధుల కొరత ఎంతమాత్రం లేదని, పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయించేందుకు అధికారులు అంకితభావంతో కృషి చేయాలని హితవు పలికారు. ముఖ్యంగా ప్రస్తుత వేసవి సీజన్‌లో నగరంలో ఇంటింటికి రక్షిత మంచినీరు సరఫరా అయ్యేలా పకడ్బంధీ పర్యవేక్షణ జరుపాలన్నారు. రోడ్లు ఇతర పెండింగ్ పనులను పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో నుడా చైర్మన్ కేశ వేణు, మున్సిపల్ కమీషనర్ దిలీప్‌కుమార్, ఆర్‌అండ్‌బి పంచాయతీరాజ్ పబ్లిక్ హెల్త్ మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

**కళ్యాణలక్ష్మీ షాదీముబారక్ చెక్కుల పంపినీ:** అనంతరం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణ, నిజామాబాద్ సౌత్, నార్త్ మండలాల లబ్ధిదారులకు జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో షాదీముబారక్, కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 565 మందికి రూ.5.65 కోట్ల పైచిలుకు విలువ చేసే చెక్కులను అందజేశారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ఎసిపి రవికుమార్



**ప్రజాపక్షం/ మందమర్రి:** రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని బెల్లంపల్లి ఎసిపి రవి కుమార్ తెలిపారు. గురువారం రోడ్డు ప్రమాదాల నివారణ కోసం మందమర్రి సర్కిల్ పరిధిలో ప్రమాద స్థలాలను (బ్లాక్ స్పాట్లు) సందర్శించారు. ఈ సందర్భంగా ఎసిపి రవికుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని, జాతీయ రహదారిపై ప్రమాదాలను తగ్గించేందుకు వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు, రోడ్డు మధ్య లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్న అంశంపై పరిశీలన జరిపినట్లు వివరించారు. సంబంధిత అధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు.ఈ పరిశీలన కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి, రామకృష్ణాపూర్ ఎస్ఐ జి. రాజశేఖర్, మందమర్రి ఎస్ఐ ఎస్. రాజశేఖర్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మళ్లీ 'యంత్రలక్ష్మి'షురూ...

అధికార పార్టీ వారికే మళ్ళీ అవకాశాలా?



**ప్రజాపక్షం/నందిపేట్:** రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం గత కొన్నేళ్ళుగా ఆగిపోయిన యంత్ర లక్ష్మి పథకం మళ్ళీ ఈ యాసంగి నుంచే ప్రారంభించనున్నట్టు శాసనసభ సమావేశాలలో ప్రకటించింది. ఇందుకుగాను బడ్జెట్‌లో 20 కోట్ల రూపాయలు కేటాయించింది. ఇది చిన్న సన్నకారు రైతులకు శుభవార్తే. కానీ అక్కడే రైతులు భయపడుతున్నారు. గతంలో అధికారంలో ఉన్న పార్టీ నాయకులకు ఈ పథకం కింద ప్రజాప్రతినిదులు నిధులు మంజూరు చేసి విమర్శల పాలయ్యారు. ప్రస్తుతం కూడా అదే పరిస్తితి రావచ్చని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత కొన్నేళ్ళ క్రితం ఈ పథకం ఆగిపోయింది. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం వ్యవసాయదారుల కోసం రాష్ట్రాలకు నిధులు విడుదల చేస్తుంది. అంతే మొత్తం రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించి ఆర్థిక సంవత్సరం ముగింపు లోపున ఖర్చు చేయాలి. లేకుంటే ఆ నిధులు కేంద్రానికి వాపసు తిరిగి వెల్తాయి. అందుకే ఈసారి కేంద్రం తెలంగాణకు 26 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. ఈ పథకంలోభాగంగా రైతులకు ట్రాక్టర్‌లు, పసుపు శుద్ధి యంత్రాలు, వరికోత యంత్రాలు, పవర్ స్ప్రేయర్‌లు టార్పాలిన్లు దుక్కి నాగళ్లు వంటి వాటికి 50 శాతం సబ్సిడి కింద మంజూరు చేశారు. చాలా మంది అర్హులు కాని రైతులకు, పెద్ద రైతులకు మేలు జరిగింది. కొందరు అధికార పార్టీ నాయకులకు, పేద రైతుల పేర్ల మీద యంత్రలక్ష్మి మంజూరు చేయించుకొని అర్హులైన వారికి డబ్బులు ఇచ్చి లాభం పొందడం, అధికారులు మద్దతు ఇవ్వడంతో అర్ధాంతరంగా మద్యలోనే ఈ పథకం ఆగిపోయింది. అందుకే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులని గుర్తించి రైతులకు మేలు జరిగేలా బాధ్యత వ్యవసాయాధికారులకు అప్పగించనున్నట్టు ఆలోచనలో ఉంది. ఇలా అయితే రైతులకు మేలు జరిగి యంత్రలక్ష్మి అభాసుపాలు కాకుండా ఉంటుంది. మంజూరు అధికారం రెవెన్యూ వ్యవసాయ శాఖ, జిల్లా ఉన్నతాధికారులతో కూడిన కమిటీ ఉంటే బాగుంటుందని అందరి ఆలోచన. ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందో చూడాలి.

## క్రీడ

# బిసిసిఐ నయా రూల్..
## ఇక టాస్‌తో భయం లేదు!

ఐపిఎల్ 2025 సీజన్ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) కీలక నిర్ణయాలు తీసుకుంది. మార్చి 22 నుంచి ఈ క్యాష్ రిచ్ లీగ్‌కు తెరలేవనుండగా.. గురువారం పది ఫ్రాంచైజీల కెప్టెన్లతో బీసీసీఐ సమావేశం నిర్వహించింది. పలు అంశాలే ఏజెండాగా జరిగిన ఈ సమావేశంలో బీసీసీఐ కీలక నిర్ణయాలు తీసుకుంది. లీగ్‌లో చేయాల్సిన మార్పుల చేర్పులపై సలహాలు, సూచనలను కెప్టెన్లను స్వీకరించింది.



అయితే రాత్రి జరిగే మ్యాచ్‌లకు మాత్రమే ఈ రూల్‌ను అమలు చేయనున్నారు. అది కూడా 11వ ఓవర్ తర్వాత డ్యూ ఉందా? లేదా? అని అంపైర్ పరిశీలించి కొత్త బంతిపై నిర్ణయం తీసుకుంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్‌లను ఒక్క బంతితోనే ఆడిస్తారు.

### 1. సలైవాపై నిషేధం ఎత్తివేత..

ఐపీఎల్ సారథుల విజ్ఞప్తి మేరకు సలైవాపై విధించిన నిషేధాన్ని ఎత్తేసింది. ఇక నుంచి బౌలర్లు బంతి షైన్ కోసం ఉమ్మిని వాడవచ్చు. సాధారణంగా సలైవా వాడటం వల్ల బంతి తన మెరుపును కోల్పోకుండా ఉండి రివర్స్ స్వింగ్‌కు సహకరిస్తోంది. ఎన్నో ఏళ్లుగా బౌలర్లు ఉమ్మిని వాడుతున్నప్పటికీ.. కరోనా నేపథ్యంలో సలైవాను వాడకుండా ఐసీసీ నిషేధం విధించింది. ఇప్పుడు కరోనా ప్రభావం లేకపోవడంతో ఈ నిషేధాన్ని ఎత్తేయాలని బౌలర్లు కోరారు. ఈ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న బీసీసీఐ.. ఈ నిషేధాన్ని ఎత్తేసింది.

### 2. కొంత్త బంతితో డ్యూకు చెక్

అంతేకాకుండా బ్యాటర్ల ఆధిపత్యం కొనసాగే ఈ ధనాధన్ లీగ్‌లో బౌలర్లకు అనుకూలంగా మరో నిర్ణయాన్ని తీసుకుంది. మ్యాచ్ ఫలితాలపై డ్యూ ప్రభావం చూపిస్తుండటంతో బీసీసీఐ కొత్త రూల్‌ను ప్రవేశ పెట్టింది. అప్‌కమింగ్ సీజన్ నుంచి రెండో ఇన్నింగ్స్‌లో రెండు బంతులను ఉపయోగించనున్నారు. రెండో ఇన్నింగ్స్ 11వ ఓవర్ తర్వాత కొత్త బంతిని ప్రవేశ పెట్టనున్నారు. దాంతో మ్యాచ్ ఫలితాలపై టాస్ ప్రభావం కూడా తగ్గనుంది. గతంలో టాస్ గెలిచిన జట్లు ఎక్కువగా ఫీల్డింగ్ ఎంచుకునేవి. డ్యూ ప్రభావం కారణంగా రెండో ఇన్నింగ్స్‌లో బంతి తడిగా మారి బౌలర్ల చేతుల్లో నుంచి జారిపోయేది. దాంతో కచ్చితమైన లైన్ అండ లెంగ్త్‌లో బంతులు వేయలేక బౌలర్లు పరుగులు సమర్పించుకునేవారు. రెండో ఇన్నింగ్స్ 11వ ఓవర్ తర్వాత కొత్త బంతిని ప్రవేశపెడితే బౌలర్లకు ఆ సమస్య తప్పనుంది.

### 3. ఇంపాక్ట్ రూల్ కొనసాగింపు..

ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ను తీసేయాలనే డిమాండ్‌ను బీసీసీఐ పట్టించుకోలేదు. ఈ రూల్ కారణంగా ఆల్‌రౌండర్లకు అన్యాయం జరుగుతుందని రోహిత్ శర్మ వంటి ఆటగాళ్లు అభిప్రాయపడ్డారు. ఈ విమర్శల నేపథ్యంలోనే ఈ రూల్‌ను ఎత్తేస్తారనే ప్రచారం జరిగింది. కానీ యువ ఆటగాళ్లకు మేలు చేస్తున్న ఈ రూల్‌ను కొనసాగించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఎంతో మంది యువ ఆటగాళ్లు ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగి సత్తా చాటారు. అయితే ఈ రూల్స్ మార్పులపై ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన అయితే రాలేదు.

## ఐపిఎల్ ఆరంభ మ్యాచ్‌కు వర్షం ముప్పు

ఇండియన్ ప్రీమియర్ లీగ్2025 సీజన్‌లో ఆరంభ మ్యాచ్‌కు వరుణుడి ముప్పు పొంచి ఉంది. మార్చి 22న కోల్‌కతాలోని ఈడెన్‌గార్డెన్స్ వేదికగా డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తలపడనున్నాయి. ఈ మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న అభిమానుల ఆశలపై వరుణుడు నీళ్లు చల్లే అవకాశముంది.



రానున్న రోజుల్లో పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు, ఆరంభ మ్యాచ్‌కు ముందు ఈడెన్ గార్డెన్స్‌లో అట్టహాసంగా వేడుకలు నిర్వహించడానికి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. నటి దిశా పటాని, గాయని శ్రేయా ఘోషల్ ఆడిపాడనున్నారు. కానీ, వర్షం వల్ల వేడుకలు, మ్యాచ్‌కు ఆటంకం ఎదురయ్యే అవకాశం ఉంది. పశ్చిమ బెంగాల్‌లోని బిర్భూమ్, ముర్షిదాబాద్, నాడియా, తూర్పు బర్ధమాన్ జిల్లాలు, ఉత్తర, దక్షిణ 24 పరగణాలు, తూర్పు మిడ్నాపూర్ జిల్లాల్లో గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, మెరుపులు, వడగళ్లతో కూడిన వర్షాలు మార్చి 20 22 మధ్య కురవొచ్చు అని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో ఐపీఎల్ నిర్వాహకులతో పాటు, అభిమానుల్లోనూ ఉత్కంఠ నెలకొంది.

## ప్లీజ్.. సపోర్ట్
### హార్దిక్ పాండ్యా



ఐపిఎల్ 2025 సీజన్ ప్రారంభానికి ముందు మీడియాతో మాట్లాడిన హార్దిక్ పాండ్యా అభిమానులను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశాడు. 'నేను బ్యాటింగ్‌కు వచ్చినప్పుడు నన్ను ప్రోత్సహించండి. నేను సిక్స్ కొట్టినప్పుడు గట్టిగా అరుస్తూ మరింత మద్దతు తెలపండి. టాస్ కోసం వచ్చినప్పుడు.. బౌలింగ్ చేస్తున్నప్పుడు కూడా నాకు అండగా నిలవండి. వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్ జెర్సీ కలర్ తప్పా మరే రంగును చూడకూడదనుకుంటున్నా. మిమ్మల్ని నేను కోరేది ఒక్కటే.' అని హార్దిక్ పాండ్యా చెప్పుకొచ్చాడు. ఈ వ్యాఖ్యలు గతేడాది అతనికి జరిగిన అవమానాన్ని మరిచిపోలేదనే విషయాన్ని సూచిస్తున్నాయి. నిషేధం కారణంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగే తొలి మ్యాచ్‌కు హార్దిక్ పాండ్యా దూరమయ్యాడు. అతని స్థానంలో సూర్యకుమార్ యాదవ్ జట్టును నడిపించనున్నాడు.



## నా హృదయం కృతజ్ఞతతో
# నిండిపోయింది
### - మెగాస్టార్ చిరంజీవి

అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి అరుదైన ఘనత సాధించాడు. సినీరంగంలో ఆయన అందించిన సేవలకు గాను యూకే పార్లమెంట్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్‌లో 'బ్రిడ్జ్ ఇండియా' అనే సంస్థ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందజేసింది. గత నాలుగున్నర దశాబ్దాలుగా సినిమా రంగం ద్వారా కళలకు, సమాజానికి అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు ఆయనకు లభించింది. అయితే తాజాగా ఈ విషయంపై ట్విట్టర్‌లో స్పందించాడు చిరంజీవి. హౌస్ ఆఫ్ కామన్స్‌లో తనకు జరిగిన సత్కారం గురించి మాటల్లో చెప్పలేను. యూకే పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, దౌత్యవేత్తలు, ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో.. నన్ను సత్కరించినందుకు హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. 'బ్రిడ్జ్ ఇండియా' సంస్థ జీవిత సాఫల్య పురస్కారం నేను అందుకోవడం సంతోషంగా ఉంది. ఈ పురస్కారం నాకు ఒక గౌరవం మాత్రమే కాదు, నా సినిమా, సామాజిక సేవ, సాంస్కృతిక నాయకత్వంలో నా ప్రయాణాన్ని మరింత ఉత్సాహంగా ముందుకు తీసుకెళ్లే ప్రేరణని అందిస్తోంది అని చిరంజీవి రాసుకోచ్చాడు.

## లీల



## మాతృత్వపు మాధుర్యాన్ని
# ఆస్వాదిస్తున్నా
### - దీపికా పదుకొణె

బాలీవుడ్ నటి దీపికా పదుకొణె గతేడాది ఆడబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. తన బిడ్డతో కొంతకాలంగా సరదాగా గడిపిన దీపికా తిరిగి షూటింగ్‌లలో పాల్గొనేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈనేపథ్యంలో తల్లిగా తన కుమార్తెతో సమయం గడపడం, చిత్రీకరణలో పాల్గొనడం గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ''ఒక తల్లిగా చిత్రీకరణలో పాల్గొనడం అనేది ఎప్పుడూ సవాలే. ప్రస్తుతం నేను నా జీవితంలో మాతృత్వపు మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నాను. ఇకపై షూటింగ్‌లలో పాల్గొనేందుకు సిద్ధమవ్వాలి. నా కుమార్తెకు తల్లిగా నా బాధ్యతలను నిర్వర్తిస్తూనే చిత్రీకరణల్లో పాల్గొనాలి. ఈ విషయంలో సలహాలు ఇచ్చేందుకు ఎంతో మంది మహిళలు ఉన్నారని నాకు తెలుసు. కానీ, ఇది నాకు అతిపెద్ద సవాలుగా కనిపిస్తోంది. దీన్ని ఎలా ఎదుర్కోవాలో ఆలోచిస్తున్నాను. కచ్చితంగా దీన్ని ఎదుర్కొంటాననే నమ్మకం నాకు ఉంది. మాతృత్వం అనేది గొప్ప అనుభూతి. ఇది నేను ఎంచుకొనే సినిమాలపై ప్రభావం చూపుతుందని నాకు తెలుసు. నేను తల్లి కాకముందు కూడా సినిమాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకున్నాను. ఇకపై కూడా అలానే తీసుకుంటాను'' అని దీపికా చెప్పారు.



## 'ఆన్‌లైన్ గేమ్స్'పై విజయ్ దేవరకొండ
# టీమ్ క్లారిటీ

ప్రస్తుతం ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ అంశం యూట్యూబర్స్ నుంచి టాలీవుడ్ సెలబ్రిటీల వరకు పాకింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ చేసినందుకు పలువురు టాలీవుడ్ స్టార్స్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక ఈ జాబితాలో టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ కూడా ఉన్నాడంటూ వార్తలు వస్తున్నాయి. తాజాగా ఈ అంశంపై విజయ్ దేవరకొండ పీఆర్ టీమ్ ఓ ప్రెస్ నోట్ విడుదల చేసింది. విజయ్ దేవరకొండ ఓ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం నైపుణ్యాన్ని పెంచుకునే గేమ్స్‌ని మాత్రమే ఆయన ప్రమోట్ చేశారని.. ఇది అన్ని విధాలుగా చట్టానికి లోబడి ఉందని.. కేవలం కొన్ని ప్రాంతాల వరకే ఇది పరిమితంగా ఉందని విజయ్ దేవరకొండ టీమ్ పేర్కొంది. ఆయన ఏదైనా అగ్రిమెంట్ చేసే ముందు ఆయన లీగల్ టీమ్ పూర్తి పరిశీలన తర్వాతే, విజయ్ ఆ అగ్రిమెంట్ ఓకే చేస్తారని.. ఇప్పటివరకు ఆయన ప్రమోట్ చేసిన గేమ్స్ కేవలం స్కిల్ బేస్ట్ గేమ్స్ మాత్రమే అని విజయ్ తరపు టీమ్ ప్రకటించింది. అయితే, ఈ ఒప్పందం 2023లో ముగిసిందని.. ప్రస్తుతం ఆయన ఎలాంటి ఆన్‌లైన్ గేమ్స్ ప్రమోట్ చేయడం లేదని.. ఆయనకు సంబంధించి ఎలాంటి తప్పుడు వార్తలు ప్రేక్షకులు, అభిమానుల్లోకి వెళ్లకూడదని తమ టీమ్ ఈ ప్రకటన జారీ చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మొత్తానికి విజయ్ దేవరకొండ ప్రమోట్ చేసిన ఆన్‌లైన్ గేమ్స్ ఎలాంటి చట్టవ్యతిరేకమైనవి కావని వారు క్లారిటీ ఇచ్చారు.

# 4 రోజులు వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం ముందని అధికారులు చెప్పారు. గురువారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. శుక్రవారం ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, వడగళ్లతో కూడిన వర్షాలు పడుతాయన్నారు. ఈ సమయంలో గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేయగా, నిర్మల్, నిజామాబాద్, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. ఆదివారం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడ వడగళ్ల వర్షాలు కురుస్తాయన్నారు. ఉరుములు, మెరుపులతో పాటు పెనుగాలులు వీస్తాయని అధికారులు హెచ్చరించారు.

# రాష్ట్ర చరిత్రలో కొత్త రికార్డు

### విద్యుత్ సరఫరా17,162 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్‌కు చేరుకుంది : భట్టి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ సరఫరా17,162 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్‌కు చేరుకున్నప్పటికి కూడ ఎక్కడ చిన్న ఇబ్బంది లేకుండా ప్రజా ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేస్తుందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖమంత్రి భట్టి విక్రమార్క మల్లు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. 17,162 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్‌కు చేరడం రాష్ట్ర చరిత్రలో కొత్త రికార్డు నెలకొందన్నారు. 2023–24లో (2024 మార్చి 8న) గరిష్టంగా 15,623 మెగావాట్ల డిమాండ్ మాత్రమే నమోదు కాగా, తెలంగాణ పవర్ యుటిలిటీలు 2025 మార్చి 20న సాయంత్రం 4:39 గంటలకు 17,162 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్‌కు చేరిందన్నారు. 2023 డిసెంబర్ నుండి ప్రజా ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, చర్యల ఫలితంగా వేసవికాలంలో మరింత పెరిగే విద్యుత్ డిమాండ్‌ను తీర్చేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించుకొని, విద్యుత్ ఉత్పత్తి పెంచడం, ప్రసార, పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడం వంటి చర్యలు చేపట్టిందన్నారు. పారిశ్రామిక, వాణిజ్య, ఐటీ కార్యాలయాల కార్యకలాపాలు పెరగడంతో గత సంవత్సరాలతో పోలిస్తే డిమాండ్ ఈ వేసవిలో భారీగా పెరిగిందని వెల్లడించారు. అయినప్పటికీ, ప్రభుత్వం అన్ని వర్గాల వినియోగదారులకు, వ్యవసాయానికి కూడా నిరంతరంగా విద్యుత్‌ను నాణ్యతగా సరఫరా చేస్తున్నామని చెప్పారు. టిజి జెన్‌కో, టిజి ట్రాన్స్‌కో, టిజి ఎస్‌పిడిసిఎల్, టిజి ఎన్‌పిడిసిఎల్ ఉద్యోగులందరూ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో నిరంతరం పని చేస్తున్నందుకు ఆయన అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఉద్యోగులందరూ వినియోగదారులకు నిరంతర, విశ్వసనీయ విద్యుత్ సరఫరా అందించడానికి మరింత అంకితభావంతో పని చేయాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

# ఆత్మహత్యలు పరిష్కారం కాదు..

### తల్లిదండ్రులను కడుపుకోతకు గురిచేయొద్దు
### టిజిఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి డాక్టర్ వి.ఎస్.అలగు వర్షిణి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడి, కని పెంచిన తల్లిదండ్రులను కడుపు కోతకు గురి చేయవద్దని టిజిఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి డాక్టర్ వి.ఎస్.అలగు వర్షిణి విజ్ఞప్తి చేశారు. గురుకుల విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులు భావోద్వేగ పరిస్థితులను అధిగమించి, క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడకుండా అవగాహన కల్పించేందుకు టిజిఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ ఆధ్వర్యంలో గురువారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి(ఎంసిహెచ్‌ఆర్‌డి)లో గురుకుల విద్యా సంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నాలుగు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. అంతర్జాతీయ శిక్షణ, వ్యక్తిత్వ వికాస సంస్థ 'మాజిక్ ఆఫ్ ఛేంజ్' భాగస్వామ్యంతో నిర్వహించారు. 'మాజిక్ ఆఫ్ ఛేంజ్' సంస్థ వ్యవస్థాపకుడు, అంతర్జాతీయ మాస్టర్ ట్రైనర్, వ్యక్తిత్వ వికాస నిపుణులు మొహమ్మద్ రఫీ (మ్యాజికల్ రఫీ) సుమారు 250 మంది గురుకుల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. భావోద్వేగ పరిస్థితులను అధిగమించి అభ్యసన సామర్థ్యాన్ని మరింత పెంపొందించేలా కార్యక్రమం నిర్వహించారు.



విద్యార్థులో మానసిక పరివర్తన ఒత్తిడిని అధిగమించడం వంటి అంశాలపై సమగ్రమైన శిక్షణను అందించారు. విద్యార్థుల భావోద్వేగ అవసరాలను అర్థం చేసుకోవడం, ప్రేరణను పెంపొందించడం, తరగతిలో భావోద్వేగ సమస్యలను పరిష్కరించడంలో ఉపాధ్యాయులకు ఎంతో సహాయపడుతుంది. ఇలాంటి శిక్షణ తరగతులను నిర్వహించడం ఇదే మొదటి సారికావడం విశేషం. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు డాక్టర్ అలగు వర్షిణి సారథ్యంలో జరిగాయి. ఉపాధ్యాయులతో జరిగిన చర్చ కార్యక్రమంలో ఆమే పాల్గొన్నారు. ఈ సందర్భంగా అలగు వర్షిణి మాట్లాడుతూ గురుకుల విద్యా సంస్థల్లో ఆత్మహత్యలు చేసుకోవాలనే ఆలోచన విరమించుకోవాలని సూచించారు. కన్నబిడ్డలు చనిపోతే తల్లిదండ్రుల మానసిక క్షోభను ఒక్కసారి ఆలోచించాలని కోరారు. ఆత్మహత్యలు పరిష్కారం కాదని, నిరాశ నిస్పృహలో దైర్యంగా నిలిచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.





హైదరాబాద్‌లోని గిరిప్రసాద్ భవన్‌లో

# కమ్యూనిస్టుల ఎజెండా

(మొదటి పేజీ తరువాయి)

శాసనమండలిలో గొంతు వినిపించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేపించడానికి పనిచేస్తామన్నారు. గత పది ఏండ్లుగా శాసనసభలో, శాసనమండలిలో పేదల పక్షన మాట్లాడే గొంతుక కమ్యూనిస్టులు లేకపోవడం వల్ల ప్రజా సమస్యలు పరిష్కరించలేదని నేడు శాసనసభలో, ఎంఎల్‌ఏ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావుతో పాటు శాసన మండలిలో సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ఇద్దరు పేదల పక్షాన బలమైన వాణి వినిపిస్తారన్నారు. ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎస్‌ఎల్ బిసి, డిండి ఎత్తిపోతల పథకం, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్ట్ తోపాటు మూసి పరివాహక ప్రాంతంలోని కాల్వలు పూర్తి చేయడంలో గత ప్రభుత్వం ఏడు ఎనిమిది సంవత్సరాల కాలం పాటు మాటలతో కాలం గడుపుతూ నిర్లక్ష్యానికి గురిచేశారని విమర్శించారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రాజెక్టులో పూర్తి కోసం సాంకేతికపరమైన అనుమతులు తీసుకొని పూర్తి చేయాలని లేని పక్షంలో ప్రభుత్వాన్ని ఒప్పించి, మెప్పించి అవసరమైతే పోరాటాలు చేస్తామన్నారు.

### ప్రజల గొంతుకగా శాసనమండలిలో ప్రశ్నిస్తా : ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం

రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నాకు ఇచ్చిన అవకాశంతో శాసనమండలిలో ప్రజా గొంతుకగా శాసనమండల్లో ప్రశ్నిస్తానని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో నాటి నుంచి నేటి వరకు పీడిత తాడిత అనగారిన వర్గాల పేద ప్రజల పక్షాన కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తుందని అదే స్ఫూర్తితో తాను కూడా పని చేస్తానన్నారు. సన్మాన కార్యక్రమానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి,సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, మల్లెపల్లి ఆదిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, బంటు వెంకటేశ్వర్లు, బలుగూరి నరసింహ, టి వెంకటేశ్వర్లు,గురుజ రామచంద్రం ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కురిమిద్దె శ్రీనివాస్, పల్లె నరసింహ, బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనంజయ నాయుడు, వివిధ మండల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. అనంతంర ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ను సిపిఐ పార్టీనాయకులు, ప్రజాసంఘాలతో పాటు కుల సంఘా లు, ఉపాధ్యాయ కార్మిక, మెడికల్ కార్మిక ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో పుష్ప గుచ్చలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు.

### ప్రజల కోసం కలిసి పని చేద్దాం : మంత్రి కోమటిరెడ్డి

కమ్యూనిస్టులు పదవుల కోసం కాకుండా ప్రజల కోసం పోరాడతారని అలాంటి వారితో కలిసి పని చేస్తానని తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కోటలో ఎమ్మెల్సీగా ఎన్నికైన నల్లగొండ సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం గురువారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి క్యాంప్ కార్యాలయంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి తో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యం ను శాలువాతో సన్మానం చేశారు. మంత్రిని కలసిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు ఉజ్జని రత్నాకర్ రావు, మల్లెపల్లి ఆదిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లొడంగి శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామిలు ఉన్నారు.

# మిర్చి రైతు చిత్తు

(మొదటి పేజీ తరువాయి)

తరలిస్తున్నారు. కనీసం ధర పలికినప్పుడు అయినా తమ మిర్చిని అమ్ముతామని చెబుతున్నారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కు ప్రస్తుత సీజన్లో మిర్చి కళ వచ్చేసింది. భారీగా సరుకు తరలిరావడంతో మార్కెట్ మొత్తం మిరప బస్తాలతో నిండిపోయింది. కాని ఇక్కడి వ్యాపారులు ధరలు తగ్గించడంతో రైతులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కు వెళ్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే మిర్చి ధరలు ఈసారి భారీగా పడిపోయాయి. గత ఏడాది ఇదే నెలలో క్వింటా మిర్చి రూ.22వేలు ధర పలుకగా ఈసారి అత్యధికంగా రూ.13వేలు మాత్రమే పలికుతున్నది. మిరప రకాలను బట్టి వ్యాపారులు సరుకు కొనుగోలు చేస్తున్నారు. పెట్టుబడులు విపరీతంగా పెరిగి ఒక్కో ఎకరానికి రూ.1లక్ష 50వేల వరకు ఖర్చు చేసినట్లు రైతులు చెబుతున్నారు. ఎన్నో కష్టనష్టాలకోర్చి పండించిన పంటను అమ్మేందుకు మార్కెట్ కు వస్తున్న రైతులను వ్యాపారులు రకరకాల మోసాలతో ధరలు అమాంతం తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు. జెండా పాట తరువాత రైతులు తెచ్చిన సరుకు నమూనాను ఒకటి, రెండు బస్తాలు కోసి పరిశీలించి సరుకును బట్టి ధర నిర్ణయిస్తారు. రైతుకు ఇష్టం ఉంటే అమ్ముకోవచ్చు లేకపోతే లేదు. ఇది సాధారణంగా జరిగే ప్రక్రియ. కాని సరుకును బట్టి ధరను నిర్ణయించిన తర్వాత కాంటాలు వేసే సమయంలో వ్యాపారులు కొర్రీలు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే అసలు సరుకును కొనబోమంటూ తెగేసి చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం మిర్చి పంటకు మంచి ధర పలకడంతో ఈసారి రైతులు పెద్ద ఎత్తున సాగు చేశారు. అయితే అకాల వర్షాలు, చీడ పీడలు, పురుగు వల్ల కొన్నిచోట్ల నష్టం జరిగింది. గురువారం మార్కెట్‌కు వచ్చిన మిర్చిని పరిశీలిస్తే తేజ రకం మిర్చి 17వేల బస్తాలు రాగా అత్యధిక ధర రూ.13,800 పలుకగా, వండర్ హాట్ 2100 బస్తాలు రాగా అత్యధికంగా రూ.16వేలు యూఎస్ 341 9500 బస్తాలు లాగా అత్యధిక ధర రూ.13,500, దీపిక 50బస్తాలు రాగా అత్యధిక ధర రూ.17,200 పలికింది. అయితే గతంతో పోలిస్తే ఈసారి ధరలు భారీగా పతనమైనట్లు తెలుస్తుంది. 2021 ఫిబ్రవరిలో అత్యధికంగా క్వింటా మిర్చికి ధర రూ.24వేలు పలుకగా 2022లో రూ.29వేలు, 2023లో రూ.33వేలు, 2024–25లో 22,100 పలికింది. కానీ ఈ సారి పూర్తిగా తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో మిర్చి రైతులు భారీగా నష్టపోతున్నారు.

### కూలీ ఖర్చులు రావడం లేదు

34 బస్తాల మిర్చి తీసుకువచ్చాను. ధర రూ.13వేలు పలికింది. గత ఏడాది మిర్చికి రూ.21వేలు ఉన్నది. ఈసారి పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చేటట్లు లేవు. ఎకరంన్నర భూమిలో మిర్చి సాగు చేస్తే రూ.రెండు లక్షల వరకు ఖర్చు వచ్చింది. గత ఏడాదితో పోలిస్తే దిగుబడి పెరిగింది కాని ధర మాత్రం తగ్గింది.

**–శక్రునాయక్ మిర్చి రైతు, పోచంపల్లి పెద్ద వంగర**

### రూ.20వేలు ఉంటేనే ధర గిట్టుబాటు

క్వింటా మిర్చి ధర రూ.20వేలు పైగా ఉంటేనే రైతుకు గిట్టుబాటు అవుతుంది. పెట్టుబడి కూలీల ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ఒక్కో కూలీకి రూ.300 చెల్లిస్తున్నాం. 17బస్తాలమిర్చిని తీసుకువస్తే రూ.13000 ధర పలికింది. నల్లి పురుగు రావడం వల్ల దిగుబడి తగ్గింది.

**–జాను, టిబితండా జఫర్‌గడ్**

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com